ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 30, అక్టోబరు 2025


వెల్లంపల్లిలోని ఓ ఇంట్లోకి చేరిన గుండ్లకమ్మ నీరు


ఒంగోలులో వర్షపు నీరు ఇంటిని చుట్టుముట్టడంతో మిద్దెపై ఉన్న ఓ కుటుంబం

చదలవాడల్లోని రామన్న చెరువు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

జలదిగ్బంధంలో ఉన్న ఒంగోలు

జల విలయం

జిల్లాపై విరుచుకుపడిన మొంథా

జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. జలప్రళయాన్ని సృష్టించింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు పడగా తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో కుండపోత కురిసింది. కేవలం 36 గంటల్లో ఏకంగా 18.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫలితంగా బుధవారం ఉదయం జిల్లాలో ఎటు చూసినా నీరే కనిపించింది. వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులు ఏకమైనట్లుగా పరిస్థితి నెలకొంది. దాదాపు లక్ష ఎకరాల్లో పంటలు నీట మునిగి దాదాపు రూ.250 కోట్ల మేర రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు వాగులు, వంకలు పొంగడంతో ప్రధాన మార్గాల్లో సైతం రవాణా నిలిచిపోయింది. అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దాదాపు వందకుపైగా గ్రామాలు, కాలనీలు జలమయమై వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. మరోవైపు చెరువులన్నీ నిండటంతో పాటు పలుచోట్ల గండ్లు పడ్డాయి. రోడ్లు చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా మారింది.


నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడి-ముప్పాళ్ల మధ్య చెరువును తలపిస్తున్న రోడ్డు, పంట పొలాలు

36గంటల్లో 18.4 సెం.మీ వర్షపాతం నమోదు

ఒంగోలులో 24 గంటల్లో 25.72 సెం.మీ వర్షం

లైలా తుఫాన్ నాటికన్నా 3 సెం.మీ అధికం

- తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో కుండపోత
- పశ్చిమ ప్రకాశంలోనూ భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- ఉధృతంగా పాలేరు, ముసి, ఇతర వాగులు
- నిండుకుండల్లా చెరువులు, అక్కడక్కడా గండ్లు
- లక్ష ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- వందకుపైగా గ్రామాలు, కాలనీలు జలమయం
- అనేకచోట్ల జలదిగ్బంధం, ఇళ్లలోకి నీరు
- 101 పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ధ్వంసమైన రోడ్లు, అధ్వానంగా పారిశుధ్యం
- విద్యుత్‌కు తీవ్ర అంతరాయం


ఒంగోలు కరుణా కాలనీలో నిలిచిన నీటిలో అవస్థలు పడుతున్న స్థానికులు

ఒంగోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో అనేక తుఫాన్లు జిల్లాపై చూపిన ప్రభావంతో పోల్చితే మొంథా సైలెంట్ కిల్లర్‌గా నష్టపర్చింది. సమీప ప్రాంతంలో తుఫాన్ తీరం దాటకపోయినప్పటికీ ఊహించని రీతిలో తెరపి లేకుండా 36గంటలు జోరువాన కురిసింది. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి బుధవారం ఉదయం వరకు ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు వర్షం కురుస్తూనే ఉంది. ప్రత్యేకించి మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకు తెరిపనేది లేదు. అలా 36 గంటల్లో జిల్లాలో 18.4 సెం.మీ వర్షపాతం నమోదు కాగా బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లోనే 16.33 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అయితే ఈ 24 గంటల్లో ఏకంగా 25.72 సెం.మీ కురిసింది. గతంలో సంభవించిన లైలా తుఫాన్ రోజు కురిసిన వర్షం కన్నా ఈసారి మరో 3 సెం.మీ అధికంగా పడింది. అలాగే ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ 20 నుంచి 25 సెం.మీ కురిసింది. ఒక్క దోర్నాల మినహా మిగతా అన్ని మండలాల్లో 10సెం.మీ కన్నా అధికంగానే వర్షపాతం నమోదైంది.

ఎటుచూసినా నీరే..

కొన్ని ప్రాంతాల్లో భారీగా, మరికొన్ని ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురవడంతో జిల్లా మొత్తం జలమయమైంది. ఇటీవలి అల్పపీడన ప్రభావంతో నాలుగైదు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసి నీటి వనరులు అన్నీ దాదాపు నిండి ఉన్నాయి. ఈ సమయంలో మొంథాతో మళ్లీ కుండపోత వాన కురవడంతో నదులు, వాగులు, వంకలు, చెరువులు ఇతరత్రా అన్ని వనరుల్లోకి వచ్చిన నీరు వచ్చినట్లు రోడ్లు, కాలువలు, పొలాలపైకి ప్రవహించింది. గిద్దలూరు సమీపంలో నల్లమల అడవుల నుంచి ప్రారంభమయ్యే గుండ్లకమ్మ నదికి అనేక చోట్ల భారీగా వరదనీరు వస్తూ గుండ్లకమ్మ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఇప్పటికే గుండ్లకమ్మ నిండుకుండలా ఉండగా బుధవారం గతంలో ఎన్నడు లేనంతగా వరద ఉధృతి

మిగతా 6వ పేజీలో

10,274 హెక్టార్లలో పంట నష్టం

7వ పేజీలో

నిశిరాత్రి అలజడి

- గుండ్లకమ్మ 12 గేట్లు ఎత్తివేత
- దిగువ గ్రామాల్లోకి చేరుతున్న వరద నీరు
- భయాందోళనలో ప్రజలు

వివరాలు మెయిన్‌లో..



కేకలు.. హాహాకారాలు

వివరాలు మెయిన్‌లో..

- వాగులో చిక్కుకున్న ట్రావెల్స్ బస్సు
- వణికిపోయిన ప్రయాణికులు
- స్పందించిన కురిచేడు ఎస్‌ఐ శివ
- ట్రాక్టర్‌కు కట్టి బయటకు తెచ్చిన వైనం


ఒడ్డుకు చేరిన కూలీలు

ముసి వద్ద చిక్కుకున్న వలస కూలీలు

- యంత్రాంగానికి సమాచారం
- రంగంలోకి ఎస్‌డీఆర్‌ఎఫ్
- 121 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన అధికారులు

వివరాలు మెయిన్‌లో..


రోప్ సాయంతో యువకుడిని బయటకు తెస్తున్న పోలీసులు

11 గంటలు చెట్టుపైనే!

- వాగును దాటుతూ కొట్టుకుపోయిన బైకిస్టు
- వేపచెట్టును పట్టుకొని పైకెక్కి రాత్రంతా బిక్కుబిక్కు
- కాపాడిన పోలీసులు

వివరాలు మెయిన్‌లో..


ఒంగోలులోని మంగమ్మ కాలేజీ సెంటర్‌లో పాత హైవేపై నిలిచిన నీరు


సంతనూతలపాడు వద్ద కర్నూల్‌రోడ్డుపై నుంచి పారుతున్న చెరువు నీరు


ఒంగోలు శివారు డ్రీమ్‌వ్యాలీలో ఉంటున్న వారిని ట్రాక్టర్‌పై పునరావాస శిబిరానికి తరలిస్తున్న అధికారులు

వర్ష బాధితులకు అండగా ప్రభుత్వం

- బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ చేసేందుకు వివరాల సేకరణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో తక్షణ సాయంగా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంది. అందుకు సంబంధించి జీవో నెంబరు 115ను విడుదల చేసింది. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం

మిగతా 6వ పేజీలో

సహాయక చర్యల్లో సమన్వయం


ఒంగోలులోని నవోదయ వద్ద చర్చించుకుంటున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు

- తొలినుంచి ఒకటిగా సాగిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టిన కలెక్టర్, ఎస్పీ
- స్థానికంగా పర్యవేక్షణలో కీలకప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు
- ప్రభుత్వ అప్రమత్తత, సామాజిక మాధ్యమాలతో ప్రజల్లోనూ చైతన్యం
- కుంభవృష్టిగా వాన కురిసినా ప్రాణ నష్టం లేకుండా బయటపడిన జిల్లా

ఒంగోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా ధాటికి జిల్లా ప్రజానీకం వణికిపోయినప్పటికీ గతంలో సంభవించిన తుఫాన్లతో పోల్చితే తక్కువ నష్టంతో బయటపడగలిగారు. అందుకు అటు జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయంతో నడిపించడంలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు ప్రత్యేక చొరవచూపారు. వారికి నిత్యం అందుబాటులో ఉంటూ మంత్రి డాక్టర్ స్వామి, ఇతర కీలక ప్రజాప్రతి నిధులు అందించిన సహకారం కలిసొచ్చింది. అంతకు మించి రాష్ట్రప్రభుత్వం నుంచి నేరుగా లక్షలాది మందికి తుఫాన్ తీవ్రతపై నిరంతరం

మిగతా 6వ పేజీలో

మొంథా వచ్చింది.. కంభం చెరువు నిండింది

- 5సంవత్సరాల తర్వాత నిండుకుండలా...
- అలుగు పారుతున్న వైనం

6



జల విలయం

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. సుమారు 80వేల క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వస్తుండగా 12 గేట్లు ఎత్తి మొత్తం దిగువకు వదిలారు. ప్రాజెక్టు నుంచి ఇటీవలి కాలంలో అంత నీరు వదలడం ఇదే కాగా దిగువ ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక రామతీర్థం, కంభం చెరువులతో సహా జిల్లాలోని వందలాది చిన్న, పెద్ద చెరువులు నీటితో తొణికిసలాడుతున్నాయి. ఐదేళ్ల తర్వాత కంభం చెరువు నిండి అలుగు పారింది. పూర్తిస్థాయిలో నిండిన తర్వాత కూడా వర్షపు నీరు రావడంతో పలుచోట్ల చెరువులకు గండ్లు పడటం లేదా అలుగుల నుంచి భారీగా నీరు వదలడంతో పొలాల్లోనూ, దిగువ ప్రాంత రోడ్లను ముంచెత్తాయి. ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్ట చెరువుకు గండిపడింది. పెద్దదైన సంతనూతలపాడు చెరువుతోపాటు జిల్లాలోని అనేక చెరువులు నిండి అలుగులు పారాయి.

స్తంభించిన జనజీవనం

జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 50కిపైగా వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వీటితోపాటు మరోవైపు చెరువులు నిండి భారీగా వర్షపు నీరు రోడ్లు, పంట పొలాల్లోకి పోవడంతో ఇటు రవాణాకు తీవ్ర ఆటంకంతోపాటు, అటు వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. సంతనూతలపాడు, పేర్నమిట్ట వద్ద చెరువు నీరు రోడ్లపైకి రావడంతో ఒంగోలు-కర్నూలు రహదారిలో ట్రాఫిక్ గంటల కొద్దీ నిలిచిపోయింది. స్వయంగా ఎస్పీ రంగంలోకి దిగి చర్యలు చేపట్టాల్సి వచ్చింది. అలాగే దర్శి నియోజకవర్గంలోని చిలకలేరు, దోర్నపు వాగులు, ఒంగోలు పరిసరాల్లోని ముదిగొండి, నల్లవాగు, అట్లేరువాగు, కొత్తపట్నం వాగు, ఎమిలేరువాగు, పశ్చిమప్రాంతంలోని సగిలేరు, రాళ్లవాగు, నల్లవాగు, పల్లెకంటేరు వాగు, బట్టువారిపల్లె వాగు, వారంపల్లి వాగు తదితరాలు పొంగి ప్రవహించాయి. ముసి కూడా ఉగ్రరూపం దాల్చింది. ఇతర అనేక వాగులు పొంగడంతో దాదాపు 50 రూట్లలో రవాణాకు తీవ్ర ఆంతరాయం ఏర్పడింది. ఒంగోలు నుంచి కొత్తపట్నం, ఒంగోలు-కర్నూలు, ఎన్‌జీపాడు-తిమ్మనపాలెం, ఉప్పుగుండూరు-ముప్పాళ్ళ, టంగుటూరు-కొండపి, ఎస్ఎన్‌పాడు -కొండపి, తాళ్ళూరు- గంగవరం, దర్శి- అద్దంకి, కంభం-రాచర్ల, మార్కాపురం-పొదిలి, గిద్దలూరు-పోరుమామిళ్ల ఇలా అనేక రూట్లలో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది.

విరిగిపడ్డ చెట్లు, స్తంభాలు

జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరా గంటల కొద్దీ నిలిచిపోయింది. మంగళవారం రాత్రి చాలా ప్రాంతాలు అంధకారంలోనే ఉండిపోయాయి. వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు కాలువకు చెరువు నీరు పోటెత్తడంతో అది తెగిపోయి వెలిగొండ సొరంగాలలోకి నీరు చేరింది. దీంతో సొరంగాలలో లైనింగ్ పనులు చేస్తున్న కార్మికులను కృష్ణానది వైపున కొల్లంవాగు ప్రాంతానికి తరలించారు. అక్కడి నుంచి బోట్ల ద్వారా శ్రీశైలం చేర్చారు. మరోవైపు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని లోతట్టు కాలనీలు, గ్రామాలు జలమయమయ్యాయి. ఒక్క ఒంగోలు నగరంలోనే దాదాపు 20కాలనీలు ఇలా నీటిలో మునిగాయి. జిల్లావ్యాప్తంగా వందకుపైగా గ్రామాలు, కాలనీలు మునిగాయి. వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. 101 పునరావాస కేంద్రాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన అధికారులు వాటిలో 4,791 మందికి ఆశ్రయం కల్పించారు అనేక ప్రాంతాల్లో వర్షాల ధాటికి ఇళ్ల ప్రహరీలు కూలాయి. నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాల-ముప్పాళ్ల, టంగుటూరు మండలంలోని మర్లపాడు, ఇతర అనేక గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి.

తీవ్రంగా దెబ్బతిన్న పంటలు

మొంథా తుఫాన్ జిల్లా రైతాంగాన్ని తీవ్రంగానే నష్ట పర్చింది. దాదాపు లక్ష ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మూడున్నర లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయగా ఇంకా పదిశాతం కూడా ఇళ్లకు చేరలేదు. లక్ష ఎకరాల్లో పత్తి, మిర్చి, కంది, పొగాకు, సజ్జ, వరి, మొక్కజొన్న, జొన్న, బొప్పాయి, ఇతర కూరగాయల పంటలు నీట మునిగాయి. దాదాపు రూ.250 కోట్ల మేర పెట్టుబడులు, రాబడులను రైతులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. కాగా వర్షం తెరపివ్వడంతో తక్షణ సహాయక చర్యలను బుధవారం అధికారులు ముమ్మరం చేశారు. పలుప్రాంతాల్లో నిలిచిన ట్రాఫిక్ పునరుద్ధరణ, గండ్లు పూడ్చివేత, జలమయమైన కాలనీల ప్రజలను పునరావాస చర్యలు వేగవంతం చేశారు. కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగాయి. మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించి ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా గుండ్లకమ్మకు వరద పోటెత్తి 12 గేట్లు ఎత్తడంతో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్షించారు. దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

సహాయక చర్యల్లో సమన్వయం

(5వ పేజీ తరువాయి)

అలర్టు, సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా అవసరమైన సమాచారాన్ని తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రజల్లో పెరిగిన చైతన్యం కూడా కారణమని చెప్పాలి. నిజానికి మొంథా తీవ్రత జిల్లాపై తీవ్రంగానే ఉంది. ఒకరకంగా తుఫాన్ జిల్లాలోనే తీరం దాటిందా.. అన్నంత స్థాయిలో కుండపోత వర్షం కురవడంతోపాటు మంగళవారం రాత్రి గాలులు వీచాయి. కేవలం 36 గంటల్లోనే 18సెం.మీ పైగా వర్షపాతం నమోదైంది. దీంతో వందలాది గ్రామాలు, పట్టణాల్లో కాలనీలు జలమయంతోపాటు దాదాపు 50కిపైగా వాగులు, వంకలు పొంగి ప్రవహించి కీలక మార్గాల్లో రవాణా నిలిచిపోయింది. అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకొన్నాయి.

అప్రమత్తతతో తగ్గిన నష్టాలు

సాధారణంగా ఈస్థాయి తుఫాన్‌తో ప్రాణ, ఆస్తి నష్టం అధికంగా ఉంటుంది. ఈసారి అనివార్యంగా జరిగే పంట నష్టాలు, ఇతర వనరుల నష్టాలు తప్ప ప్రాణనష్టం అన్నది ఎక్కడా లేకపోగా వ్యక్తిగతంగా ఆస్తినష్టాలు చాలా తక్కువగా ఉన్నాయి. తుఫాన్ రాకపై మూడు రోజుల ముందు నుంచే ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో ముందస్తు ప్రణాళికతో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వ్యవహరించారు. సచివాలయ స్థాయి వరకు అన్నిశాఖల సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు తుఫాన్ గమనం, వర్షాలు పడే ప్రాంతాలు, ఎదురయ్యే తీవ్ర సమస్యలు, ఇబ్బందులను అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సూచనలు తీసుకొని సమన్వయంతో సాగారు. తుఫాన్ ప్రభావం ప్రారంభమై జోరువాన కురుస్తున్న సమయంలో రాత్రింబవళ్లు మొత్తం జిల్లా పరిస్థితిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో చర్యలపై కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ స్వయంగా తాము కూడా వెళ్లి పర్యవేక్షించారు. జిల్లాకు నియమితులైన ప్రత్యేక అధికారులు సిసోడియా, కోన శశిధర్‌ల మార్గదర్శనం కూడా వారికి లాభించింది. వర్షం వెలిశాక పునరావాస శిబిరాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీటి వనరుల సంరక్షణ కూడా జాగ్రత్తగానే చేశారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు తుఫాన్ ముందు నుంచే యంత్రాంగంతో సమన్వయంగా సాగి తమ, తమ ప్రాంతాల్లో అవసరమైన జాగ్రత్తలలో సఫలమయ్యారు. బుధవారం సహాయక చర్యల్లోనూ అలాగే వ్యవహరించారు. మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి కందుల నారాయణరెడ్డి, ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులు తమతమ ప్రాంతాల్లో అధికారులతో సమన్వయంగాను, విడిగా పార్టీ నేతల ద్వారా సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొత్తంగా మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపినా అవకాశం ఉన్నమేర నష్ట తీవ్రతను తగ్గించడంలో సక్సెస్ అయ్యారు.

వర్ష బాధితులకు అండగా ప్రభుత్వం

(5వ పేజీ తరువాయి)

కిలో కందిపప్పు, కిలో అయిల్, ఉల్లిపాయలు కిలో, బంగాళాదుంపలు కిలో, చెక్కర కిలో అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. మత్స్యకారులకు మాత్రం అదనంగా మరో 25 కిలోల బియ్యం ఇవ్వాలని సూచించింది. తదనుగుణంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో 39 మండలాలు ఉండగా తహసీల్దార్లను బాధిత కుటుంబాల వివరాలు ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులు కోరినట్లు సమాచారం. వారు ఇచ్చే జాబితాలకు అనుగుణంగా ఆయా రేషన్ షాపుల ద్వారా బాధితులకు సరుకులను పంపిణీ చేయనున్నట్లు సమాచారం. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు అందుకు సంబంధించి సమాచారం సేకరించే పనిలో ఉన్నారు.

తీర ప్రాంతాలు జలదిగ్బంధం

- బోట్లతో వెళ్లి 50 మందిని రక్షించిన అధికారులు
- నేరుగా రంగంలోకి దిగిన జాయింట్ కలెక్టర్
- టిడ్కో ఇళ్లలో చిక్కుకుపోయిన ఏడుగురు జార్ఖండ్‌వాసులు
- కొత్తపట్నం మండలానికి రాకపోకలు బంద్
- అన్ని రహదారుల్లో భారీగా చేరిన వరద నీరు
- తెగిపోయిన రొయ్యల చెరువులు
- నీటమునిగిన పంటపొలాలు


జలదిగ్బంధంలో ఉన్న వారిని కాపాడి తీసుకు వస్తున్న అధికారులు

కొత్తపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విరుచుకుపడడంతో కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంత గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బుధవారం కొత్తపట్నం మండలానికి ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. ఒంగోలు-కొత్తపట్నం రహదారిలో అల్లూరు నుంచి ఒంగోలు ఇందిరమ్మ కాలనీల వరకు ప్రమాదకర రీతిలో నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఈతముక్కల-సూరారెడ్డిపాలెం రహదారిలో కూడా మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఇక మోటుమాల-బీరంగుంట, ఆలూరు గ్రామాల మీదుగా కొప్పోలు వరకు ఉన్న రహదారిలో మూడు రోజుల క్రితమే రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కొత్తపట్నం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. మొత్తం దారులన్నీ జలదిగ్బంధం కావటంతో మండలవాసులు ఇతర ప్రాంతాలకు వెళ్ళలేకపోయారు. పలు గ్రామాల్లోకి భారీగా వరద నీరు ఇళ్ళలోకి కూడా నీరు ప్రవేశించటంతో ప్రజలు వాటిని బయటకు వెళ్ళగొట్టే పనిలోనే బుధవారం అంతా నిమగ్నమయ్యారు. మండలంలో అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు కూడా ప్రజలు ఎక్కు సంఖ్యలో వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. కగా వర్షం కాస్తంత తెరపివ్వటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

వరద బాధితులను కాపాడిన అధికారులు

రాత్రికి రాత్రే కురిసిన భారీ వర్షానికి మండలంలోని రొయ్యల చెరువులు, పంట పొలాలు మునిగి పోయాయి. రొయ్యల చెరువుల చుట్టూ ప్రమాదకర స్థాయిలో నీరు చేరటంతో అక్కడ పనిచేసే కూలీలు బయటకు రాలేక చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ నేరుగా రంగంలోకి దిగారు. ఆయన బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో అల్లూరుకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మత్స్యశాఖ, మెరైన పోలీసులను అప్రమత్తం చేశారు. రోడ్డు పూర్తిగా కనిపించకుండా పోవటం, రొయ్యల చెరువులు కూడా మునిగిపోవడంతో బోట్లను సిద్ధం చేయాలని మత్స్యశాఖ ఏడీ సంగాని శ్రీనివాసులును ఆదేశించారు. ఆయన ప్రత్యేకంగా గుండమాల నుంచి తెప్పించిన అవుట్ బోట్ మోటారు పడవలో మత్స్యశాఖ అధికారులు, మైరైన్ పోలీసులు చెరువుల వద్దకు వెళ్ళి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాపాడంటూ వేడుకుంటున్న 50మందిని సురక్షిత ప్రాంతాలకు తీసుకువచ్చారు. మరో వైపు జాయింట్ కలెక్టర్ కొప్పోలు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డులో ట్రాక్టర్‌పై ప్రయాణించి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో 10 మందిని రక్షించారు. చింతల సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల మొదటి అంతస్తు వరకు నీరు చేరింది. ఇక్కడ పనిలో ఉన్న ఏడుగురు జార్ఖండ్ వాసులు రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. దీన్ని గుర్తించిన అధికారులు బోటు ద్వారా వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఆక్వా రైతులకు భారీ నష్టం..

తుఫాన్ కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఆక్వా చెరువుల కట్టలు తెగిపోయాయి. దీంతో చెరువుల్లోని రొయ్యలు వరద నీటి పాలయ్యాయి. చింతల, కొప్పోలు, గుండమాల, మోటుమాల తదితర ప్రాంతాల్లో రొయ్యల చెరువులకు కట్టలు తెగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా మునిగిపోయాయి. అల్లూరులో వరి వందల ఎకరాల్లో మునకకు గురయ్యింది. ఇసుక నేలల్లో సాగు చేసిన వేరుశనగ, చేమ చేలు కుళ్లి పోయి కంపుకొడుతున్నాయి. ఇక ఇతర రకాల పంటలు కూడా నీటిపాలయ్యాయి.

మొంథా వచ్చింది.. కంభం చెరువు నిండింది

- 5సంవత్సరాల తర్వాత నిండుకుండలా చెరువు
- అలుగు పారుతున్నవైనం


నిండు కుండలా కనిపిస్తున్న కంభం చెరువు

కంభం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా నల్లమల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు, నల్లవాగులు ఉధృతంగా ప్రవహించడంతో ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద కంభం చెరువు పూర్తిగా నిండింది. బుధవారం ఉదయం నుంచి అలుగు పారుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 5 సంవత్సరాల తర్వాత కంభం చెరువు నిండుకుండలా మారడంతో పర్యాటకులు చెరువు అందాలను తిలకించేందుకు తరలి వస్తున్నారు. కంభం చెరువు సంపూర్ణంగా నిండాలంటే 20అడుగుల మేర నీరు చేరాలి. 2020 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు చెరువు అలుగు పారింది. అప్పటి నుంచి ఎన్ని తుఫాన్‌లు వచ్చినా రాష్ట్రంలోని అన్ని డ్యాములు, నదులు, చెరువులు నిండినా కంభం చెరువుకు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. గత నెలలో వచ్చిన రెండు తుఫాన్‌లకు కంభం చెరువుకు 15 అడుగుల మేర నీరు చేరింది. ఈనెలలో మొంథా తుఫాన్‌తో ఒక్క రోజులోనే 5 అడుగుల మేర నీరు చేరి కంభం చెరువు అలుగు పారడంతో మూడేళ్ల వరకు ఈ ప్రాంతంలో కరువు ఉండదని భూగర్భ జలమట్టం పెరిగి సాగు, తాగునీటికి ఇబ్బందులు రావని రైతులు చెప్తున్నారు.

వందేళ్లలో 12సార్లు నిండిన కంభం చెరువు

కంభం చెరువు వందేళ్లలో పూర్తిగా నిండింది 12 సార్లే. శ్రీకృష్ణదేవరాయల సతీమణి వరదరాజమ్మ (సచీదేవి) సుమారు 500 ఏళ్ల కిందట 25వేల హెక్టార్ల విస్తీర్ణంలో చుట్టూ కొండలే ఆనకట్టలుగా చెరువును నిర్మించారు. ఇరిగేషన్ అధికారులు 100ఏళ్ల నుంచి తయారు చేసిన రికార్డుల ప్రకారం 1917, 1948, 1949, 1950, 1956, 1963, 1966, 1975, 1983, 1996, 2020 ప్రస్తుత ఈ ఏడాది 202లో మొంథా తుఫాన్ ప్రభావంతో చెరువు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీ కారు బోల్తా

- రాంగ్ రూట్లో బైక్ అడ్డురావడంతో ప్రమాదం
- వాహనంలో ఉన్న ఇద్దరికి, బైకిస్టుకు గాయాలు
- మంత్రి స్వామి కారులో ఉండటంతో డీడీకి తప్పిన ముప్పు


ప్రమాదానికి గురైన సోషల్ వేల్ఫేర్ వాహనం

సింగరాయకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సోషల్ వేల్ఫేర్ డీడీ లక్ష్మనాయక్ కారు ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ, రాంగ్ రూట్లో వచ్చిన బైకిస్ట్‌కి గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై కనుమళ్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై బుధవారం చోటుచేసుకుంది. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పొన్నలూరు వెళ్లడానికి తూర్పునాయుడుపాలెం నుంచి బయల్దేరారు. ఒంగోలు నుంచి సోషల్ వేల్ఫేర్ డీడీ లక్ష్మనాయక్ వాహనం పొన్నలూరు వెళుతుండగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ వద్దకు చేరుకొనేసారికి రాంగ్ రూట్లో బైక్ ఆకస్మాత్తుగా అడ్డురాగా కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, అటెండర్‌కి, బైకిస్ట్‌కి గాయాలయ్యాయి. తక్షణమే స్పందించిన టంగుటూరు హైవే మొబైల్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హైవే అంబులెన్స్, 108 ఒంగోలు కిమ్స్‌కి తరలించారు. సమాచారం అందుకున్న మంత్రి సంఘట స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సీఐ హజరత్తయ్యను ఆదేశించారు. డీడీ నాయక్ మంత్రి స్వామి ప్రయాణిస్తున్న కారులో ఉండగా ఆయన ప్రమాదం ముప్పు తప్పింది.

సాగునీటి చెరువులు ఫుల్

- మంత్రి స్వామి ఆదేశంతో కదిలిన అధికారులు
- మర్రిపూడి చెరువు పనులు ముమ్మరం


మర్రిపూడి చెరువుకట్ట తూముకు మరమ్మతులు చేస్తున్న అధికారులు, నాయకులు

మర్రిపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. రెండు దశాబ్దాల తర్వాత పూర్తిస్థాయిలో నిండాయి. 31 చోట్ల అలుగులు పారాయి. మర్రిపూడి చెరువు అలుగు వరకు నీటితో నిండిపోయింది. 15 ఏళ్లుగా తూములకు మరమ్మతులు చేయకపోవడంతో చెరువులోని నీరు పెద్దఎత్తున వాగు పాలైంది. సంబంధిత అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరించింది. 20 ఏళ్ల తర్వాత చెరువు నిండిందనే రైతుల ఆశలు ఆవిరయ్యే ప్రమాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. వెంటనే పరిస్థితిని కలెక్టర్ రాజబాబు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జనార్దన్, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో జగదీష్ హుటాహుటిన చెరువు కట్టవద్దకు చేరుకున్నారు. అప్పటికే స్థానిక నాయకులు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి తూము నుంచి నీరు వృథాగా వెళ్లకుండా ఇసుక బస్తాలు, మట్టిని పోయించి ఆపే ప్రయత్నం చేశారు. అనంతరం అధికారుల పర్యవేక్షణలో నీరు బయటకు వెళ్లకుండా నిలువరించారు. మర్రిపూడి చెరువు కట్టకింద నడితూము, రెండో అలుగు వద్ద నీరు లీకేజీ కొనసాగుతోంది. అధికారులు సత్వర చర్యలు తీసుకోకపోతే చెరువుకట్ట కింద 400 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారనుంది. కూచిపూడి చెరువు అలుగు వాగు ఆక్రమణకు గురికావడంతో కరకట్ట తెగి అర్ధరాత్రి గ్రామంలోని పలు ఇళ్లలోకి నీరు చొరబడింది. నరాలవారి బజార్‌లో ఇళ్లలోకి రెండడుగుల నీరు చేరింది. నిద్రిస్తున్న వేళ హటాత్తుగా బీసీ కాలనీలో కోటమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి నీరు చేరడంతో ఆమెతో ఉన్న దివ్యాంగుడైన ఆమె కుమారుడిని స్థానికులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. రమాదేవి అనే మహిళలకు చెందిన 20 కోళ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. అధికారులు కరకట్ట గండి పూడ్చే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. పొట్టిరెడ్డిపాలెం చెరువు అలుగు పారడంతో గ్రామంలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. వరిపైరు ఈదురు గాలులకు నేలకొరిగింది. పంట పొలాలు నీట మునిగాయి. ఇప్పటికే సజ్జ కంకులు నల్లగా మారిపోయి బూజుపట్టి మొలకెత్తుతున్నాయి. వేమవరం చెరువు అలుగు పారడంతో వేమవరం-గార్లపేట మధ్య రాకపోకలు స్తంభించాయి. మర్రిపూడి-పొదిలి రోడ్డులో మార్జిన్ దిగిన భారీ వాహనం అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది.

గుండ్లకమ్మ గేట్లు ఎత్తడంతో పలు గ్రామాల్లోకి వరద నీరు

- భయాందోళనలో ప్రజలు

మద్దిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు బుధవారం ఒక్కసారిగి అన్ని గేట్లు ఎత్తడంతో పలు గ్రామాల్లోకి నీరు చేరింది. ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టు నుంచి 1.50లక్షల క్యూసెక్కులు నీటిని అధికారులు ఒక్కసారిగా 14 గేట్లు ద్వారా వదిలారు. దీంతో మండలంలోని ఇనమనమెళ్లూరు, నందిపాడు, కొలచనకోట, వెల్లంపల్లి, మల్లవరం, తెల్లబాడు, రాచవారిపాలెం, కీర్తిపాడు, నాగన్నపాలెం గ్రామాల్లో గుండ్లకమ్మ నీరు ఒక్కసారిగా దూసుకువచ్చింది. దీనికితోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో భయభ్రాంతులకు గుర్యారు. లోతట్టు గ్రామాలైన ఇనమనమెళ్లూరు దళితవాడలోని చర్చిలోకి నీరు చేరింది. మల్లవరం గ్రామంలోనికి నీరు చేరింది. దీంతో స్థానికులు ఇబ్బదులు ఎదుర్కొన్నారు. ఇక కొలచనకోట ఎస్టీకాలనీలోని నీరు రావడంతో ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే వెల్లంపల్లి హైవే మీదకు గుండ్లకమ్మ నీరు చేరింది. వెల్లంపల్లి-తాళ్లూరు మార్గంలోను వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నందిపాడు అరుంధతి గ్రామంలోకి కూడా నీరు చేరడం, విద్యుత్ నిలిచిపోవడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. అలాగే గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో నాగులుప్పలపాడు మండలంలో చదలవాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి, మద్దిరాలపాడు గ్రామ సమీపంలోకి గుండ్లకమ్మ నీరు చేరింది.

చీరాల వైపు వెళ్లే వాహనాల నిలిపివేత

- చిలకలూరిపేట వైపు మళ్లింపు

ఒంగోలు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో వరద నీరు చేరుకొని చేకూరపాడు-మద్దిరాలపాడు మధ్యలో గల జాతీయ రహదారిపై 3 అడుగలు నీరు ప్రవహిస్తోంది. దీంతో బుధవారం రాత్రి ఒంగోలు నుంచి చీరాల వెళ్లే వాహనాలను నిలిపివేశారు. పరిస్థితిని గమనించిన ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ట్రాఫిక్ అంతా త్రోవగుంట నుంచి చిలకలూరిపేట జాతీయ రహదారి వైపు మళ్ళించారు. గ్రామస్థులను అప్రమత్తం చేశారు. ఒంగోలు నుంచి మద్దిరాలపాడు వెళ్లే వారిని చేకూరపాడు నుంచి పోలీసులు వెనక్కు పంపిచారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని డీఎస్పీ ఆదేశించారు. దీంతో సుమారు 10 మంది గ్రామస్థులు ఒంగోలుకు వెనుదిరిగారు.

శాఖల వారీగా నష్ట అంచనా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాకు భారీగా నష్టం జరిగింది. పంటలతో పాటు ఆర్అండ్‌బీ, విద్యుత్, ఇరిగేషన్ శాఖలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. అందుకు సంబంధించి శాఖల వారీగా కలెక్టరేట్ నుంచి వివరాలు సేకరిస్తున్నారు.వ్యవసాయశాఖ ప్రాథమికంగా క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల హెక్టార్ల(25వేల ఎకరాలు)లో దెబ్బతిన్నట్లు గుర్తించి నివేదిక ఇవ్వగా, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సుమారు ఏడువేలకుపైగా ఎకరాల్లో వివిధ రకాల పండ్లతోటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది.

పునరావాస కేంద్రాల్లో 5,622 మంది

భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 106 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 27 మండలాల పరిధిలో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలకు భారీగా వర్షపు నీరు చేరడంతో వారందరికి పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 5622 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారంతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించారు.

చీమకుర్తి సీఐగా ప్రసాద్



చీమకుర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణ పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(సీఐ)గా దాసరి ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత కొద్దిరోజుల వరకూ సీఐగా ఉన్న సుబ్బారావు మెడికల్ లీవ్‌పై వెళ్లటంతో ఖాళీగా ఉన్న పోస్టులో ప్రసాద్‌ని నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా ఆయన వెంటనే విధుల్లో చేరారు. తుఫాన్ నేపథ్యంలో సీఐ పోస్టును వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ పోలీస్ ఉన్నతాధికారులను కోరిన నేపథ్యంలో వెంటనే నియామక ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఇవేం పట్టనట్లు జాయినింగ్ ప్రక్రియను హడావుడిగా ముగించి కనీసం ఎస్‌హెచ్‌వో ఫోన్ సిమ్ కూడా తీసుకోకుండా ఒంగోలుకు వెళ్లిపోవటం గమనార్హం. గతంలో ప్రసాద్ ఎస్ఐగా కనిగిరి తదితర ప్రాంతాల్లో, సీఐగా గిద్దలూరులో, మెరైన్ సీఐగా కొత్తపట్నం, నెల్లూరు జిల్లాలో పనిచేశారు. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు సీఐ ప్రసాద్ సమీప బంధువు కావటం విశేషం.

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఒంగోలు విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ 3వ, 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు యూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి సోమశేఖర్ ఒకప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 31 నుంచి వచ్చేనెల 7వరకు పరీక్షలు జరగాల్సి ఉందన్నారు. అయితే మొంథా తుఫాన్ పరిణామాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు

- ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు బుధవారం తెలిపారు. రహదారులపై నీరు నిల్వకుండా చేస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు నగరం చుట్టూ ఉన్న ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించారు. పెళ్ళూరు చెరువు నీటి మట్టం పెరిగి పొంగి పొర్లడంతో జాతీయ రహదారిపైకి నీరు చేరింది. దీంతో వెంటనే ఎస్పీ ఆ ప్రాంతాన్ని సందర్శించి వివిధ శాఖల అధికారులతో చర్చించి తక్షణ చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. జాతీయ రహదారిపై నీరు నిలువకుండా చేసి భారీ వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మోటార్‌సైకిళ్ళు, కారులు, బస్సులు రహదారికి తూర్పు వైపున నడిచేలా ఆదేశాలు ఇచ్చారు. అందేవిధంగా పేర్నమిట్ట చెరువు గట్టు తెగి కర్నూల్‌రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని అక్కడ డివైడర్లు పగులగొట్టించి నీటిని పొలాల్లోకి మళ్ళించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల ద్వారా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అంచనా వేసి వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో 112, 9121102266 వాట్సాప్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు రామకోటయ్య, ఎన్.శ్రీకాంత్, పాండురంగరావు తదితరులు పాల్గొన్నారు.


రాచర్ల మండలం జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలోని నీటి గుండానికి భారీగా చేరుతున్న వరద నీరు


ఒంగోలులోని వెంకటేశ్వరకాలనీలో నడుములోతుకు చేరిన వర్షపు నీరు

మొంథా.. నష్టమెంతో..!

జిల్లా వ్యాప్తంగా జల బీభత్సం

- తెగిన చెరువులు.. పొంగిన వాగులు
- నీట మునిగిన పంట పొలాలు
- కూలిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్నరోడ్లు
- చెరువులను తలపిస్తున్న కాలనీలు

జిల్లా పంట నష్టాలపై వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

పంట	నష్టం అంచనా (హెక్టార్లలో)
పత్తి	6577
మొక్కజొన్న	268
సజ్జ	1771
జొన్న	60.4
వేరుశనగ	19.17
వరి	1440.40
బ్లాక్ గ్రామ్	109
గ్రీన్‌గ్రామ్	2
ఆముదం	26

మొంథా తుఫాన్ సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. జిల్లాలో ఎటు చూసినా జల ప్రవాహమే కనిపిస్తోంది. గ్రామాలు చెరువులను తలపిస్తున్నాయి. పంటపొలాలు నీటిలో తేలాడుతున్నాయి. కొన్నిచోట్ల చెరువు కట్టలు తెగి రోడ్లపైకి నీరు చేరుతోంది. రహదారులు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కరెంటు తీగలు తెగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించాయి. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. సబ్‌స్టేషన్లలో నీరు నిలిచిపోయింది. చాలా చోట్ల కరెంటు లేక అంధకారం అలముకుంది. తీర ప్రాంత గ్రామాలన్నీ ఇప్పటికీ భయం గుప్పెట్లోనే ఉన్నాయి.


ఒంగోలులో ఇళ్లకు ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా


ఒంగోలులో ఆంజనేయస్వామి గుడి లోపలికి చేరిన వర్షపు నీరు


ఒంగోలులో పునరావాస కేంద్రంలో ఆహారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్


పాతకమూరులో గాలి, వానకు నేలకొరిగిన వరి పంట

జలదిగ్బంధంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు

మొంథా మిగిల్చిన నష్టం రూ.50 లక్షలు

ఒంగోలు శివారు కాలనీలకు కరెంట్ నిలిపివేత

మొంథా తుఫాన్ తాకిడికి విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. గాలివానకు పలుచోట్ల విద్యుత్తు తీగలు తెగిపోయాయి. కరెంటు స్తంభాలు విరిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించాయి. విద్యుత్ సబ్‌స్టేషన్లు వరదతో నిండిపోయాయి. కరెంటు సరఫరా లేక చాలా ప్రాంతాల్లో చీకట్లు అలముకున్నాయి. బుధవారం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఒంగోలు నగరంలోని శివారు కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. - ఒంగోలుక్రైం, ఆంధ్రజ్యోతి

- రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అనేకచోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో నీరు చేరి కరెంటు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఒంగోలు శివారు ప్రాంతంలోని త్రోవగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గరకు వెళ్లే అవకాశం లేదు. మంగళవారం నుంచి ఆ ప్రాంతంలో ఉన్న గ్రామాలలో విద్యుత్ సరఫరా లేదు.
- సంతనూతలపాడు, ఎండ్లూరు చెరువుల అలుగులు ప్రవహించడంతో ముదిగొండి వాగుకు బుధవారం నీటి ఉధృతి పెరిగింది. దీంతో ఆ సబ్‌స్టేషన్ నుంచి రెండ్రోజుల వరకు విద్యుత్ సరఫరా చేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.
- గుండ్లకమ్మ గేట్లు ఎత్తివేయడంతో చదలవాడ వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లోకి నీరు చేరింది.
- టంగుటూరు మండలం జమ్ములపాలెంలో ఉన్న సబ్‌స్టేషన్‌లోకి నీరు చేరింది.
- ఒంగోలులో శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్, బాలాజీ నగర్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కూడా భారీగా నీరు చేరింది.
- త్రోవగుంట సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ప్రాంతాలకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వేరే సబ్‌స్టేషన్ నుంచి కరెంటు సరఫరా చేశారు. మిగిలిన చోట్ల కొంతమేరకు నీరు తగ్గడంతో అక్కడ నుంచే విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

మొంథా మిగిల్చిన నష్టం రూ.50 లక్షలు

- మొంథా తుఫాన్ వల్ల విద్యుత్ శాఖకు జిల్లా వ్యాప్తంగా రూ.50 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.
- మొత్తం 35 సబ్‌స్టేషన్లలో 33 కిలోవాట్స్ లైన్లు 9... 11 కిలోవాట్స్‌లైన్లు 101... 27 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 150 విద్యుత్తు స్తంభాలు, రెండు కిలోమీటర్లు కండక్టర్, నాలుగు కిలోమీటర్లు కేబులు వైరు దెబ్బతిన్నాయి. ప్రాథమికంగా రూ.31 లక్షలు నష్టమని అంచనా వేశారు.
- ఇంకా అనేక సబ్‌స్టేషన్లు నీటిలో ఉన్నాయి. స్టోర్స్‌లో కూడా కొంత సామగ్రి దెబ్బతిన్నది. మొత్తంగా రూ.50 లక్షలు వరకు ఉంటుందని అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

నీటమునిగిన శివారు కాలనీలు

ఒంగోలు నగరంలో శివారు ప్రాంతంలో ఉన్న అనేక కాలనీలలో వరదనీరు చేరడంతో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. మంగళవారం నుంచి నగరంలోని పోతురాజుకాలువ సమీపంలో గల బలరామ్ కాలనీ, నెహ్రూనగర్, ప్రకాశం కాలనీ, కరుణా కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నీరు తగ్గితే విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు చెప్పారు.

అన్ని ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరించాం

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. కొన్ని సబ్‌స్టేషన్లలో నీరు చేరడతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. తుఫాన్ కారణంగా ఇప్పటికీ రూ.31 లక్షలు నష్టం వాటిల్లినట్లు అంచనా. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. తీర ప్రాంత గ్రామాలలో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాం. ఇప్పటి వరకు గృహ అవసరాలకు ఎలాంటి లోటూ లేకుండా చేస్తున్నాం. గురువారం నుంచి వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లపై దృష్టి సారించి పునరుద్ధరిస్తాం.

-కట్టా వెంకటేశ్వర్లు, విద్యుత్తు శాఖ ఎస్‌ఈ

10,274 హెక్టార్లలో పంట నష్టం

- ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు జిల్లాలో 10,274 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 27 మండలాల పరిధిలోని 170 గ్రామాలకు చెందిన 12,418 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 2,156 మంది రైతులు, మార్కాపురం మండలంలో 15 గ్రామాలకు చెందిన 3,744 మంది, తర్లుబాడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 145 మంది, కంభం మండలంలో 8 గ్రామాలకు చెందిన 259 మంది రైతులు, అర్ధవీడు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 221 మంది రైతులు, మర్రిపూడి మండలంలో 18 గ్రామాలకు చెందిన 420 మంది రైతులు, పొదిలి మండలంలో 27 గ్రామాలకు చెందిన 185 మంది రైతులు, దర్శి మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 228 మంది రైతులు, కొనకనమిట్ల మండలంలో మూడు గ్రామాలకు చెందిన 258 మంది రైతులు, దొనకొండ మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 389 మంది రైతులకు చెందిన పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. తాళ్లూరు మండలంలో ఒక గ్రామానికి చెందిన 10 మంది, రాచర్లలో మూడు గ్రామాలకు చెందిన 425 మంది, గిద్దలూరు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 405 మంది, బేస్తవారిపేటలో ఐదు గ్రామాలకు చెందిన 302 మంది, పుల్లలచెరువు మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 35 మంది రైతుల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. వైపాలెం మండలంలో 9 గ్రామాలకు చెందిన 547 మంది, దోర్నాల మండలంలో ఒక గ్రామానికి చెందిన 65 మంది రైతులు, వెలిగండ్ల మండలంలో 17 గ్రామాలకు చెందిన 1278 మంది రైతులు, హనుమంతునిపాడు మండలంలో ఒక గ్రామానికి చెందిన 62 మంది రైతులు, సీఎస్‌పురం మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 22 మంది, కనిగిరి మండలంలో రెండు గ్రామాలకు చెందిన నలుగురు, పామూరు మండలంలో మూడు గ్రామాల్లో 28 మంది రైతులు, చీమకుర్తి మండలంలో నాలుగు గ్రామాల్లో 63 మంది రైతులు, నాగులుప్పలపాడు మండలంలో 800 మంది రైతులు, ఒంగోలు మండలంలో ముగ్గురు రైతులు, కొత్తపట్నం మండలంలో ఇద్దరు రైతుల పంటల దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.


వర్షం నీటిలో మునిగిన మిర్చి పంట

జిల్లాలో 16.3 సెం.మీ. వర్షపాతం

అత్యధికంగా ఒంగోలులో 25.7 సెం.మీ.

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 16.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఒంగోలు అర్బన్‌లో 25.7 సెం.మీ., ఒంగోలు రూరల్‌లో 25.7 సెం.మీ., టంగుటూరులో 24.7 సెం.మీ., కొండపి 24.4 సెం.మీ., చీమకుర్తి 23.8 సెం.మీ., కొత్తపట్నం 23.2 సెంమీ, నాగులుప్పలపాడు 22.2సెం.మీ., కురిచేడు 20.9 సెం.మీ., సింగరాయకొండ 20.8 సెం.మీ., మద్దిపాడు 20.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాళ్లూరు 19.8 సెం.మీ., దర్శి 19.4 సెం.మీ., దొనకొండ 19.2, పొన్నలూరు 19.2 సెం.మీ., సంతనూతలపాడు 18.4 సెం.మీ., పొదిలి 17.5 సెం.మీ., తర్లుబాడు 16.0 సెం.మీ., కొనకనమిట్ల 15.7 సెం.మీ., మార్కాపురం 15.1 సెం.మీ., త్రిపురాంతకం 15.1 సెం.మీ., హనుమంతునిపాడు 14.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పెద్దారవీడు 13.8 సెం.మీ., కంభం 13.8 సెం.మీ., ముండ్లమూరు 13.2 సెం.మీ., జరుగుమల్లి 12.9 సెం.మీ., రాచర్ల 12.9 సెం.మీ., వీసీపల్లి 12.9 సెం.మీ., యర్రగొండపాలెం 12.8 సెం.మీ., పామూరు 12.7 సెం.మీ., మర్రిపూడి 12.6 సెం.మీ., బేస్తవారపేట 12.5 సెం.మీ., సీఎస్‌పురం 11.6 సెం.మీ., గిద్దలూరు 11.4 సెం.మీ., కొమరోలు 11.2 సెం.మీ., కనిగిరి 11.0 సెం.మీ., వెలిగండ్ల 10.8 సెం.మీ., పుల్లలచెరువు 10.6 సెం.మీ., అర్ధవీడు 10.3 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా దోర్నాల మండలంలో అత్యల్పంగా 6.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

మోపాడు జలాశయంలో 15 అడుగులకు నీరు


మోపాడులో 15 అడుగుల నీటి మట్టం చేరిన నీరు

పామూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని మోపాడు జలాశయానికి 15 అడుగుల మేర నీరు చేరింది. గతంలో 9 అడుగులు నీరు ఉండగా మొంథా తుపాన్ ప్రభావంతో సీఎస్‌పురం మండలంలోని భైరవకోన, జలపాతంలో వరదనీరు ఉగ్రరూపం దాల్చింది. డొక్కలవాగు, మన్నేరు వాగులతో పాటు సీఎస్‌పురం చెరువు, పామూరులోని పడమటకట్టకిందపల్లి, దూబగుంట, పామూరులోని పాత, కొత్త చెరువులు అలుగులు పారుతూ వరదనీరంతా మోపాడు రిజర్వాయర్‌కు చేరుతోంది. 16 అడుగులకు మించి నీటి మట్టం నమోదైతే వరి పంట సాగు చేసే అవకాశం ఏర్పడుతుందని ఆయకట్టుదారులు తెలుపుతున్నారు.


గుండ్లకమ్మ ప్రాజెక్టులో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే బీఎస్ విజయ్‌కుమార్

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

- కలెక్టర్ రాజాబాబు
- ఎమ్మెల్యే బీఎస్‌తో కలిసి గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిశీలన

మద్దిపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రజలను అన్నివిధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ రాజాబాబు అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌తో కలిసి గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కులు వరద నీరు వచ్చిందని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టు వరద ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు తుఫాన్ సహాయక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం గుండ్లకమ్మ ప్రాజెక్టు పరీవాహక ప్రాంత మండలాల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్‌లతో కలెక్టర్ రాజాబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ప్రాజెక్టు సూపరింటెండెట్ అబూ సలీం, ఈఎన్సీ శ్యాంప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి, తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, నాయకులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, రంపతోటి అంకారావు, మండవ గోపీనాథ్, రామకృష్ణ, పూనూరు సుబ్బారావు, రంపతోటి అంకారావు, ముల్లూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రైల్వే ట్రాక్

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు


దెబ్బతిన్న రైల్వే ట్రాక్

కురిచేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు గుంటూరు గుంతకల్ రైల్వే మార్గంలో కురిచేడు గుండ్లకమ్మ రైల్వే స్టేషన్ల మధ్య అప్‌లైన్ ట్రాక్ కట్ట బలహీన పడింది. దీంతో డౌన్‌లైన్లో రైళ్లను అనుమతిస్తున్నారు. రైళ్లు నిదానంగా వెళుతున్నాయి. రైల్వే శాఖ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది. అధిక వర్షాలకు ట్రాక్ ఇరువైపులా నీరు నిలిచింది. దీంతో అప్‌లైన్ ట్రాక్ బలహీనపడింది. ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోలి ట్రాక్ కట్టను పటిష్ఠం చేస్తున్నారు. రైళ్లు ఆగకుండా డౌన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చారు. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.


కూలిపోయిన పొగాకు బ్యారన్‌ను పరిశీలిస్తున్న వీఆర్వో

కూలిపోయిన పొగాకు బ్యారన్లు

పామూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని బోడవాడ గ్రామంలో మోడి వెంకటేశ్వర్లు మరో రైతులకు చెందిన 7 పొగాకు బ్యారన్లు కూలిపోయాయి. రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. పడిపోయిన బ్యారన్లను వీఆర్వో మహ్మద్ రఫీ బుధవారం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందచేశారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలోఅడుసుమల్లి రామకృష్ణారావుకు చెందిన బ్యారన్ పడిపోవడంతో రూ.5లక్షలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.


చెరువులా మారిన వెంకటేశ్వరకాలనీ


నేతాజీకాలనీలో నుంచి స్థానికుల తరలింపు


కరుణకాలనీలో వరద ప్రవాహం


కిమ్స్ ఫ్లైఓవర్ వద్ద ప్రవహిస్తున్న వర్షపునీరు

జలదిగ్బంధంలో శివారు కాలనీలు

నగరంలో పర్యటించిన మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల, ఒడా చైర్మన్ రియాజ్

తుఫాన్ ముప్పు తప్పడంతో ఊపిరి పీల్చుకున్న జనం ● ముందస్తు చర్యలతో కొంతమేర కాపాడిన పోతురాజుకాలువ


బలరామ్‌కాలనీ నుంచి సురక్షిత ప్రాంతానికి చిన్నారితో వెళుతున్న తల్లి

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ఒంగోలు నగరం నీట మునిగింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు ముంపు ముప్పు నుంచి తప్పించింది. కాగా రోజంతా కురిసిన కుండపోత వానకు శివారు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోగా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమై సుమారు 6 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు రెండువేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదిలా ఉండగా, బుధవారం నాటికి వర్షం పూర్తిగా తెరపించినా కాలనీలు మాత్రం నీటిలోనే ఉన్నాయి. దీంతో ప్రజలు కొందరు ఇళ్ళకే పరిమితం కాగా, మరి కొందరు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. కాగా మొంథా ముప్పు కారణంగా నగరం జలమయం కావడం తప్ప ఎక్కడా ప్రాణ నష్టం జరగకపోవడం అటు అధికారులు, ఇటు నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు కాలనీలన్నీ చెరువుల్లా మారిపోవడంతో ఆయా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ రాజాబాబు స్వయంగా ట్రాక్టర్‌లో ప్రయాణించి పరిశీలించారు. అలాగే రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ధైర్యం చెప్పారు. ఆందోళన చెందవద్దని, అధికార యంత్రాంగం అండగా ఉందని చెప్పారు. తక్షణమే సహాయక చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధు, ఆర్డీవో లక్ష్మీప్రసన్నలతోపాటు విద్యుత్ అధికారులను ఆదేశించారు. పలుకాలనీలు జలదిగ్బంధంలోనే ఉండగా ఆ ప్రాంత ప్రజలు బుధవారం కూడా పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకున్నారు. దాంతో వారికి అవసరమైన ఆహారం, నీరు, ఇతర సౌకర్యాలను అధికారులు అందజేశారు.

జలమయమైన నవోదయ..

నగరంలోని జవహర్ నవోదయ పాఠశాల పూర్తిగా జలమయం అయ్యింది. పాఠశాల మొత్తం చెరువులా మారిపోవడంతోపాటు తరగతి, హాస్టల్ గదుల్లో వర్షం నీరు చేరి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రంతా నిద్రహారాలు లేకుండా వర్షం కష్టాలు ఎదుర్కొన్న వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అంతకముందు కలెక్టర్ రాజాబాబు శివారుకాలనీల్లో కమిషనర్ వెంకటేశ్వరావుతో కలిసి పాపాకాలనీ, బిలాల్‌నగర్, కరుణా కాలనీతోపాటు పలు కాలనీల్లో ట్రాక్టర్‌పై పర్యటించి పరిస్థితులను చక్కదిద్దాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే దామచర్ల విస్తృత పర్యటన

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎమ్మెల్యే దామచర్ల నగరంలో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం అర్థరాత్రి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో పలు కాలనీల్లో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్న ఆయన బుధవారం ఉదయం నుంచి పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి కాలనీలో పరిస్థితిని తెలుసుకుని అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొంథా ముప్పుపై తీసుకున్న ముందస్తు చర్యలతో ముప్పు తప్పిందన్నారు. ప్రత్యేకించి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం నగరంలో జరగలేదన్నారు. అధికారులు గత మూడు, నాలుగురోజులు ముందు నుంచే అప్రమత్తమై ముందస్తుగా తీసుకున్న చర్యలతో పెద్దగా ఇబ్బందులు జరగలేదని స్పష్టం చేశారు.

కాపాడిన పోతురాజు కాలువ ఆధునీకీకరణ

నగరానికి ప్రధాన మురుగునీటి ప్రవాహ కేంద్రమైన పోతురాజు కాలువ ఆధునీకీకరణ నేడు మొంథా తుఫాన్ ముప్పు నుంచి సగం కాపాడిందని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రత్యేకించి గత నాలుగైదునెలలుగా పోతురాజు కాలువలో పూడిక తీత పనులు, కాలువ ఆధునీకరణ, అలాగే కాలువ బ్రిడ్జిపై రక్షణ కంచెలు వేశారు. ద్వారా తుఫాన్ కారణంగా భారీ వర్షం కురిసినా నీరు నిలువకుండా ఎప్పటికపుడు కాలువ ద్వారా ప్రవహించడంతో ముప్పు తప్పిందన్నారు. పోతురాజు కాలువ ఆధునీకీకరణ చేయకుంటే డెబ్బై శాతం నగరం నీట మునిగి పెద్ద ప్రమాదం సంభవించేదని వెల్లడిస్తున్నారు. రోజంతా ఏకధాటిగా వాన కురిసినా పెద్దగా ముప్పు వాటిల్లకపోవడం, అలాగే కార్పొరేషన్ శానిటరీ, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయడం ద్వారా మొంథా ముప్పు నుంచి నగరాన్ని కాపాడుకోవడం జరిగిందని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.


పోతురాజుకాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా చైర్మన్ రియాజ్

ముంచిన మొంథా

● పొంగిన వాగులు..నిలిచిన రాకపోకలు
● ఈదురుగాలులకు పలు గ్రామాల్లో పశువుల మృతి
● కూలిన చెట్లు...నివాసగృహాలు


ముప్పాళ్ల చెరువు కట్ట తెగడంతో పూడుస్తున్న ఎక్స్‌కవేటర్

నాగులుప్పలపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎం.ముప్పాళ్ల, మద్దిరాల, ఈదుమూడి, మట్టిగుంట, కొత్తకోట, హనుమాపురం, బి.నిడమానూరు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎం.ముప్పాళ్ల చెరువు కట్ట తెగి నివాస గృహాల్లోకి వరదనీరు చేరింది. దాంతో సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి తెగిన కట్టను పూడ్చించారు. గ్రామం నుంచి తిమ్మసముద్రం వరకు అంతా జలమయంగా మారింది. తిమ్మసముద్రం వద్ద కొమ్మమూరు కాలువ పొంగి అంబేడ్కర్‌కాలనీ, బీసీకాలనీలోకి వరదనీరు చేరింది. స్థానికులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆర్డీవో ప్రసన్నలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి జి.జోసెఫ్‌కుమార్, తహసీల్దార్ కె.ప్రవీణకుమార్, ఎంపీడీవో రవికుమార్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈ ప్రసాద్, డీఏవో శ్రీనివాసరావు, ఏడీఏ రమేష్, ఏవో వెంకట్రావు పరిశీలించారు. తెగిన చదలవాడ రామన్నచెరువు కట్టను ఎస్పీ హర్షవర్ధనరాజు పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. కొత్తకోట, హనుమాపురం, ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు, మట్టిగుంట రోడ్డులోని వాగుకు వరద చేరడంతో అధికారులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. పలు వాగులను అధికారులు పరిశీలించారు. నాగులుప్పపాడు, కనపర్తిలో పునరావాసకేంద్రాలు కొనసాగాయి. భారీ వర్షం, చలిగాలులకు పోతవరం, కె.తక్కెళ్లపాడు, కనపర్తి గ్రామాల్లో ఆరు గొర్రెలు, ఒక గెదె దూడ మృతి చెందాయి. కె.తక్కెళ్లపాడుకు చెందిన నూతలపాటి వేణు నివాస గృహం కూలిపోయింది. ఉప్పుగుండూరులో చెట్లు నేలకొరిగాయి. పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన గొల్ల యేసోబు పాముకాటుకు గురికావడంతో చికిత్స నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలించారు. చదలవాడలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించారు. కనపర్తి నుంచి కుక్కలవారిపాలెం రోడ్డులోని బకింగ్‌హామ్ కెనాల్‌పై నున్న నేలచప్టా కుంగి గుంతలు పడటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఈదుమూడి, ముప్పాళ్ల వద్ద వరదనీటి ఉధృతిని రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ రజియాసుల్తానా పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో మునిగిపోయిన పంట పొలాలను డీఏవో శ్రీనివాసరావు పరిశీలించారు. 2500 ఎకరాల్లో వరిపంట సాగు చేశారని, వరద తగ్గిన వెంటనే పంట నష్ట పరిహారం నమోదు చేస్తామని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఏటిఒడ్డు ఉప్పలపాడు గ్రామాన్ని ప్రత్యేకాధికారి జి.జోసెఫ్‌కుమార్, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్ పరిశీలించి కాలనీవాసులతో మాట్లాడారు. కొత్తకోట వాగును ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మాచవరంలోని సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలింది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అగ్రహారంలో చుండూరి రాఘవయ్యకు చెందిన కొష్టం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయింది. రెండు కరెంటు స్తంభాలు పడిపోయాయి.

ముసి తీవ్రరూపం

● తీరంలో మునిగిన పొగనారు మడులు


పెరిదేపి వద్ద ముసి ఉధృతికి నీట మునిగిన పొగనారుమడులు

కొండపి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలం నుంచి ప్రవహించే ముసి ఏరు తీవ్రరూపం దాల్చింది. మద్దులూరు నుంచి టంగుటూరు మధ్యలో పెరిదేపి వద్ద ముసిలో అట్లేరు కలుస్తుంది. తర్వాత చోడవరం. వెన్నూరు గ్రామాల వద్ద నల్లవాగు, కె.ఉప్పలపాడు వద్ద ఉప్పువాగు, పాలేటిపాడు, జయవరం వద్ద పలు వాగులు ముసిలో కలుస్తాయి. ముసిలోనే నీటి ప్రవాహం తీవ్రంగా ఉండటంతో పెరిదేపి వద్ద అట్లేరు నుంచి వెళ్లే నీరు వెనక్కి తన్నింది. దీంతో అట్లేరు పొంగింది. చోడవరం వద్ద, కె.ఉప్పలపాడు, పాలేటిపాడు, జయవరం గ్రామాల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముసి పరివాహక గ్రామాల్లో సాగు చేసిన వందలాది ఎకరాల్లోని పొగాకు నారుమడులు నీట మునిగాయి. దీంతో వాటి యజమానులు లక్షల రూపాయలు కోల్పోయి ఆవేదన చెందుతున్నారు. నీటి ఉధృతికి ఇంజన్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్‌పైపులు, పీవీసీ పైపులు, పొగాకు పనులకు వచ్చిన కూలీల వస్తువులు, వంట సామగ్రి కూడా నీటిలో కొట్టుకుపోయాయి. తుఫాన్ ప్రభావంతో పలు మండలాల్లోని లోతట్టు కాలనీలు నీట మునిగాయి. జరుగుమల్లి మండలంలోని పాలేటిపాడు, తూమాడు, గ్రామాల్లోని కాలనీల్లో నీరు చేరింది.

వల్లూరు చెరువు లాకులు ఎత్తివేత

టంగుటూరు (కొండపి) : వల్లూరు చెరువుకు భారీగా నీరు చేరడంతో నిండింది. ముందు జాగ్రత్తగా అధికారులు చెరువు అలుగు లాకులను బుధవారం రాత్రి ఎత్తారు. దీంతో జాతీయ రహదారిపై నుంచి నీరు ప్రవహిస్తోంది. అలుగు వద్ద నీటితోపాటు చేపలు వస్తుండటంతో స్థానికులు తమ వాహనాలను, ఇతర వస్తువులను హైవేపైనే పెట్టి చేపల పట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎస్ఐ నాగమల్లేశ్వరరావు అక్కడికి చేరుకుని రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఆర్డీవో

పొన్నలూరు: పొన్నలూరు చెరువు, నాగిరెడ్డిపాలెం సమీపంలోని గొరిసలేరులో నీటి ప్రవాహాన్ని ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. గొరిసలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కందుకూరు నుంచి కనిగిరి వెళ్లే వాహనాలను నిలిపివేయాలని డిపో మేనేజర్లకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి సీహెచ్.సువార్త, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో పిసుజాత ఉన్నారు. మండలంలోని పాలేరు సమీపంలో ఉన్న కోటపాడు, కల్లూరివారిపాలెం, రావులకొల్లు వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు ఆగిపోయాయి. పొన్నలూరులో బుధవారం మండవ మాధవ, లేళ్లపల్లి లక్ష్మమ్మలకు చెందిన బ్యారన్లు పడిపోయాయి.

సంతనూతలపాడులో అస్తవ్యస్తం


కట్ట తెగిన పేర్నమిట్ట చెరువు

సంతనూతలపాడు, అక్టో బరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. సంతనూతలపాడు పెద్ద చెరువు వద్ద పరిస్థితిని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక పునరావాసకేంద్రంలోని నిర్వాసితులకు ఆహారం అందజేశారు. పెద్దచెరువు సమీపంలోని శివాలయం గర్భగుడి పూర్తిగా మునిగిపోయింది. ఈ చెరువుకు పెద్ద ఎత్తున్న చేరుతున్న వరద నీటిని మండల ప్రత్యేకాధికారి పి.శ్రీహరి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది పెద్ద మోటార్లతో బయటకు తరలించారు. ఎస్ఐ అజయ్‌బాబు, ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఎండ్లూరు, మైనంపాడు మధ్యన ఎండ్లూరు చెరువు అలుగు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పేర్నమిట్ట సమీపంలోని చెరువు తెగిపోవడంతో కర్నూల్‌రోడ్డుపైకి చేరి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ఉన్న డివైడర్‌ను పగులగోట్టి వర్షపునీరు లేకుండా చేశారు. సంతనూతలపాడులో కర్నూల్‌రోడ్డుపై పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా సంతనూతలపాడుకు చెందిన రాజకుమారి అనే గర్భిణిని మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో చేర్పారు. బుధవారం ఆమె బిడ్డకు జన్మనిచ్చింది. మండల ప్రత్యేక అధికారి పి.శ్రీహరి, ఎంపీడీవో సురేష్‌బాబు ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో వైద్యులు సుధామయి, సిబ్బంది పాల్గొన్నారు. కొనగానివారిపాలెంకు చెందిన మరో గర్భిణిని చీమకుర్తి సీహెచ్‌సీకి 108 వాహనంలో పంపించారు.

రామతీర్థానికి భారీగా ఇన్‌ఫ్లో

చీమకుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి రామతీర్థం జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు అలుగు పారటం అరుదు. జలాశయం నిర్మాణం చేపట్టిన తర్వాత అది పారిన సంఘటనలు వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 85.34మీటర్లు కాగా ప్రస్థుతం పూర్తిస్థాయికి చేరుకుంది. ఇన్‌ఫ్లోగా దాదాపు 350మీటర్లు జలాలు ప్రాజెక్టులోకి చేరుతోంది. విద్యుత్ సౌకర్యం లేక పర్యవేక్షణకు అధికారులకు ఇబ్బందిగా మారింది.

పొంగిన వాగులు


పారుతున్న చీమకుర్తి చెరువు అలుగు

చీమకుర్తి మండలంలోని గ్రామాలన్ని దాదాపు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, సజ్జ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముదిగొండి, పాచివాగు, ఉత్తరవాగులు పొంగటంతో బండ్లమూడి, పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం, నేకునంబాదు, చంద్రపాడు గ్రామాలకు రాకాపోకలు నిలిచిపోయాయి. నిప్పట్లపాడు గ్రామానికి ముందున్న వాగు భారీ స్థాయిలో పొంగటంతో అక్కడే ఉన్న వందేళ్లనాటి చింతచెట్టు కూలిపోయింది. కేవీపాలెం నుంచి ముప్పావారిపాలెం, ఏలూరివారిపాలెం, గోనుగుంట తదితర గ్రామాలకు వెళ్లే వీలులేకుండా వాగులు చెరువుల్లా మారాయి. పల్లామల్లి పంచాయతీ పరిధిలోని పాండురంగాపురం ముంపు నుంచి గ్రామస్థులు తప్పించారు. చీమకుర్తి కొండలపై నుంచి వచ్చే వర్షపు గ్రామంలోకి రాకుండా తారురోడ్డుకి గండి పల్లామల్లి చెరువుకు మళ్లించారు. దీంతో చెరువు అలుగు పారుతోంది.

14ఏళ్ల తర్వాత అలుగు పారింది..


పూర్తిగా నిండిన కొండపి పీడబ్ల్యూడీ చెరువు

కొండపి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపి పీడబ్ల్యూడీ చెరువు 14 ఏళ్ల తర్వాత నిండింది. చెరువుకు ఎగువన చెక్‌డ్యాంలు నిర్మించారు. దీంతో చెరువులోకి నీరు రావడం, అలుగులు పారడం అయ్యేదేనా? అని ఆయకట్టు రైతులు పదేపదే అనుమానం వ్యక్తం చేస్తుండేవారు. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండింది. రెండు అలుగులు పారాయి.

20ఏళ్ల అనంతరం అట్లేరు..

అట్లేరు రెండు దశాబ్దాల నుంచి ఇంత ఉధృతంగా ప్రవహించిన దాఖలాలు లేవని స్థానికులు అంటున్నారు. అయితే ప్రస్తుతం ఉగ్రరూపం దాల్చింది. పరివాహక ప్రాంతంలోని నారుమడులపై నుంచి నీరు ప్రవహించడంతో సాగుదారులు నష్టపోయారు.

బస్సులు బంద్

ముసి ఉగ్రరూపం దాల్చడంతో కొండపి-టంగుటూరు రోడ్డులోని పాలేటిపాడు, జయవరం గ్రామాల నుంచి ఏరులో కలవాల్సిన నీరు వెనక్కి తన్నింది. దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్డులోని చప్టాలపై నుంచి నీరు ప్రవహించి రాకపోకలు ఆగిపోయాయి. కొండపి-పెరిదేపి గ్రామాల మధ్యన కూడా చప్టాపై నుంచి నీరు పారింది. తాటాకులపాలెం-చినకండ్లగుంట గ్రామాల మధ్యన కొయ్యలవాగు ప్రవహించడంతో ఈమార్గంలోనూ బస్సులు, భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అట్లేరు, ముసి, ఇనగలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మద్దులూరురోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

డ్రీమ్ వ్యాలీ నుంచి నిర్వాసితుల తరలింపు

ఒంగోలు(రూరల్),అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ముదిగొండి వాగు ఉధృతంగా ప్రవహించటంతో మండంలోని మండవవారిపాలెం గ్రామ పరిధిలో గల డ్రీమ్‌వ్యాలీ కాలనీలోకి భారీగా వరదనీరు చేరింది. దీంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బుధవారం ట్రాక్టర్‌ల ద్వారా వరద బాధితులను ఒంగోలులోని పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళవారం రాత్రి నుంచి వరద నీరు చేరటంతో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అయితే ఈ విషయం ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో మొత్తం 20కుటుంబాల వారిని తరలించారు. కొంతమంది పైఅంతస్తులలో ఉండటంతో వారికి అవసరమైన తాగునీరు, ఆహారం సరఫరా చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఎంపీడీవో రాజశేఖరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా దశరాజుపల్లిని ముదిగొండి వాగు నీరు చుట్టుముట్టింది. చిన్నకుంట వద్ద వరదనీరు ఉధృతంగా ఉండటంతో కాపలా ఏర్పాటు చేశారు. దేవరంపాడు దగ్గర గల చప్టాపై వరద అధికంగా గుండాయపాలెంకు రాకపోకలు నిలిచాయి. ఎన్.అగ్రహారం రోడ్డులో మొండి వాగు కొత్తమామిడిపాలెం పోవు రోడ్డులో గల చప్టాపై, గుత్తికొండవారిపాలెం దగ్గర గల ముదిగొండివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపేశారు. కొప్పోలు, త్రోవగుంట సబ్‌స్టేషన్‌లలో వరద నీరు చేరింది. కొప్పోలు రోడ్డులో వరద ఉండటంతో వాహనాలు రాకపోకలను ఆపేశారు.

సింగరాయకొండలో జోరువాన

జిల్లాలోనే అత్యధికంగా 224 మి.మీ వర్షపాతం

నిండిన పంట చెరువులు

సింగరాయకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో సింగరాయకొండ మండలంలో మంగళవారం రాత్రి జోరువాన కురిసింది. బుధవారం ఉదయానికి జిల్లాలోనే అత్యధికంగా 224 మి.మీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాకల, బింగినపల్లి, పాతసింగరాయకొండ, శానంపూడి చెరువులతోపాటు మిగిలినవి కూడా పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి. ముట్టేరు పొంగి పొర్లడంతో శానంపూడి-పటికినేనివారిపాలెం రోడ్డుపై భారీగా వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో ఎవరూ ప్రయాణించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. శానంపూడి శివాలయం సమీపంలోకి నీరు చేరుకుంది. పాకల పునరావాస కేంద్రంలో ఉన్న వారితోపాటు పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని తాతయ్యకాలనీ, మల్లికార్జున్‌నగర్, టీపీ నగర్ అప్పాపురం ఎస్టీ కాలనీలో ఇబ్బంది పడుతున్న గిరిజనులకు స్థానిక టీడీపీ నేతలు భోజనం పెట్టారు. పాకల, ఊళ్లపాలెం. శానంపూడి, లోతట్టు ప్రాంతాల్లో మండల ప్రత్యేక అధికారి అయిన జడ్పీ సీఈవో చిరంజీవి, తహసీల్దార్ రాజేష్, ఎస్సై బి.మహేంద్ర, పలుశాఖల అధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

జీవనసాఫల్య పురస్కారం ప్రదానం


సీఎం రంగస్వామి చేతులమీదుగా పురస్కారం అందుకొంటున్న సావిత్రి

నాగులుప్పలపాడు,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు కనమర్లపూడి సావిత్రిని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అందించిన జీవనసాఫల్య పురస్కారం పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి చేతులమీదుగా బుధవారం అందుకున్నారు. ఉపాధ్యాయ రంగంలో 25 ఏళ్ల పాటు తనదైన శైలిలో విద్యార్థులకు అభ్యాసన కృత్యాలతో బోధన చేస్తూ సామాజిక,సాహిత్య రంగాలలోనూ తనదైన ముద్రవేసుకొన్న సావిత్రికి పాండిచ్చేరి షన్‌బాగ్ హోటల్‌లో పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, కార్యదర్శి శిద్దా సూర్యప్రకాశరావు, కోశాధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు సరుకుల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని గుడ్ న్యూస్ అంధుల పాఠశాలకు రిలయబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి, నిర్వాహకులు మోహనరావు పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ.. తప్పిన ప్రమాదం


గోడను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి బుధవారం ఓ పెంకుటిల్లు గోడ కూలింది. స్థానిక సీతారాంపురంలోని ఓ ఇంటి గోడ కూలిపోవడంతో వర్షం సమయంలో ఇంటిలోనే ఉన్న కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే గోడ బయట వైపు కూలడంతో ఆ ఇంట్లో నివసించేవారు ఊపిరి పీల్చుకున్నారు. కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఆ ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఐ ప్రతినిధి బృందం బుధవారం నగరంలోని పలు కాలనీలను సందర్శించింది. కార్మికనగర్, శివారు కాలనీల్లో భారీ వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి ప్రభుత్వం అన్ని విధాలుగా వారిని ఆదుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శివం ఫౌండేషన్ బాసట


దుప్పట్లను అందజేస్తున్న తహసీల్దార్, ప్రతినిధులు

చీమకుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం క్యాంప్‌కాలనీలో నివసిస్తున్న వంద పేద కుటుంబాలకు శివం ఫౌండేషన్ చేయూతనచ్చింది. గుడిసెల్లో నివసిస్తూ తుఫాన్ సందర్భంగా ఇబ్బందిపడుతున్న వారికి బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి, టీడీపీ నాయకులు పమిడి శ్రీనివాసరావు, వై.శేఖర్, రామారావు, శ్రీనివాసరావు, నాగరాజు, హరి, తిరుమల, సలీం, సుధీర్, కాసియా తదితరులు పాల్గొన్నారు.

'ఏఎంఆర్' అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయండి

చీమకుర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ క్వారీలు, కంకరమిల్లులు తదితర చిన్నతరహా ఖనిజాలకు సీనరేజి వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ తన పరిధిని అతిక్రమించి చేస్తున్న అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ నాయకులు కోరారు. బుధవారం చీమకుర్తిలో తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. చీమకుర్తి పట్టణ, మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం ట్రాక్టర్ల ద్వారా డబ్బులు చెల్లించి తీసుకెళ్లే గ్రానైట్ వేస్ట్ మట్టి, డస్ట్, సైజురాయి, గుండురాళ్లపై కూడా అపరాధరుసుం పేరిట వసూళ్లు చేపట్టటం అన్యాయం అన్నారు. స్థానిక ప్రజలు పశువుల కొష్టాలు, గొర్రెల దొడ్లు తదితర ప్రాంతాల్లో మెరక తోలుకోవటానికి వీటిని తీసుకెళ్తున్నారని, ఇలాంటి వాటికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, అవనిగడ్డ శేషయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, గొల్లపూడి కోటేశ్వరరావు, నర్రా నాగరాజు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : వైసీపీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైసీపీ నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

20వేల బాతులు మృత్యువాత


చనిపోయిన బాతులు

సంతనూతలపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో 20వేల బాతుల వరకు మృత్యువాతపడిన సంఘటన మైనంపాడు డొంకసమీపంలో చోటుచేసుకుంది. చీమకుర్తికి చెందిన దేవరకొండ దుర్గారావు, దేవరకొండ విజయమ్మ, పేరంబాబు, దేవరకొండ రామక్రిష్ణలు మైనంపాడు డొంకసమీపంలో గుడారాలు వేసుకుని బాతులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు సంతనూతలపాడు పెద్ద చెరువు నీటి వాహం, వర్షపునీటి ప్రవాహానికి బాతులు, బాతుపిల్లలు కొట్టుకునిపోయాయి. దాదాపుగా రూ.9లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పేపర్‌బాయ్స్‌కు లయన్స్‌క్లబ్ చేయూత

చీమకుర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎలాంటి వాతావరణ పరిస్థితులున్నా సరే.. తెల్లారేసరికి గుమ్మంలో వార్తాపత్రికలను చేరవేస్తున్న పేపర్‌బాయ్స్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి చేయూతనందించింది. వారి విధినిర్వహణకు వీలుగా వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు రైన్‌సూట్ కమ్ స్వెట్టర్లను బుధవారం చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ చలువాది బదరీనారాయణ పేపర్‌బాయ్స్‌కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చలువాది పార్థసారథి, డైరెక్టర్ చలువాది రమేష్, పేపర్‌బాయ్స్ పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ


ఆహారాన్ని అందజేస్తున్న జయంత్‌బాబు

మద్దిపాడు, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గురవారెడ్డిపాలెం, పెద్దకొత్తపల్లి, దొడ్డవరం వాగులు పొంగి లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో జనజీవనం స్తంభించిపోయింది. మద్దిపాడు మండలంలో 22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, ఎస్ఐ వెంకటసైదులు బృందాలుగా ఏర్పడి వాగులు, వంకలను పరిశీలించారు. రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు సీతారాంపురం వద్ద జగనన్న కాలనీలో పర్యటించి ఆహార పొట్లాలు అందజేశారు. మద్దిపాడు పునరావాస కేంద్రాన్ని ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. పునరావాస కేంద్రంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి వరలక్ష్మి అధికారులను ఆదేశించారు.

పెద్దకొత్తపల్లి వాగును పరిశీలన : పెదకొత్తపల్లిలోని ముదిగొండి వాగును బుధవారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పరిశీలించారు. వరద బాధిత ప్రజలు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన చెప్పారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని నిర్వాసితులకు బుధవారం టీడీపీ నేత కుంచాల రాజు స్వచ్ఛందంగా భోజన సౌకర్యాలను కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి, ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డిలు స్వయంగా భోజనాలను వడ్డించారు. కుంచాల రాజును అధికారులు అభినందించారు.


కొండేపల్లిలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందుల


రాళ్లవాగును పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


జలకళను సంతరించుకున్న మార్కాపురం చెరువు


భారీ వృక్షం నేలకొరగడంతో అలుగు సమీపంలో దెబ్బతిన్న గుడిసె


గిద్దలూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న ఎనుమలేరు

ముంచిన మొంథా


తర్లుపాడులో పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

- భారీ వర్షాలు.. పొంగి పొర్లుతున్న నదులు, వాగులు
- నిండిన చెరువులు, మునిగిన పంట పొలాలు
- ఆందోళనలో రైతులు
- ముందస్తు చర్యలతో తప్పిన ఆస్తి, ప్రాణ నష్టాలు

మార్కాపురం/త్రిపురాంతకం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో పశ్చిమ ప్రకాశం అతలాకుతలమైంది. ఎడతెరపిలేని వర్షాలతో నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో చివురుటాకులా ఒణికింది. పంట పొలాలు తటాకాలను తలపించాయి. రహదారులు నీటి కుంటల్లా మారాయి. చాలా గ్రామాలు నీట మునిగాయి. రైతులకు అపారనష్టం చవిచూపించింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని తుఫాన్ ప్రభావం తగ్గించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టడంతో తీవ్రత తగ్గింది. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చేసిన నిర్విరామ కృషి వలన ప్రాణ, ఆస్తి నష్టాలు పరిమితమయ్యాయి. డివిజన్‌లో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి.

మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సాగు చేసిన అన్ని పంటలు దాదాపు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మొత్తం 49 గ్రామాల్లో పరిస్థితి అతలాకుతలమైంది. సుమారు 5,513 హెక్టార్లలో పంటలు పూర్తిగా నీట మునిగి దెబ్బతిన్నాయి. పత్తి పంట పూర్తిగా నాశనమైంది. సుమారు 402 హెక్టార్లలో మినుము, 215 హెక్టార్లలో కంది, 50 హెక్టార్లలో నూగు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిరప, పొగాకు పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొక్కజొన్న పంట చేతి కందివచ్చే సమయంలో తుఫాన్ ప్రభావం చూపడంతో దిగుబడులు వచ్చే పరిస్థితులు కనిపించడంలేదు.

నష్ట నివారణకు చొరవ చూపిన ప్రజాప్రతినిధులు, అధికారులు

మొంథా తుఫాన్ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలలో వారిని ప్రత్యేక శిబిరాలకు తరలించే ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టారు. ప్రధానంగా గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంపై ముందే ప్రత్యేక దృష్టి పెట్టారు. వర్షం ప్రభావంతో నది ఉగ్ర రూపం దాల్చినా ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా తగిన చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి నష్ట నివారణ తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ కె.చిరంజీవి, ఎంపీడీవో బాలచెన్నయ్య, వ్యవసాయ అధికారులు బాలాజీనాయక్, బుజ్జిబాయి తదితరులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎలాంటి నష్టం జరుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

ఉధృతంగా ప్రవహించిన గుండ్లకమ్మ

మొంథా తుఫాన్ ప్రభావంతో గతంలో ఎన్నడూలేని విధంగా గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహించింది. పలు మండలాల పరిధిలో 5 నుంచి 15 అడుగుల మేర ఎత్తులో గుండ్లకమ్మ పొంగింది. కొన్నిచోట్ల చిన్నపాటి గండ్లుపడినా ఇరిగేషన్ అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పూడ్చివేశారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని తిప్పాయపాలెం, బోడపాడు, కొండేపల్లి, మాల్యవంతునిపాడు, పెద్దనాగులవరం గ్రామాలలో వీధులలోకి వరద నీరు చేరింది. బోడపాడులో ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ద్వారా వరద నీటిని వాగుకు మళ్లించారు. ఎమ్మెల్యే కందుల, నాయకులు అధికారులతో కలిసి కొండేపల్లి, భూపతిపల్లి, మాల్యవంతునిపాడు ముంపు ప్రాంతాలలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

పశ్చిమం అతలాకుతలం

త్రిపురాంతకం : మొంథా తుఫాన్ పశ్చిమ ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. ఎన్నో ఏళ్లుగా నిండని చెరువులు నిండాయని సంతోష పడాలో నీటమునిగిన పంటల నష్టాన్ని తలచుకుని బాధ పడాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. మరోవైపు రవాణా వ్యవస్థనూ మొంథా దెబ్బతీసింది. బుధవారం ఒక్కరోజే అత్యధిక వర్షపాతంతో పాటు బలమైన గాలులు వీచిన కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. మార్కాపురం డివిజన్ మొత్తమ్మీద సగటు వర్షపాతం 125.4 మి.మీ కాగా బుధవారం 1630.4 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా తర్లుపాడు మండలంలో 160.8 మి.మీ వర్షం కురవగా తరువాత మార్కాపురం 152.4 మి.మీ, త్రిపురాంతకం 151.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. దీంతో బుధవారం ఉదయానికి పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పుల్లలచెరువు మండలం ఐటివరం ఎస్సీ కాలనీలోకి వరదనీరు చేరింది. మార్కాపురం మండలం కొండపల్లి, మార్కాపురం పట్టణంలోని కొన్ని వార్డుల్లోకి కూడా నీరు చేరింది. ఏళ్ల తరబడి నిండని చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. చారిత్రాత్మక చెరువులైన మార్కాపురం, కంభం చెరువులు జలకళ సంతరించుకున్నాయి. త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం చెరువు నిండి గ్రామంలోకి నీరు వస్తుండడంతో గ్రామస్థులు చెరువుకు ఎగువ భాగంలో గండికొట్టి నీటిని వాగుకు మళ్లించారు. ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో పలు చెరువులు పూర్తిగా నిండాయి. తీగలేరు, గుండ్లకమ్మ, పగిడివాగు, సగిలేరు తదితర వాగులు పొంగి ప్రవహించాయి. వాగులు పొంగి రోడ్లపై నీరు ప్రవహించడం కారణంగా కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. త్రిపురాంతకం-ఎర్రగొండపాలెం మధ్య అయ్యంబొట్లపల్లి సమీపంలో నీటి ప్రవాహం కారణంగా ఉదయం కొంతసేపు రాకపోకలు నిలిచాయి. పుల్లలచెరువు - వినుకొండ మధ్య కూడా రాకపోకలు నిలిచాయి. దోర్నాల-కర్నూలు మధ్య, మాచర్ల- ఎర్రగొండపాలెం మధ్య రాకపోకలు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ నుంచి ఎర్రగొండపాలెం వైపు వస్తున్న 7 ఆర్టీసీ సర్వీసులు, 2 ప్రైవేటు బస్సులు పల్నాడు పరిధిలోని కుంకుడు పెంట దావుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగడంతో రాత్రంతా నిలిచిపోవాల్సి వచ్చింది. ప్రయాణికులంతా బిక్కుబిక్కుమంటూ ఉండిపోగా పోలీసులు ప్రయాణికులకు ఇవతలకు తీసుకువచ్చి వారిని ఎర్రగొండపాలెంకు చేర్చారు. ఏ పంటైనా నీటి నుంచి బయట పడి సాధారణ పరిస్థితిలోకి వచ్చాక నష్టం అంచనా వేయగలమని అధికారులు చెప్తున్నా చాలావరకు నష్టం జరిగినట్లు రైతులు చెప్తున్నారు.

తర్లుపాడు : పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పొగాకు, మిర్చి, పత్తి పూర్తిగా దెబ్బతిన్నాయి. సీతానాగులవరం, తర్లుపాడులో పంట పొలాల్లో చెరువును తలపిస్తు వర్షపు నీరు ఉంది. దీంతో ఈ పొలాల్లో సాగు చేసిన పంటలన్ని పూర్తిగా దెబ్బతినడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. మంగళవారం రాత్రి నుంచి సీతానాగులవరం వద్ద కొండ వాగు ఉధృతంగా పారడంతో తర్లుపాడు, మార్కాపురం రాకపోకలు నిలిచిపోయాయి. కలుజువ్వలపాడులో ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మొంథా తుఫాన్‌తో రైతులకు భారీ నష్టం వాటిల్లింది.

కొనకనమిట్ల : మండలంలోని తువ్వపాడు, వద్దిమడుగు, చినమనగుండం, పెదారికట్ల తదితర గ్రామాల చెరువులు జలకళతో కళకలలాడుతున్నాయి. అదేవిదంగా చింతగుంట- బురదపాలెం సమీపంలోగల ముసి ప్రవహిస్తోంది. కొనకనమిట్ల-చింతగుంట వాగు దాటుతూ వ్యక్తి కొట్టుకు పోతుండగా గమనించిన గ్రామస్థులులు ట్రాక్టర్ సహాయంతో రక్షించారు. పెరారెడ్డిపల్లివద్ద వాగు ప్రవహిస్తోంది. టీడీపీ నాయకులు పరిశీలించి ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు.

పెద్దారవీడు : మొంథా తుఫాన్ నిండా ముంచింది. సాగు చేసిన పంటలలో ఏ పంట కూడా చేతులకందే పరిస్థితి లేదు. 20 ఏళ్లలో ఇంత వానలు చూడలేదని రైతులు చెప్తున్నారు. తీగలేరు. రాళ్లవాగుల మీదుగా వరద ఉధృతంగా ప్రవహించింది. తోకపల్లి వద్ద అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై నిర్మించి బ్రిడ్జికి కేవలం మూడు అడుగుల దూరం నుంచి తీగలేరు ప్రవహించింది. సానికవరం, ఎర్రగొండపాలెం మండలం తమ్మడపల్లి గ్రా మాల మధ్య రాళ్లవాగు ఉధృతంగా పారింది. దోర్నాల మండలంలోని బొమ్మలాపురం చెరువులో నీటి నిల్వ సామర్థం స్థాయి మించిపోవడంతో చెరువుగల రెండు లాకులను తెరిచి చెరువులోని నీటిని రాళ్లవాగులోకి వదిలేశారు. రాళ్లవాగు ప్రగళ్లపాడు వద్ద తీగలేరులో కలిసింది. మంగళవారం రాత్రే ప్రత్యేకాధికారి జగన్, ఎంపీడీవో జాన్ సుందరం, తహసీల్దార్ దిలీప్‌కుమార్ చర్యలు చేపట్టారు. రాళ్లవాగు సమీపంలో ఉంటున్న 50 కుటుంబాల వారిని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. రాళ్లవాగులో నీటి ప్రవాహాన్ని, పునరావాస కేంద్రాలను టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. మిరప, పత్తి, శనగ పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. మార్కాపురం ఏడీఏ బాలజీనాయక్, ఏవో లక్ష్మీ నారాయణ, హార్టికల్చర్ ఆఫీసర్ ఆదిరెడ్డి పంట నష్టాలకు అంచనాలు వేయడంలో నిమగ్నమయ్యారు. తోకపల్లిలో చెన్నయ్యకు చెందిన రెండేళ్ల వయసున్న రెండు ఎకరాల నిమ్మ తోట మునిగిపోయింది. రాళ్లవాగు, తోకపల్లి వద్ద ప్రవహిస్తున్న తీగలేరు వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ సాంబశివయ్య పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పొదిలి : వాగులు, చెక్‌డ్యాంలు నిండుకుండాల మారాయి. బట్టువారిపల్లి వద్ద ఉన్న వాగు, మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలోని పల్లె కంటేరు వాగు, అన్నవరం పెద్దఉయ్యాలవాడవాగు, ముసి నది తదితర వాగులు, నది నిండు కుండలా మారాయి.

ఉధృతంగా సగిలేరు, ఎనుమలేరు.. పరిశీలించిన అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్ : మొంథా తుఫాన్ గిద్దలూరు ప్రాంతంలో తన ప్రభావం చూపించింది. గిద్దలూరులో ఒక్కరోజులోనే 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులన్నీ నిండాయి. సగిలేరు, ఎనుమలేరు ఉధృతంగా ప్రవహించాయి. బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నదీపరీవాహక ప్రాంతాలలో పర్యటించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముండ్లపాడు గ్రామంలో శీలం గోపిక్రిష్ణకు చెందిన టెంటు సప్లై సామాన్లు భద్రపరిచే మట్టిమిద్దె తుఫాన్ కారణంగా కూలిపోయింది. గోడౌన్‌లోని సామాన్లు ధ్వంసమయ్యాయి. సుమారు లక్ష రూపాయల నష్టం సంభవించినట్లు బాధితుడు గోపిక్రిష్ణ తెలిపారు. కేఎస్‌పల్లి గ్రామానికి చెందిన 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సగిలేరువాగును దాటుతుండగా 10 మృతిచెందగా మిగిలిన 20 గొర్రెలు వాగు నుంచి బయటకు తీయగా అవి కూడా చనిపోయాయి.

రాచర్ల : మొంథా తుఫాన్ కారణంగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు రామన్న కతువ డ్యాంతోపాటు నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. చిన్నగానిపల్లి రామన్న కతువ డ్యాం చోళ్లవీడు వద్ద గుండ్లకమ్మ వాగు, సోమిదేవిపల్లి, రామాపురం, మేడంవారిపల్లి గ్రామాల మధ్య పగిడి వాగు, అనుములవీడు గౌతవరం గ్రామాల మధ్య నక్కల వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుండ్లకమ్మ వాగు ఉధృతితో ఆకవీడు, చోళ్లవీడు గ్రామాల మధ్య, సంగపేట గ్రామ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నీటమునగడంతో రాకపోకలు స్తంభించాయి. పొగాకు, పత్తి, కంది, వరి పైర్లు నీట మునిగాయి. అన్ని చెరువులకు నీరు చేరిందని గిద్దలూరు ఇరిగేషన్ శాఖ డీఈ చెంచు రామారావు తెలిపారు. చోళ్లవీడు సమీపంలోని గుండ్లకమ్మ వాగు, అనుములపల్లి చెరువులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రత్యేక అధికారి ఎల్ వరలక్ష్మి బుధవారం పరిశీలించారు. నదులు, వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయని, అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : మొంథా తుఫాన్ ధాటికి మండలంలోని చెరువులు, వాగులు, కాలువలు, కుంటలు నిండి అలుగులపై నుంచి పారుతున్నాయి. పంటలన్నీ నీట మునిగాయి. కర్నూలు-గుంటూరు, దోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీశైలం, కర్నూలు వెళ్లేందుకు యాత్రికులను అనుమతించలేదు. కర్నూలు వైపు రోళ్లపెంట, కొత్తూరు వద్ద దొంగల వాగు, శ్రీశైలం వైపు తుమ్మలబైలు, చింతల వద్ద ఉన్న లోలెవల్ బ్రిడ్జిలపై నుంచీ రాళ్లవాగు గుండా వరదనీరు పోటెత్తడంతో పాటు అక్కడక్కడ కొండ రాళ్లు పడ్డాయి. కడపరాజుపల్లె చెరువు నిండి అలుగు ద్వారా ప్రవహించిన వరద తిమ్మాపురం, కడపరాజుపల్లె పంటపొలాలపై చేరడంతో నూటయాభై ఎకరాలకు పైగా మిరప, పత్తి మునిగింది.

నష్టపోయిన పంటలను టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు బుధవారం పరిశీలించారు. పెద్దబొమ్మలాపురంలో అరటి, బొప్పాయి, మిరపను చూశారు. అనంతరం గంటవానిపల్లె, బ్రిడ్జిని, దొంగలవాగు ఉధృతిని పరిశీలించారు. తిమ్మాపురం రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మిరప, ఉల్లి, మొక్కజొన్నకు నష్టం

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండలంలో సాగులో ఉన్న 8,900 ఎకరాల్లో మిరప తోటలు సాగులో ఉన్నాయి. ఎర్రగొండపాలెం, పందివానిపల్లె, నరసాయపాలెంలో మిరప తోటల్లో నీరు నిలిచినట్లు రైతులు తెలిపారు. పందివానిపల్లె, గురిజేపల్లిలో ఉల్లి నష్టపోయిందని అధికారులు తెలిపారు. 58 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలిందని, 240హెక్టార్లలో పత్తి తడిసిపోయిందని ఏడీఏ తెలిపారు. తుఫాన్‌తో నష్టపోయిన పంటల వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని ఎరిక్షన్ బాబు మండలెవెల్ అధికారులను కోరారు.


గుండ్లకమ్మ వాగును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వరలక్ష్మి


ఎర్రగొండపాలెం ప్రాంతంలో వర్షపు నీటిలో మిర్చి


పుల్లలచెరువు మండలం చౌటపచర్లలో నీటీలో ఉన్న వరి


దోర్నాల : తిమ్మాపురం పొలాల్లో ప్రవహిస్తున్న వరదనీరు


మార్కాపురం : నాయుడుపల్లి గ్రామంలో కూలిన ఐదు ఇళ్ల గోడ

అప్రమత్తంగా ఉండండి

రాచర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముప్పు తప్పేంత వరకు అధికారులు అప్రత్తంగా ఉండాలని మండల ప్రతేకాధికారి ఎల్ వరలక్ష్మి అన్నారు. ఆమె చోళ్లవీడు అనుములపల్లె గ్రామాల్లో వాగులను, చెరువులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎంఈవో గిరిధర్‌శర్మ, నాయకులు యోగానంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటిని బయటకు పంపుకోవాలి

గిద్దలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంట పొలాలు చెరువుల్లా మారాయి. మండలంలోని కొమ్మునూరు, సంజీవరాయునిపేట, ఓబులాపురం, గడికోట, ఉయ్యాలవాడ, ముండ్లపాడు, కొత్తకోట, వెల్లుపల్లి, అంబవరం గ్రామాల పరిధిలో సుమారు 1500 ఎకరాలలో పత్తి సాగు కాగా చాలా పొలాల్లో నీరు నిలిచిపోయింది. ఆ పొలాలను ఏవో విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించి పొలాల్లో నీటిని బయటకు పంపాలని సూచించారు.

కొనకనమిట్ల : తుఫాన్‌కు మునిగిన పంట పొలాలను వ్యవసాయ అధికారి ప్రకాష్‌రావు బుధవారం పరిశీలించారు. గొట్లగట్టు, చినమనగుండంలో ఆయన పర్యటించారు. వర్షాలతో అలసంద, మినుము పంటలను పరిశీలించారు. పొలాల్లో వర్షపు నీటిని బయటకు పంపాలని సూచించారు. పంట నష్టంపై నివేదికలను త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు.

పొదిలి : పొగతోటల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలని వేలం నిర్వహణాధికారి గిరిరాజకుమార్ రైతులకు సూచించారు. పొగాకు బోర్డు పరిధిలోని చినారికట్ల, మూగచింతల, తువ్వపాడు, గొబ్బూరు తదితర గ్రామాల్లో సాగుచేసిన పొగతోటలను బుధవారం ఆయన పరిశీలించారు. పొగాకు బోర్డు పరిధిలో 15 వేల హెక్టార్లలో పొగాకు సాగుచేశారని చెప్పారు. అలాగే ఏలూరు, నల్లూరు, సూదనగుంట, కుంచేపల్లి గ్రామాల్లో సజ్జ, కంది పంటలను ఏవో డి.శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

తీగలేరు ఆక్రమణలతో వరద

- పూడికతీత పనులు చేపట్టిన టీడీపీ నాయకులు
- తగ్గిన ఉధృతి

పెద్దారవీడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జల వనరులలో ప్రధానమైనది తీగలేరు కాల్వ. దీనిలో ప్రవహించే నీటి ద్వారానే చాలా చెరువులకు వర్షపు నీరు వెళ్లే వెసులుబాటు ఉంది. మండలంలోని బోడిరోడ్డిపల్లి చెరువుకు కూడా తీగలేరు నుంచి వచ్చే కాల్వల ద్వారా నీరు చేరుతుంది. ఆ కాల్వను మండలంలోని హనుమాన్ జంక్షన్ (కుంట) వద్ద కొందరు వ్యాపారులు పూడ్చివేసి దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కాల్వలో నీటి ప్రవాహం వెళ్లే అవకాశం లేకుండా పూడిపోయింది.

జాతీయ రహదారిపై వరద ఉధృతి

అమరావతి-అనంతపురం జాతీయ రహదారి హనుమాన్ జంక్షన్(కుంట) నుంచి వెళుతుంది. ఈ రహదారి కింద తీగలేరుకు సంబంధించిన తూములు కూడా ఉన్నాయి. అయితే ఆక్రమణదారులు ఆయా తూములను పూడ్చివేసి దుకాణాలను ఏర్పాటు చేయడం జరిగింది. తుఫాన్ కారణంగా తీగలేరుకు వరద ఉధృతి ఏర్పడింది. తీగలేరు ఆక్రమణ కారణంగా వర్షపునీటి ప్రవాహానికి ఆటంకరం ఏర్పడింది. దీంతో కాల్వలోని నీరంతా అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపైకి వచ్చింది. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. టీడీపీ నాయకులు కాల్వలో పూడిక తీతకు శ్రీకారం చుట్టారు. తూముల వరకూ దుకాణదారులు ఆక్రమించిన భూమిలోని మట్టిని తొలగించారు. దీంతో వరద నీరు యథావిధిగా కాల్వ గుండా ప్రవహించింది. దీంతో తీగలేరు కాల్వకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ఆక్రమణలను తొలగించి భవిష్యతులో ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.


అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వాన నీరు

కాల్వలో పూడికను తొలగిస్తున్న టీడీపీ నాయకులు




కంభం చెరువు అలుగు వద్ద గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

కంభం చెరువుకు ఎమ్మెల్యే పూజలు

కంభం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కంభం చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులందరూ పైరు పచ్చలతో కళకళలాడేలా దీవించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. కంభం చెరువు అలుగు పారిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి బుధవారం అలుగు వద్దకు వచ్చి గంగమ్మకు పూజలు చేశారు. అంతకు ముందుగా ఆయన కంభం, అర్ధవీడు మండలాల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న గుండకమ్మ, జంపలేరు వాగులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

కంభం : మంగళవారం రాత్రి కంభం ఫైర్ స్టేషన్ సమీపంలో భారీ వృక్షం కూకటి వేళ్లతో సహా విద్యుత్ తీగలపై పడడంతో ఆ ప్రాంతమంతా అంధకారం అలముకుంది. చెట్టు కూలే సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బుధవారం కందులాపురం పంచాయతీ వారు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించగా, విద్యుత్ అధికారులు తీగలను సరిచేసి సేవలు పునరుద్ధరించారు.

చెరువుల మరమ్మతులు చేపడతాం

కొమరోలు : నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో నీరు నిల్వ ఉండెందుకు అవసరమైన మరమ్మతులను వెంటనే చెపడతామని ఎమ్మెల్యే అశోకొరెడ్డి అన్నారు. భారీ వర్షానికి దెబ్బతిన్న తాటిచర్ల చెరువును ఆయన పరిశీలించారు. తుఫాన్ దెబ్బకు నష్టపోయిన రోడ్లు, పంటలు, చెరువుల విషయమై తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో సత్యం, ఎస్‌ఐ నాగరాజుతో ఎమ్మెల్యే సమీక్షించారు. సత్వర చర్యలకు ఆదేశించారు. తాటిచర్లలో చెరువు కట్ట బలోపేతానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండలాధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, భూపాల్ ఉన్నారు.

సర్విరెడ్డిపల్లి, రెడ్డిచర్ల, మల్లారెడ్డిపల్లి, తాతిరెడ్డిపల్లి గ్రామాల్లో కరెంట్ స్తంభాలు పడిపోగా ఏర్పాటు చేసినట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

నీటి ప్రవాహం తగ్గాకే వాహనాలను పంపాలి

బేస్తవారపేట : మండలంలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా పారుతున్నాయి. రాకపోకలు స్తంభించాయి. బుధవారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పలు ప్రదేశాలను పరిశీలించారు. పాపాయిపల్లె వద్ద వాగు ఉధృంగా ప్రవహించడంతో ఒంగోలు వైపు వెళ్లే వాహనాలను నిలిపివేశారు.నీటి ప్రవాహం తగ్గాక రాకపోకలు సాగించాలని పోలీసులకు సూచించారు. ఉప్పువాగు, సీతురేలు కతువను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి,కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి ఉన్నారు. నీటి కుంటలు,చెరువులు,వాగులు జలకళతో ఉన్నాయి.

కూలిన మిద్దెలు


తుమ్మలచెరువులో కూలిన మిద్దె


రాచర్లలో కూలిన మట్టిమిద్దె

తర్లుపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తుమ్మలచెరువులో పఠాన్ రెహమాన్‌ఖాన్‌కు చెందిన మిద్దె బుధవారం కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు బయటకి రావటంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటిలోని వస్తువులన్ని మిద్దె కూలటంతో సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంటనే తుమ్మలచెరువు గ్రామానికి వెళ్లి కూలిన మిద్దె పరిశీలించి నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండలంలోని పోతలపాడులో 2 పాతమిద్దెలు, లక్ష్మక్కపల్లెలో 1, తుమ్మలచెరువులో 1 మొత్తం మండలంలో 10 రేకులు చెడ్లు, మిద్దెలు కూలినట్లు తహశీల్దార్ కేకే కిశోర్ కుమార్ తెలిపారు. నష్టపరిహానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెద్ద దోర్నాల : వర్షానికి పాతమిద్దెలు కూలిపోయిన ఘటన మండలంలోని ఐనముక్కుల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన దండా వెంగళరెడ్డి, దండా సుబ్బారెడ్డి, చిట్యాల రామచంద్రారెడ్డి, చిట్యాల నర్శిరెడ్డి మిద్దెలు పడిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి అపాయం జరగలేదు.

రాచర్ల : మండలంలోని అనుములవీడు, ఒద్దులవాగు గ్రామాల్లో నాలుగు మట్టిమిద్దెలు కూలిపోయాయి. అనుములవీడుకు చెందిన షేక్ దర్వేష్ మొహిద్దీన్, చప్పిడి జనార్దన్‌రావు, ఒద్దులవాగు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి జయరాం రెడ్డి, చీమలదిన్నె పెద్దన్నలకు చెందిన గృహాలు పడిపోయాయి. ఎవరికీ ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. సమాచారం అందుకున్న అధికారులు తక్షణమే ఆయా గ్రామాలకు వెళ్లి కూలిన ఇళ్లను పరిశీలించారు. మట్టి మిద్దెల్లో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

శ్రీశైల భిళ మార్గం వద్ద కూలిన గోడ


కూలిన గోడ వద్ద ఈవో, చైర్మన్

త్రిపురాంతకం : త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానంలో ఉన్న శ్రీశైల భిళ మార్గం (చీకటిమిద్దె) తూర్పు వైపు గోడ పాక్షికంగా కూలింది. తుఫాన్ కారణంగా ఈ గోడ పాక్షికంగా దెబ్బతిన్నదని, ముందు జాగ్రత్తలతో అటువైపు ఎవరినీ వెళ్లనీయని కారణంగా ప్రమాదమేమి జరగలేదని ఆలయ కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. అర్చక స్వాములు, చైర్మన్ సుబ్బారావుతో కలిసి ఆయన పరిశీలించారు.

తర్లుపాడులో పారిశుధ్య పనులు

తర్లుపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో తర్లుపాడులో డ్రైనేజీలో వ్యర్థాలు అడ్డుపడటంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. వెంటనే పంచాయతీ కార్యదర్శి సుభాకర్ స్పందించి డ్రైనేజీలోని వ్యర్థాలను తొలగించారు. పలు వీధుల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. వర్షపు నీరు సజావుగా పోయేందుకు డ్రైనేజీలను క్లియర్ చేయడంతో వర్షపు నీరు అంతా చెరువుకు వెళ్లింది.

శనగ విత్తనాల పంపిణీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకొండపల్లె గ్రామంలో ప్రభుత్వం సమకూర్చిన సబ్సిడి శనగ విత్తనాలను మండల టీడీపీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు సయ్యద్ భాషా, బలరామిరెడ్డి, సురేఖ పంపిణీ చేశారు.

చెరువుకట్టను తెంపితే చర్యలు

గిద్దలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నీటితో నిండుగా ఉన్న చెరువుకట్టను తెంపే ప్రయత్నం చేస్తే వారిపై చర్యలు తప్పవని ముండ్లపాడు గ్రామంలోని ఓబులపతి తిమ్మరాజు చెరువు ఆయకట్టు చైర్మన్ ఎన్.వెంకటనరసయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు. 1996 తరువాత ఇప్పుడే చెరువు నిండి నిండుకుండలా ఉన్నదని పేర్కొన్నారు. పంటల కోసం కొంతమంది చెరువుకట్టను తెంపే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కట్టను తెంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



రాళ్లపల్లిలో తడిసి మొలకెత్తిన సజ్జ కంకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఉగ్ర సుడిగాలి పర్యటన

కనిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రతే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. తుపాను ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను, రైతులను ఆయన బుధవారం పరామర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనిగిరి మండలంలోని ఎన్. గొల్లపల్లి రిజర్వాయర్ నీటి మట్టాన్ని పరిశీలించారు. రిజర్వాయర్ అలుగు ఉధృతి తగ్గేవరకు అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. మండలంలోని పునుగోడు, తాళ్ళూరు, గుడిపాడు తదితర గ్రామాల్లో ప్రవహిస్తున్న వాగులను, హనుమంతునిపాడు మండలంలోని దాసరిపల్లి గ్రామంలో ఎర్రవాగు ఉధృతిని పరిశీలించారు. సజ్జపైరు పూర్తిగా దెబ్బతినటంతో ఆయా రైతులతో మాట్లాడి నష్టపరిహారం వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు. పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ప్రజలకు వివిధ సేవలు అందించిన తీరును అభినందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయాధికారులు, కూటమి నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, సానికొమ్ము తిరుపతి రెడ్డి (ఎస్‌టీఆర్), చీకటి వెంకటసుబ్బయ్య, గాయం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలు వేయండి

వెలిగండ్ల: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నీటమునిగి మొలకలు వచ్చిన చేలకు పరిహారం అందించేందుకు నివేదికలు తయారు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఏడీఏ జైన్‌లాబ్దిన్‌కు సూచించారు. మండలంలోని రాళ్ళపల్లిలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న సజ్జ పంటను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. కోత దశలో ఉన్న సజ్జ పంట గింజలు ఉబ్బడం, బూజు రావడం, నల్లగా మారి కంకిలో గింజలు మొలకెత్తాయి, మినుము, అలసంద పొలాల్లో నీరు ఎక్కువగా ఉండటంతో పంట నష్టం వాటిల్లింది. మండలంలో ప్రాథమికంగా 3,665 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. అనంతరం పూలికుంట్ల, రాళ్ళపల్లి ఇమ్మడిచెరువు గ్రామాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులను గ్రామస్థులతో కలిసి పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

అధికారుల సమన్వయం అభినందనీయం

● సమావేశంలో ఎంపీపీ తాటికొండ

తాళ్లూరు,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేశారని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో ఎంపీడీవో అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారి ఏ.కుమార్ పర్యవేక్షణలో తహసీల్దార్ రమణారావు సారథ్యంలో ఎంపీడీవో పి.అజిత, మండలంలోని అన్ని శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగి ప్రజలకు తుఫాన్‌వల్ల ఎటువంటి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టారన్నారు. మండల స్థాయి అధికారులు కూడా ప్రభుత్వ ఆదేశానుసారం సమష్టిగా పని చేయటం వల్ల మండల ప్రజలు ప్రశాంతంగా తుఫాన్ గండం నుంచి గట్టెకారన్నారు. టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ ఆదేశాలతో పార్టీ శ్రేణులు అధికారులకు తమ వంతుసహాయ సహకారాలు అందించటం అభినందనీయమన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరెడ్డి, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నేతలు, పలుశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు,



దర్శిలో జలమయమైన ప్రాంతాలను పరిశీలిస్తున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

బాధితులకు అండగా ఉంటాం

- టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తఫాన్ వలన నష్టపోయిన వారికి అన్నీ విధాలా అండగా ఉంటామని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భరోసా ఇచ్చారు. దర్శి పట్టణంలో బుధవారం డాక్టర్ లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దర్శి-అద్దంకి రోడ్డులో జోమ్ కాలువ పొంగి జలమయమైన ప్రాంతాలను పరిశీలించారు. తూర్పువెంకటాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితులకు వసతులు, భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై. మహేశ్వరరావు, దర్శి సింగల్ విండో అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

ముండ్లమూరు : తుఫాన్ బాధిత ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ దర్శి నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పులిపాడు వద్ద ఉధృతంగా పొంగుతున్న చెరువును, అలుగును ఆమె పరిశీలించారు.

బైకు పై నుంచి పడి యువకుడి మృతి

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నరేంద్ర, చరణ్ యువకులు సరదాగా మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా బుధవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో నరేంద్ర (24) మృతిచెందాడు. బైకుపై వెళ్తున్న క్రమంలో బురదకు జారిపడడంతో నరేంద్ర తలకు తీవ్రగాయమైంది. చరణ్‌కు కూడా గాయాలయ్యాయి. ఘటనను చూసిన రైతులు 108కు సమాచారం ఇవ్వగా దర్శి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే నరేంద్ర మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చరణ్‌కు చికిత్స అందిస్తున్నారు.

వరద బాధితులకు ఆహారం

పొమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దూబగుంట గ్రామంలో వర్షాలకు నిరాశ్రయులైన వారికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక పునరావాస కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు ఉడుముల ప్రభాకర్‌రావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దైండే శివశంకర్, గ్రామ ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి సహకారంతో రెండు రోజుల నుంచి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. తుఫాన్ ప్రత్యేకాధికారి రవితేజ, తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, యారవ శ్రీను, బొల్లా నరసింహారావు ఉన్నారు.

అతలాకుతలం

తుఫాన్‌తో అతిభారీవర్షాలు
లోతట్టు ప్రాంతాలు జలమయం
పొంగిపొర్లిన వాగులు, చెరువులు
పంటలకు తీవ్ర నష్టం
స్తంభించిన జనజీవనం

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దర్శి ప్రాంతంలో బీభత్సం సృష్టించింది. మంగళవారం మొత్తం ఈదురుగాలులతో ఎడతెరపి లేని భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. దర్శి పట్టణంలోని పొట్టి శ్రీరాములు కళాశాల ప్రాంతంలోని పలు వీధులు జలమయమయ్యాయి. గృహల చుట్టూ నీరు చేరింది. వెలమవారివీధిలో గృహల్లోకి నీరు చేరింది. జూమ్ కాలువ పొంగటంతో దర్శి-అద్దంకి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్డులో కూడా నీటి ప్రవాహంతో రోడ్డు జలమయమైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న చెట్టు విరిగిపడింది. స్థానిక ఎస్ఎస్‌పీ కార్యాలయం ఎదుట చెట్టు విరిగిపడటంతో అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించారు. దర్శి పట్టణంలోని కాటేరువాగు, తూర్పువెంకటాపురం వద్ద పెద్ద వాగు, బొట్లపాలెం వద్ద దోర్నపు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దర్శి-ఆరవల్లి పాడు రోడ్డు మధ్యలో పెద్ద వాగు ఉధృతికి లోలెవల్ చప్టా కూలిపోయింది. అందువలన అక్కడ రాకపోకలకు ఇబ్బందికల్గింది. పొతకమూరు, త్రిపురసుందరీపురం, జముకలదిన్నె తదితర చెరువులు అంతకముందే నిండి ఉండటంతో భారీ వర్షాలకు మరింత నీరు చేరి ప్రమాదకరంగా మారాయి.



భారీ వర్షాలకు ఉరకెత్తిన పొగతోట

పంటలకు భారీనష్టం

తఫాన్ వలన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. మిర్చి తోటలు జలమయమయ్యాయి. ఉరకెత్తి చెట్లు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. కాపుకు వచ్చిన పత్తి తోటలు దారుణంగా దెబ్బతిన్నాయి. పగిలిన పత్తి కాయల్లోకి నీరు చేరటంతో కారిపోయింది. పొగతోటలు ఉరకెత్తి రంగు మారటంతో పాటు చెట్లు ఉరకెత్తిపోయాయి. పొతకమూరు, బొట్లపాలెం ప్రాంతంలో బోర్ల కింద సాగు చేసిన వరి పంట దశకు వచ్చింది. గాలి, వానకు వరి పంట పూర్తిగా నేలకొరిగింది. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



తూర్పువెంకటాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

కనిగిరిలో పొంగి పొర్లిన వాగులు

నిండుకుండలా చెరువులు
20 ఏళ్ల తర్వాత పొంగిన గొల్లపల్లి అలుగువాగు
తెగిన హాజిపురం చెరువు
నీటమునిగిన మినుము చేలు

కనిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో కనిగిరి ప్రాంతంలో విస్తృతంగా వర్షాలు కురిశాయి. 30సెం.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ నీటి మట్టం పెరిగి చెరువు అలుగువాగు పొంగి పొర్లింది. దీంతో కనిగిరి నుంచి సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే వాహన రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులో ఉన్న చేపలన్నీ బయటకు వెళ్లిపోయాయి. కనిగిరి పట్టణంలోని నాగులుచెరువులోని వరద నీటి ప్రవాహం కారణంగా గార్లపేట రోడ్డులోని గ్రానైట్ క్వారీల సమీపంలో వాగు పొంగి పొర్లింది. అదేవిధంగా గుడిపాడు - తాళ్ళూరు రోడ్డులో వాగు పొంగి పొర్లి వాహన రాకపోకలు స్తంభించాయి. కనిగిరి పెద్ద చెరువుకు, నాగులచెరువుకు 20ఏళ్ల తర్వాత భారీగా వరదనీరు చేరుకుంది.



గొల్లపల్లి వద్ద నీట మునిగిన కంది చేను

నష్టపోయిన రైతులు

నియోజకవర్గంలోని హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల్లో సాగులో ఉన్న 2వేల ఎకరాలకు పైగా సజ్జ పంట దెబ్బతినింది. అలాగే 2వేల ఎకరాల్లో సాగులో ఉన్న బొబ్బర పంటకు నష్టం వాటిల్లింది. హనుమంతుని పాడు మండలంలో హాజిపురం చెరువుకు గండి పడి సమీపంలో ఉన్న 150ఎకరాల్లో వేసిన మినుము పంట నీట మునిగింది. అదేవిధంగా పత్తి 500 ఎకరాలు, పొగాకు 300 ఎకరాల్లో నష్టం వాటిల్లింది.

ఎటు చూసినా నీరే

ముంచిన మొంథా
రహదారులపై ప్రవహిస్తున్న ముసి, గుండ్లకమ్మ
కూలిన ఐదు గృహాలు

దొనకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవటంతో జనజీవనం స్తంభించింది. ఎటు చూసినా నీరే కనిపిస్తోంది. జిల్లా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, మండల ప్రత్యేకాధికారి మదన్‌మోహన్ పర్యవేక్షణలో తహసీల్దార్ బి. రమాదేవి, ఎంపీడీవో వసంతకుమార్‌నాయక్, ఎస్ఐ త్యాగరాజు, ఎంఈవో సాంబశివరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, అన్నీ శాఖలకు చెందిన అధికా రులు స్థానికంగా అందుబాటులో ఉండి అన్నీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దొనకొండ నుంచి పొదిలి వెళ్లే ప్రధాన రహదారిలో తెల్లబాడు గ్రామం వద్ద ముసి వాగు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. కొచ్చెర్లకోట గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ చప్టాపైనుంచి పారుతుండటంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దొనకొండలో లోతట్టు ప్రాంతంలో నివసించే ఎస్టీలు 28 మందిని స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. మండలంలోని దొనకొండ - ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో రెండు, పుల్లాయిపల్లి గ్రామంలో రెండు, సంగాపురంలో ఒకటి రేకుల ఇళ్లు గాలులకు కూలిపడ్డాయి. అధికారులు వాటిని పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన రేషన్‌షాపు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో గోడకు రంధ్రంపడి వర్షపునీరు గదిలోకి చేరాయి. లోపలున్న పేదలకు పంపిణీ చేసే 44 బస్తాల రేషన్ బియ్యం, 197 చక్కెర ప్యాకెట్లు నీళ్లల్లో తడిసి పనికిరాకుండా పోయాయని రేషన్‌డీలర్ చెంచయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. వర్షాలకు మండలంలోని గ్రామాల్లో 2,500 హెక్టార్లల్లో సాగు చేసిన పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు వేశారు.



దొనకొండ-పొదిలి ప్రధాన రహదారిలోని తెల్లబాడు గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ముసి నది



ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో కూలిన రేకుల మిద్దె

పొంగిన వాగులు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్
ఉగ్రరూపం దాల్చిన దోర్నపువాగు
మునిగిన పంట పొలాలు

తాళ్లూరు,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం ఉదయం నుంచి బుధవారం వేకువ జాము వరకు తీవ్రంగా కురిసినవర్షంతో వాగులు ఉప్పొంగాయి. మండలంలో 197.0 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది. తుఫాన్ ప్రభావానికి దోర్నపువాగు ఉప్పొంగి ప్రవహించింది. పులిపాడు, లక్కవరం చెరువులు నిండి కట్టలకు ప్రమాదంగా ఉండటంతో అలుగుల కట్టలు తెంచి నీటిని దిగువకు వదిలారు. ఈ నీరు దోర్నపువాగులో చేరటంతో బుధవారం ఉగ్ర రూపం దాల్చింది. దీంతో పొలాలు నీటమునిగాయి. బెల్లంకొండవారిపాలెం, తోటవెంగన్నపాలెం లింగాలపాడు-మన్నేపల్లి, దారంవారిపాలెం, తాళ్లూరు,-రజానగరం,తాళ్లూరు-విఠలాపురం ,దోసకాయలపాడు -దర్శి, తాళ్లూరు-కుంకుపాడు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న ప్రత్యేకాధికారి ఎ.కుమార్, తహసీల్దార్ బి.వి.రమణారావు, ఎంపీడీవో అజితలు హుటాహుటిన ఆ గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మండలంలో 3 వేల వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా కండెకు వచ్చిన పంటలో అధికశాతం మొక్కలు నేల వాలాయి. తోటవెంగన్నపాలెం, కొర్రపాటివారిపాలెం గ్రామాల వద్ద వాగుల ఉధృతికి రోడ్లు, చప్టాలు దెబ్బతిన్నాయి.తాళ్లూరు,కొర్రపాటివారిపాలెం, శివరాంపురం, తదితర గ్రామాల్లో వరి పొలాలు నీటమునిగాయి.

వాగులు పొంగి ప్రమాదకర స్థాయిలో ఉండటంతో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు, వైఎస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ నాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డిలు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలను బుధవారం పరిశీలించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న దోర్నపువాగు

జల దిగ్బంధంలో ముండ్లమూరు

తెగి పోయిన చెరువులు, కుంటలు
దెబ్బతిన్న పలు రహదారులు
పంటలకు తీవ్ర నష్టం

ముండ్లమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుంచి ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని ముండ్లమూరు - వేంపాడు మధ్య ఉన్న చిలకలేరు వాగు పొంగి ప్రవహించటం వల్ల రాకపోకలు నిలిచి పోయాయి. అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పై పసుపుగల్లు సమీపంలోని రామానగర్ వద్ద వాగు, పెద ఉల్లగల్లు వద్ద ఉన్న వాగు, పులిపాడు వద్ద చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పైగా పారటం వల్ల రాకపోకలు ఆగావియి. మండలంలోని మారెళ్ల నుంచి జమ్మలమడక వెళ్ళే ఈదర వాగు, బొప్పూడివారిపాలెం నుంచి ఈదర మధ్య ఉన్న వాగు, పసుపుగల్లు నుంచి చింతలపూడి మధ్య చిలకలేరు వాగు, చింతలపూడి నుంచి వేముల బండ మధ్య చిలకలేరు వాగు, కమ్మవారిపాలెం నుంచి వేములవెళ్ళే వాగు, సింగనపాలెం నుంచి దర్శి రోడ్డు వెళ్ళే దోర్నపువాగు, ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే చిలకలేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.



ముండ్లమూరు - వేంపాడు మధ్య పొంగి ప్రవహిస్తున్న చిలకలేరు వాగు

నీట మునిగిన పంటలు

మండలంలోని వేముల, వేములబండ, పసుపుగల్లు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పొలాలు పూర్తిగా నీట మునిగి పోయాయి. పసుపుగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం, ఉల్లగల్లు, వేముల, కమ్మవారిపాలెం, చింతలపూడి, తమ్మలూరు, కెల్లంపల్లి, రెడ్డినగర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్క జొన్న, సజ్జ పూర్తిగా నేలకొరిగి పోయింది. ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, మారెళ్ళ, పసుపుగల్లు గ్రామాల్లో పూర్తిగా మిరప, కంది పైర్లు పూర్తిగా నేలకొరిగి పోయాయి. ఆయా గ్రామాల్లో పొగాకు, బొప్పాయి పంటల్లో వర్షపు నీరు నిలిచి పోయింది. పంటలు ఉరకేసే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని చింతలపూడి నుంచి ఉమామహేశ్వర అగ్రహారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి, పసుపుగల్లు సమీపంలోని ఎర్ర వాగు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి పలు చోట్ల తెగి పోయింది. ఈదర గ్రామంలోని ఒక వీధిలో పది ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. అలాగే వేములబండలో దుగ్గినేని లక్ష్మయ్య ఇంట్లోకి పూర్తిగా వర్షపు నీరు చేరటంతో రెండు వందల ధాన్యం బస్తాలు నీటిలోనే తేలాడాయి. మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం చెరువుకు పూర్తిగా వర్షపు నీరు చేరటంతో చెరువు నిండి నీరంతా పొలాల్లోకి చేరింది. అలాగే గుండ్లకమ్మకు వర్షపునీటి తాకిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మారెళ్ల గ్రామానికి వరద వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్‌సెంట్రల్‌వాటర్ కమిషన్ హెచ్చరించింది.



భారీ వర్షానికి తెగి పోయిన చింతలపూడి - ఉమామహేశ్వర అగ్రహారం రహదారి



సాగర్ కాలువలోకి చేరుతున్న పెద్దవరం చెరువు నీరు

ముంచెత్తిన వాన

● 209.2 మి.మీ భారీ వర్షపాతం నమోదు

కురిచేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కురిచేడును అతలాకుతలం చేసింది. మంగళవారం రాత్రి భారీ వర్షపాతం నమోదు అయింది. ఎడ తెరిపిలేకుండా కురిసిన వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఇతర మండలాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. అధికారుల ముందస్తు జాగ్రత్తలతో ప్రాణ నష్టం జరగలేదు కానీ రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. జనజీవనం స్తంభించింది. కురిచేడు వినుకొండ మధ్య వెంగాయపాలెం సమీపంలో వాగు, కురిచేడు - త్రిపురాంతకం మండలాల మధ్య గుండ్లకమ్మ నదికి భారీ వరద రావడంతో రాకపోకలు ఆగిపోయాయి. కల్లూరు గ్రామం వద్ద ఉన్న వాగుకు భారీ ఎత్తున నీరు రావడంతో ఆ గ్రామానికి ఇతర గ్రామాలతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ గ్రామ చెరువుకు అధికంగా నీరు రావడంతో అలుగు నుంచి పెద్ద మొత్తంలో నీరు విడుదల కావడంతో పొలాల్లోకి నీరు చేరి పంటలు మునిగిపోయాయి. ఆవులమంద కొత్తూరు గ్రామం చెరువుకు కొండల మీద నుంచి భారీ ఎత్తున వర్షపునీరు రావడంతో రెండు చెరువుల మధ్య ఉన్న రోడ్డు మునిగిపోయింది.పేరుంబొట్లపాలెం గ్రామంలో వెంకటరెడ్డి ట్రాక్టర్‌పై పెత్త చింతచెట్లు విరిగి పడింది. దీంతో ట్రాక్టర్ ధ్వంసం అయింది.



ఆవులమంద గ్రామం వద్ద పొంగిన వాగు

మునిగిన కాలనీలు

మొంథా తుఫాన్ ప్రభావంతో కురిచేడు మండలంలో భారీ వర్షం కురవడంతో కాలనీలు మునిగాయి. వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారి బాగోగులు చూస్తున్నారు. కురిచేడు ఎస్సెస్సీ కాలనీ వాసులను రెండు రోజులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంచి వారికి సదుపాయాలు కల్పించారు. పడమరవీరాయపాలెం పంచాయతీ పరిధిలోని యానాది కాలనీలోని వారి గృహాల్లో మోకాళ్ళ లోతు నీరు చేరింది. ఆ గ్రామ మాజీ సర్పంచ్ రావిపాటి శ్రీనివాసులు వారిని గ్రామంలోని ఉన్నత పాఠశాలకు తీసుకెళ్ళి వారికి భోజన సదుపాయం కల్పించారు.

సాగర్ కాలువలోకి వర్షపు నీరు

కురిచేడు : మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి పెద్దవరం చెరువు అలుగు ద్వారా నీరు సాగర్ దర్శి బ్రాంచి కాలువలోకి చేరుతున్నది. పెద్దవరం గ్రామం వద్ద సాగర్ కాలువ 80 అడుగుల లోతులో వెళుతోంది. దీంతో చెరువు అలుగుద్వారా వచ్చే నీరు కాలువ కట్ట మీదుగా కాలువలోకి వెళుతున్నది. ఈ క్రమంలో కాలువ కట్ట కోతకు గురయింది. కాలువ కింది భాగంలో గండిపడే ప్రమాదం ఏర్పడింది. వెంటనే స్పందించిన ఎస్సెస్పీ అధికారులు ఎక్స్‌కవేటర్ ద్వారా కాలువలోకి వచ్చే నీటిని దారి మళ్లించారు. దీంతో కాలువకు ముప్పు తప్పినట్లయింది.

గరిష్ఠస్థాయికి పాలేటిపల్లి రిజర్వాయర్‌లో నీరు

పొంగిపొర్లుతున్న పాలేరు నది
ముద్దపాడు-వాకంవారిపల్లి మధ్య నిలిచిన రాకపోకలు

పీసీపల్లి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావంతో పీసీపల్లి మండలంలో రెండురోజుల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు చెరువులు నిండి అలుగు పారుతున్నాయి.పాలేటిపల్లి సమీపంలో నిర్మించిన రిజర్వాయర్ ఎగువ నుంచి వచ్చిన వర్షపునీటితో నిండిపోయింది.నీటి మట్టం గరిష్ఠస్థాయికి చేరుకోవడంతో ఎగువ నుంచి వస్తున్న నీరు అలుగు ద్వారా వాగులోకి ప్రవహిస్తోంది. దీంతో వాకంవారిపల్లి-ముద్దపాడు మధ్య బ్రిడ్జిపై నుండి నీరు అధికంగా పారుతుండడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పాలేరు వాగు పొంగుతోంది. పెదయిర్లపాడు కొత్తచెరువు, అడవిలోపల్లి చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. మారెళ్ల, తలకొండపాడు, జంగాలపల్లి చెరువులకు భారీగా నీరు చేరింది.తలకొండపాడు చెరువు తూము వద్ద నీరు లీకవడాన్ని గుర్తించిన అధికారులు మట్టిని పోసి నీటి లీకేజిని నియంత్రించారు.



అలుగు పారుతున్న పాలేటిపల్లి రిజర్వాయర్

అలుగుపారుతున్న పామూరు పాత చెరువు

పామూరు : తుఫాన్ వలన కుండపోతగా కురిసిన వర్షాలకు పట్టణంలోని పామూరు పాత చెరువు ఉధృతంగా అలుగు పారుతున్నది. ఆ నీరంతా జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తుండంతో రోడ్డు కోతకు గురై ప్రమాదం ఉన్నందున పామూరు సీఐ ఎం. భీమానాయక్ ఆధ్వర్యంలో పామూరు పోలీసులు, సహాయక బృందాలు సిమెంట్ పైపలను పగులకొట్టి నీరు వెళ్లేలా చేశారు.

నేలవాలిన పండ్ల తోటలు

వెలిగండ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు, ఈదురుగాలులతో పండ్ల తోటలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని మరపగుంట్ల గ్రామానికి చెందిన రైతులు ముత్తిరెడ్డి శ్రీనివాసులు, రావూరి రమణయ్య, ముత్తిరెడ్డి నాగేశ్వరి, వెంకటరెడ్డిలు తమ పొలాల్లో బొప్పాయి 20 ఎకరాల్లో, పుచ్చ పంట 18 ఎకరాల్లో సాగు చేశారు కోతకు వచ్చిన సమయంలో బొప్పాయి గాలికి విరిగి కింద పడిపోయింది. పుచ్చ పంట పొలాల్లో నీరు నిలవడంతో కాయలు పాడైపోయాయని, రూ. 25 లక్షల వరకు నష్టపోయామన్నారు.

స్తంభించిన ట్రాఫిక్


కురిచేడు : కురిచేడు - వినుకొండ మధ్య వెంగాయపాలెం గ్రామం వద్ద ఉన్న వాగు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. వాగుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నానికి కూడా వాగులో నీటి ప్రవాహం తగ్గకపోవడంతో పోలీసులు పహారా కాస్తూ ఎవరిని వాగులోకి వెళ్లకుండా ఆపారు. రెండు వైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ ఆగిపోయింది.




కొల్లూరు : గాలులకు పడిపోయిన వరిని చూపుతున్నరైతు


నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే వేగేశన


● సూర్యలంకరోడ్డులో కుందేరువాగు చప్టాపై పొంగి పొర్లుతున్న వర్షపు నీరు


బాపట్ల : కొల్లూరు-వేమూరు మధ్య పొలాల్లో నేల వాలిన వరి

మొంథా బీభత్సం


● కొల్లూరు : గాలులకు కూలిన అరటి తోట


కొల్లూరు : ఉరకెత్తిన పసుపు


నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచిక


రావి అనంతవరంలో వేణుగోపాల స్వామి దేవాలయంలో గాలులకు కూలిన ధ్వజ స్థంభం

ముంచేసింది

- వరి, మినుము, పత్తిపై తీవ్ర ప్రభావం
- అంధకారంలో తీరం.. భయంగుప్పెట్లో ప్రజలు

(బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి, మార్టూరు, బల్లికురవ, ఆంధ్రజ్యోతి)

వాతావరణ శాఖ అంచనాలకు మించి తుఫాన్ జిల్లాపై తీవ్రప్రభావం చూపింది. బీకరమైన ఈదురుగాలులకు భారీ వర్షం కూడా తోడయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు దాదాపు పది గంటల పాటు కురిసిన వర్షం రైతులను ముంచేసింది. దిగుబడుల వేళ తుఫాన్ విరుచుకుపడి పొలాలను కబళించేసింది. తీరప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన భారీవర్షంతో చెట్లు, విద్యుత్‌స్థంభాలు తెగిపడి కూలాయి. దీంతో పలు ప్రాంతాల్లో అంధకారంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ తెల్లవారేంతవరకు తీరప్రాంత ప్రజలు కునుకులేకుండా గడిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి 9 గంటల నుంచి నిలిపివేసిన కరెంటును బుధవారం ఉదయానికి పునరుద్ధరించారు. జిల్లాలో 81 కరెంటు స్థంభాలు నేల కొరగగా వీటిలో 70 పోల్స్‌ను బుధవారం ఉదయానికే పునరుద్ధరించారు. జిల్లాలో 119 చెట్లు నేలకొరగా వాటిని అధికారులు తొలగించారు. పర్చూరును వరద నీరు ముంచెత్తడంతో స్పందించిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అక్కడకు చేరుకుని జాతీయ రహదారిపై ఉప్పుటూరు సమీపంలో రోడ్డును పగలకొట్టి నీటిని దిగువకు మళ్లించడంతో ముప్పు తప్పింది. వాడరేవు - రామాపురం మార్గమధ్యలో వంతెనలు కూలిపోగా ఎస్పీ ఉమామహేశ్వర్ బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేయించారు. భారీ వర్షాల ప్రభావం బల్లికురవ ప్రాంతంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలపై తీవ్రంగా పడింది. క్వారీల్లో వర్షపు నీరు చేరింది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారమే 82,500 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తేలింది. వరి 66,033 ఎకరాలు, మినుము 4,564 మొక్కజొన్న 2,472, పత్తి 2,190 ఎకరాలుగా తేలింది. మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో తుఫాన్ దెబ్బకు బొప్పాయి తోటలు నేలకూలాయి. జిల్లావ్యాప్తంగా 203 పునరావాస కేంద్రాల్లో 10,084 మంది ఆశ్రయం పొందుతున్నారు.

పొంగిన సముద్రం.. 300 ఎకరాలు మునక

తుఫాన్ ప్రభావంతో సముద్రపు నీరు పొంగింది. దీంతో రేపల్లె మండలం లంకేవానిదిబ్బ గ్రామంలో 300 ఎకరాలు మునిగిపోయి. ఉప్పునీటితో పంటంత పోయినట్లేనని రైతులు వాపోయారు.

మొంథా ముంచేసింది. వాతావరణశాఖ హెచ్చరించినట్లుగానే బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి గాలుల తీవ్రత పెరుగుతూ వచ్చినా, రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వీచిన పెనుగాలులు, వర్షం బీభత్సాన్ని సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో కుండ పోత వర్షం కురిసింది. ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. భారీగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా రహదారులపై ప్రవహించాయి. పొలాలు చెరువులను తలపించాయి. చేతికి అందివచ్చిన పంటలు చాలావరకు ముంపునకు గురయ్యాయి. మంగళవారమే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించగా బుధవారం వారంతా అక్కడే ఆశ్రయం పొందారు. ఇక మునిగిన పొలాలను, పునరావాస కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. బుధవారం వర్షంలోనే ఎక్కడికక్కడ నేలకూలిన చెట్లను తొలగించి రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. దీంతో పాటు విద్యుత్ స్తంభాలను నిలబెట్టి కరెంట్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు.


కొల్లూరు వద్ద వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు

రైతుల వెన్ను విరిచిన తుఫాన్

- పలు ప్రాంతాల్లో అత్యంత భారీగా వర్షం
- రహదారులపై ఉధృతంగా ప్రవహించిన వాగులు
- గాలులకు పడిపోయిన వృక్షాలు, కరెంటు స్తంభాలు
- వర్షంలోనూ సహాయక చర్యల్లో అధికార యత్రాంగం
- పునరావాస కేంద్రాల్లో వందలాది కుటుంబాలకు ఆశ్రయం
- నిజాంపట్నం హార్బర్‌లో కొనసాగుతున్న 3వ ప్రమాద హెచ్చరిక

నరసరావుపేట, గుంటూరు సిటీ, బాపట్ల, తెనాలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలపై విరుచుకుపడింది. మంగళవారం రాత్రి పెనుగాలులతో బీభత్సం సృష్టించిగా.. బుధవారం భారీ నుంచి అతిభారీగా వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతవాసులు రాత్రంతా చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. మూడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలుల ధాటికి ఖరీఫ్ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. చేలన్నీ చాపలా నేలపై పరుచుకుపోతే, అటు లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు తీరని నష్టం ఏర్పడింది. గెలలుచేతికొచ్చే తరుణంలో అరటి చెట్లు విరిగిపడటంతో రైతు వెన్ను విరిగింది. తమల పాకు, బొప్పాయి, కూరగాయల తోటల రైతులకూ భారీ నష్టం ఏర్పడింది. కంకులు వచ్చి, పచ్చని రంగులో వరి కళకళలాడుతుంటే తుఫాన్ వరి రైతు ఆశలపై నీళ్లు చల్లింది. పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ కింద వరి సాగవుతుంటే బాపట్ల జిల్లాలో 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,84,190 ఎకరాలు సాగులో ఉంది. అయితే బాపట్ల జిల్లాలో 40 శాతం, గుంటూరు జిల్లాలో 20 శాతానికిపైగా పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షానికంటే గాలులకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. చాపలా పరచుకున్న చేలు ఎక్కడ చూసినా పడమర నుంచి తూర్పుకు వాలిపోయి కనిపించాయి. మరి కొన్ని చేలల్లో సుడిగాలులు వీచినట్లు వరి చిందరబందరగా పడిపోయింది. గింజ కూడా దక్కకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లకు, (మిగతా 6వ పేజీలో)


రేపల్లె : లంకెవానిదిబ్బ గ్రామంలో ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్థంభాలు


కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఉప్పుటూరు వద్ద హైవేను పగల కొట్టి దిగువకు వరద నీటి మళ్లింపు


వేమూరు : జంపని వద్ద నేలకొరిగిన వరి

ఫోన్ కాల్స్‌తో ఆరా..

హలో.. మేము ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉందికదా! మీరు సురక్షితంగా ఉన్నారా? మీ ప్రాంతం లో పునరావాస కేంద్రాలలో సక్రమంగా సేవలందుతున్నాయా? అధికారులు అంతా అందుబాటులో ఉన్నారా? మీకు ఏదైనా ఇబ్బంది అని సహాయం కోరితే వెంటనే స్పందిస్తున్నారా? అంటూ ఫోన్ కాల్స్‌తో బాధితులను ఆరాతీశారు. మరోపక్క పోలీస్ సిబ్బంది కూడా 100 నంబరు నుంచి ఐవీఆర్‌ఎస్ ద్వారా ఫోన్ కాల్స్‌తో బాధితుల రక్షణపై ప్రశ్నించారు.


సముద్రం పొంగటంతో లంకెవానిదిబ్బలో నీటమునిగిన వరి పొలాలు

ఇద్దరు వృద్ధులు మృతి..

పలువురిని కాపాడిని యంత్రాంగం

తుఫాన్ సృష్టించిన విలయంలో జిల్లాలో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. చలిగాలులు తాళలేక అద్దంకిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన వనపర్తి హనుమంతరావు(80), రేక్‌నార్ లక్ష్మి(55) మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. గుండ్లకమ్మ వరదలో అద్దంకిలోని పంపింగ్ స్కీమ్ వద్ద విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బంది చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు వెళ్లిన ముగ్గురు జాలర్లు మున్సిపల్ సిబ్బందిని పడవపై ఎక్కించుకుని వస్తుండగా బోల్తా పడటంతో ఆరుగురు వరదలో చిక్కుపోగా అప్రమత్తమైన అధికారులు వారిని రక్షించారు. ఇంకొల్లు మండలం కొణికిపల్లెకు చెందిన టి.కీర్తి పురిటి నొప్పులతో బాధపడుతుండగా వరద నీటిలో 108 అక్కడకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఎస్ఐ సురేష్ తన వాహ నంలో ఆమెను ఇంకొల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆదుకుంటాం.. అధైర్యపడొద్దు

ముంపు ప్రాంతాల పర్యనటలో మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవి

బాపట్లరూరల్, కొల్లూరు, వేమూరు, చీరాల : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుధవారం చీరాల, బాపట్ల, కొల్లూరు, వేమూరు, మండలాల్లో మంత్రులు పర్యటించారు. అడవిపల్లెపాలెం గ్రామంలో మత్స్యకార కుటుంబాలకు గృహాలను మంజూరు చేస్తామ న్నారు. జంపని, కొల్లూరులోని పునరావాస కేంద్రాల్లోని బాధితులను పరామర్శించారు. చీరాల - పర్చూరు మార్గంలోని రొంపేరు కుడి కాల్వను మంత్రి పార్థసారధి కలెక్టర్ డా.వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీ లిం చారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రతీ రైతుకు నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పంట నష్టాలను అంచనాలకి అధికార బృందాలను పంపిస్తామన్నారు. 36 గంటల ముందు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ ద్వారా పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేసినందునే ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. మంత్రుల వెంట ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, నక్కా ఆనందబాబు, కొండయ్యలతో పాటు స్థానిక నేతలు, అధికారులు ఉన్నారు.


బాపట్ల : పాండురంగాపురంలో మిరప కాయలను రోడ్డుపై అరబోసిన రైతు


పేరలిపాడులో పాక పడిపోవడంతో మృతి చెందిన పశువులు


మార్టూరు : కోలలపూడిలో నేలకొరిగిన బొప్పాయి తోట


చీరాల : అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్


చీరాల రామాపురం మార్గంలో కూలిన వంతెన


వాడరేవులో పర్యటిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే కొండయ్య


రామాపురం రిసార్ట్స్ సమీపంలో కూలిన రెండో వంతెన

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం


జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతిబసు

- ప్రకటించిన వైసీపీ జడ్పీటీసీలు
- ఎంపీపీలను దించుతున్నందుకు ప్రతీకారం
- కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


అవిశ్వాసం పెడతామని ప్రకటిస్తున్న వైసీపీ జడ్పీటీసీలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

'మేము జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం పెట్టబోతున్నాం. అలా అని మాకు చైర్‌పర్సన్‌తో గొడవలు లేవు. ముప్పాళ్ల, మాచర్ల ఇతర మండలాల్లో వాళ్లకి (కూటమి) ఒక్క సీటు కూడా లేకుండానే పదవిలో ఉన్న వారిని దించేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. కిడ్నాప్‌లు చేస్తున్నారు.. కేసులు పెడుతున్నారు.. ఏమి చేయాలో అన్నీ చేస్తున్నారు. అందుకని మేము కూడా జడ్పీ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని అనుకుంటున్నాం. ఎప్పుడూ.. ఎలా అనేది మరలా చెబుతాం.' అని వైసీపీకి చెందిన రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడిన అనంతరం వైసీపీ (మిగతా 6వ పేజీలో)

పలు రైళ్ల పాక్షిక రద్దు

- డోర్నకల్‌లో రైలు పట్టాల పైకి వరద నీరు
- కొన్ని రైళ్లు గుంటూరు - పగిడిపల్లి మార్గంలో మళ్లింపు



బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపా ను ప్రభావంతో కురిసిన భారీ వర్షం కారణంగా వరంగల్ సమీ పంలోని డోర్నకల్ రైల్వేస్టేషన్ యార్డులోకి భారీగా వరద నీరు చేరి నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో గుంటూరుకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. బుధవారం ఉదయం 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ సమీపానికి వెళ్లేసరికి రైలు పట్టాలపై వరద నీరు చేరడంతో అక్కడే నిలిపేశారు. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ సర్వీసును రద్దు చేశారు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని కూడా వరంగల్ వరకే నడిపి వరంగల్ - గుంటూరు మధ్యన రద్దు చేశారు. దీని వల్ల మధ్యాహ్నం గుంటూరు నుంచి బయలుదేరాల్సిన 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని పూర్తిగా రద్దు చేయాల్సి వచ్చింది. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి - నడికుడి మీదగా గుంటూరుకు దారి మళ్లించారు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ని విజయవాడ నుంచి కృష్ణాకెనాల్, గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 17205 షిర్డి సాయినగర్ - కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్, 11019 ముంబై సీఎస్‌టీ - భువనేశ్వర్, 18046 చర్లపల్లి - షాలిమార్, 17206 కాకినాడ పోర్టు - షిర్డి సాయినగర్, 17405 తిరుపతి - అదిలాబాద్, ఎక్స్‌ప్రెస్‌లను కూడా గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్ రద్దు

12747 గుంటూరు - వికారబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ రోజులానే వికారబాద్‌కు వెళ్లింది. ఇదే రేక్ నంబరు 12748గా మారి వికారబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌గా రిటర్న్ రావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. దీంతో గురువారం ఉదయం గుంటూరు నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. వికారబాద్ నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్ సర్వీసుని గురువారం పునరుద్ధరిస్తామన్నారు.

అల్లకల్లోలం!


గుండ్లకమ్మ నదిలో చెట్లపై కూర్చొని బిక్కుబిక్కుమంటున్న మున్సిపల్ కార్మికులు

మొంథా తుఫాన్‌తో పొంగిన వాగులు, వంకలు.. నిండిన చెరువులు
పలు గ్రామాలలో పంటలకు తీవ్ర నష్టం
చాలా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
అష్టదిగ్బంధంలో పర్చూరు
నీట మునిగిన కాలనీలు
అద్దంకిలో వరదలో చిక్కుకున్న వారిని రక్షించిన అధికారులు
చీరాలలో కూలిన వంతెన
కొణిదెనలో పడిపోయిన చెన్నకేశవస్వామి దేవాలయ గోపురం
పునరావాస కేంద్రాలలో ఉన్న వారికి వసతులు కల్పించిన అధికారులు

బల్లికురవ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను తీరం దాటే సమయంలో ప్రజలను అల్లకల్లోలం చేసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు వర్షం దంచి కొట్టింది. చెరువులు నిండటంతో అలుగుల ద్వారా నీరు ప్రవహించటంతో పలు రోడ్లలో రాకపోకలు నిలిచిపోయాయి. అంబడిపూడి వద్ద గుంటుపల్లి వద్ద చెరువు అలుగు పారింది. నక్కబొక్కలపాడు వద్ద చప్టాపై నీరు రావటంతో రాకపోకలను నిలిపి వేశారు. చెన్నుపల్లి-కొండాయపాలెం మధ్య ఉన్న చప్టాపై వర్షపు నీరు రావటంతో పంట పొలాలు చెరువులను తలపించాయి. కొప్పెరపాడు ఎస్సీ కాలనీలోకి నీరు చేరింది. అధికారులు పంట నష్టం అంచనాలను తయారు చేసే పనిలో ఉన్నారు. కొణిదెనలో చెన్నకేశవస్వామిఆలయ గోపురం కూలిపోయింది. గ్రానైట్ క్వారీల్లో పనులు నిలిచిపోయాయి.

అధికారులు గ్రామాలలో పహారా

తహసీల్దార్, రవినాయక్, ఎంపీడీవో కుసుమ కుమారి, సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు పలు శాఖల అధికారులు తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గంట గంటకు గ్రామాలలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు.

● ఆగమేఘాల మీద స్పందించి విద్యుత్‌శాఖ

బల్లికురవకు వచ్చే విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలు పడిపోయాయి. బుధవారం వేకువ నుంచి సరఫరా నిలిచిపోయింది. మాగాణి భూమిలో రెండు స్తంభాలు పడిపోవటంతో యంత్రాలు వెళ్లే వీలు లేక 30 మంది కూలీలను రంగంలోకి దించి వాటిని పైకి లేపి సరఫరాను పునరుద్ధరించారు. గంటల వ్యవధిలోనే విద్యుత్‌ను ప్రజలకు ఇబ్బంది లేకుండా అందించారు.

గుండ్లకమ్మ నదిలో ఉత్కంఠ.. ఆపై ఊరట..

చిక్కుకున్న అద్దంకి మునిసిపల్ సిబ్బంది
కాపాడేందుకు వెళ్లిన మరో ముగ్గురు మత్స్యకారుల పడవ బోల్తా
చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్న వైనం
అందర్నీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చేవరకు కష్టించిన అధికారుల బృందం
యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో గుండ్లకమ్మనదిలో చిక్కుకున్న ఆరుగురు క్షేమంగా ఒడ్డుకు చేరటంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అద్దంకి పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా చేసే గుండ్లకమ్మ నదిలో ఉన్న ఊటబావుల వద్ద విధులు నిర్వహించే ముగ్గురు మున్సిపల్ సిబ్బంది రుద్రు నరేంద్ర, బాబురావు, శివలు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో నదిలోని వరద నీటిలో చిక్కుకున్నారు. నీటి ప్రవాహం ఒక్కసారి పెరిగి పంప్ హౌస్ గది చుట్టూ చేరాయి. అక్కడ నుండి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఏఈ లోకేష్‌లు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. తొలుత చిన్న పడవను మున్సిపల్ కార్మికులను కాపాడేందుకు పంపించారు. ఆ పడవలో వచ్చేందుకు వారు సాహసం చేయలేదు. మరో పెద్ద పడవలో ముగ్గురు జాలర్లను పంపారు. మున్సిపల్ కార్మికులు ముగ్గురిని ఆ పడవలో ఎక్కించుకొని తిరిగి వస్తుండగా ఒక్కసారిగా పడవ నీటి ఉధృతికి బోల్తా పడింది. దీంతో ముగ్గురు మున్సిపల్ కార్మికులు పక్కనే ఉన్న చెట్టును పట్టుకొని పైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. కాపాడేందుకు వెళ్లిన ముగ్గురు మత్స్యకారులు కూడా పడవను అక్కడే చెట్టుకు కట్టి దానిపై కూర్చుకున్నారు. సీఐ సుబ్బరాజు ఎప్పటికప్పుడు డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తూ పడవ బోల్తా పడ్డ విషయం పసిగట్టారు. వారిని అక్కడే సురక్షితంగా ఉండాలని చెప్పి మరో మత్స్యకారుడు కుమార్‌ను చిన్న పడవలో పంపారు. దాని ద్వారా ఒక్కొక్కరిని క్షేమంగా బయటకు చేర్చారు. ఈ విషయం తెలిసిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్థానిక అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమాచారం తెలుసుకున్నారు. స్పెషల్ ఆఫీసర్, ప్రకాశం డిప్యూటి సీఈవో బాలమ్మ, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సీఐ సుబ్బరాజు, అగ్నిమాపక అధికారి వెంకటరావులు సుమారు 5 గంటల పాటు అక్కడే ఉండి పర్యవేక్షించారు. అందరు సురక్షింతంగా బయటకు చేరటంతో ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే చీరాల డీఎస్పీ మొయిన్ అద్దంకి చేరుకున్నారు. అప్పటికే ఊటబావుల వద్దకు వెళ్లే రోడ్డు గుండ్లకమ్మ వరద నీటితో నిండిపోవటంతో ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. అందరూ సురక్షితంగా బయటకు వచ్చారని తెలిసిన వెంటనే అధికారులను, కష్టపడి ఒడ్డుకు చేర్చిన మత్స్యకారుడు కుమార్‌ను కలెక్టర్ అభినందించి రివార్డు ప్రకటించారు. అధికారులతో పాటు టీడీపీ నేతలు కాకాని అశోక్, రామాంజనేయులు, గొట్టిముక్కల హరిష్, లహరి, కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజులు అక్కడే ఉండి తమ వంతు సహకారం అందించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వినయ్ పరిశీలించారు. వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ మున్సిపల్ సిబ్బందితో మాట్లాడారు.


మున్సిపల్ సిబ్బంది, మత్స్యకారులను సురక్షితంగా బయటకు చేర్చిన కుమార్‌ను అభినందిస్తున్న డీఎస్పీ

● లైలా తుఫాన్ అనుభవం ఆందోళన కలిగింది
మొయిన్, చీరాల డీఎస్పీ

లైలా తుపాన్ సమయంలో అద్దంకిలో ఎస్సైగా విధులు నిర్వహించే సమయంలో నా కళ్లఎదుటే నల్లవాగులో కానిస్టేబుల్ రఫీ కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన గుర్తుకు వచ్చింది. ప్రస్తుతం ఆరుగురు చిక్కుకున్నారని తెలిసి ఆందోళన కలగించింది. అందరూ కష్టపడి పనిచేయటంతో వారు సురక్షితంగా బయటకు రావడం ఆనందంగా ఉంది.

అద్దంకిలో 18.5 సెంటీమీటర్ల వర్షపాతం

అద్దంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో బుధవారం ఉదయానికి 18.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుండ్లకమ్మ నదితో పాటు పలు వాగులు పొంగి ప్రవహించాయి. భవనాసి అలుగు వరకు గుండ్లకమ్మ నది నీరు చేరింది. అద్దంకి సమీపంలో నల్లవాగు ఉధృతంగా ప్రవహించటంతో రేణింగవరం, నాగులపాడు, చెరువుకొమ్ముపాలేల రోడ్లలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పేరాయపాలెం వద్ద దోర్నపు వాగు, కుంకుపాడు, మోదేపల్లి వద్ద చిలకలేరు, చినకొత్తపల్లి, గోవాడ వద్ద భవనాసి వాగు పొంగి ప్రవహించింది. ఉప్పలపాడు-మైలవరం వద్ద వాగు నీరు రోడ్డు పైకి ప్రవహించింది. ముండ్లమూరు మండలం వేంపాడు వద్ద చిలకలేరుపై రాకపోకలు నిలిచిపోయాయి. అద్దంకి డిపో నుంచి ఒంగోలు, నర్సరావుపేట, విజయవాడ రూట్లలో మినహా మిగిలిన రూట్లలో 50 బస్ సర్వీసులు రద్దు చేశారు. తహసీల్దార్ శ్రీచరణ్, సీఐ సుబ్బరాజులు వాగుల వద్దకు వెళ్లి సిబ్బందికి జాగ్రత్తలు చెప్పారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు.

● పలు పంటలకు తీవ్ర నష్టం

భారీ వర్షాలతో పలు రకాల పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పొగాకు మొక్కలు పూర్తిగా నీట మునిగాయి. వరికి కొంత మేర నష్టం వాటిల్లింది. పొలాలలో నీరు బయటకు పంపించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

● మున్సిపల్ సిబ్బంది, మత్స్యకారుడికి మంత్రి గొట్టిపాటి అభినందనలు

మత్స్యకారులు తమ ప్రాణాలకు తెగించి గుండ్లకమ్మ వరదలో చిక్కుకున్న మున్సిపల్ సిబ్బందిని కాపాడిన మత్స్యకారుల తీరు అభినందనీయం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రాత్రి పలు శాఖల అధికారులతో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టంపై సమీక్షించారు. పంట నష్టం నమోదును జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మినీ బైపాస్ రోడ్డు నిర్మాణంపై అధికారులతో మాట్లాడారు. ఎన్‌టీఆర్ నగర్‌లో మృతి చెందిన హనుమంతరావు, లక్ష్మిల కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. వరద సమయంలో అధికారులు, సిబ్బంది బాగా పనిచేశారని కొనియాడారు.

● ప్రార్థనా మందిరం నుంచి 25మందిని రక్షించిన పోలీసులు

పర్చూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షంతో పర్చూరు వాగు సమీపంలోని హోసన్న ప్రార్థనా మందిరాన్ని వరద నీరు ముంచెత్తింది. అందులో 25మందికిపైగా ప్రజలు ఉన్నట్లు బుధవారం ఉదయాన్నే సమాచారం అందుకున్న ఎస్ఐ జి.వి.చౌదరి, ట్రైనీ ఎస్ఐ పులి గోపి హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో ప్రద్యుమ్న నేతృత్వంలో స్థానిక యువకుల సహకారంతో రోప్‌వేను ఏర్పాటు చేసి మందిరంలో ఉన్న యువకులను సురక్షితంగా బయటకు తరలించారు.

చీరాలలో కూలిన వంతెనలు

వాడరేవు - రామాపురం మార్గంలో కూలిన మూడు బ్రిడ్జిలు
రెండు రోజులుగా నిలిచిన విద్యుత్ సేవలు
ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి సుడిగాలి పర్యటనలు చేసిన మంత్రులు

చీరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా మొంథా తుఫాన్ కారణంగా నియోజకవర్గం అల్లకల్లోలంగా మారింది. రామాపురం-వాడరేవు రాకపోకలు సైతం బంద్ అయ్యాయి. వాడరేవు గ్రామంలోకి చేరిన వరద నీరు భారీగా పారుతూ సముద్రంలో కలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 167 ఏ జాతీయ రహదారి జీరో పాయింట్ వద్ద అర్ధరాత్రి చప్టా తెగింది. అక్కడ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే వాడరేవు-రామాపురం మార్గం మధ్యలో శిథిల దశకు చేరిన వంతెన కుప్పకూలింది. రిసార్ట్ సమీపంలో మరో వంతెన కూడా అనుకోని రీతిలో కూలిపోవడంతో సమాచారం అందుకున్న ఎస్పీ ఉమామహేశ్వర్ హుటాహుటీన సంఘటన స్థలాలను పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు చేసిన రెండు గ్రామాలకు సంబంధించిన రాకపోకలు నిలిపివేశారు. తుఫాన్ ప్రారంభం నుంచి అన్ని శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్విరామంగా శ్రమించారు. మరోవైపు మగ్గాల్లో సైతం నీళ్లు నిలిచి కార్మికులు అల్లాడారు.

● మంత్రుల పర్యటన

ఇదిలా ఉంటే అర్ధరాత్రి నుండే ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ మున్సిపల్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వంగలపూడి అనితలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రక్షణ చర్యలపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉదయం నుండే ముంపు గ్రామాలు, పునరావాస కేంద్రాలు పరిశీలించారు. అలాగే మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్‌లతో కలిసి వాడరేవు, పాపాయిపాలేల్లో పర్యటించారు. ప్రజలకు మంత్రులు భరోసా కల్పించారు. అలాగే పంట, ఆస్థి నష్టంపై అంచనా వేసి సహకారం అందిస్తామని చెప్పారు.


మగ్గంలో నీళ్లు ఎత్తి పోసుకుంటున్న చేనేత కార్మికురాలు

● రొంపేరు కుడి కాలువను పరిశీలించిన మంత్రి

రొంపేరు కుడి కాలువలో పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని మంత్రి పార్థసారథి చెప్పారు. తుఫాన్ ప్రభావంతో చీరాల - పర్చూరు మార్గంలోని రొంపేరు కుడి కాలువలో పెద్ద ఎత్తున చెత్త చేరింది. దీంతో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి కాలువను మంత్రి పరిశీలించారు. మేజర్ కుడి కాలువలో చేరిన చెత్తను సిబ్బంది ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు.

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు

● ఎక్కువ నష్టపోయిన కూరగాయలు, మినుము, మొక్కజొన్న రైతులు

మేదరమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మొక్కజొన్న, మినుము, పత్తి, మిరప, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పి.గుడిపాడు గ్రామంలో మొక్కజొన్న నేల వాలి, కండెలు నాని మొలకలు వస్తున్నాయి. మినుము కూడా నీటిలో ఉండడంతో మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. గుమ్మడి తోట నీటిలో ఉండడంతో ఆకులన్నీ ఎర్రబడి ఎండుముఖం పట్టాయి. మిరప, గోరుచిక్కుడు, బెండ పందిరి తోటల్లో కూడా నీరు నిలిచ్చాయి. ఇక కాకర, పొట్ల, సొర పందిళ్ల పడిపోయాయి. రెండేళ్లుగా పందిరి తోటలు పెంచిన రైతులకు.. పైరు నేలవాలడంతో నష్టానికి అంతులేకుండా పోయింది. మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ.50 వేలు ఖర్చు కాగా పంట చేతికి వచ్చే సమయంలో నేలవాలడంతో ఎకరానికి సుమారు రూ.80 వేలు పైగా నష్టం వాటిల్లింది. అధికారులు దెబ్బతిన్న పంటపొలాలను, కూరగాయల తోటలను బుధవారం మధ్యాహ్నం నుంచి పరిశీలిస్తున్నారు.

● ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుంది
మంత్రి రవికుమార్

పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి రవికుమార్ హామీ ఇచ్చారు. బుధవారంరాత్రి పి.గుడిపాడు వచ్చి రైతులను పరామర్శించారు. టార్చిలైట్ల వెలుతురులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా రైతులకు పరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూరగాయల రైతులు తమకు జరిగిన నష్టాన్ని మంత్రికి వివరించగా, అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని నమ్మకం కలిగించారు.


పీ గుడిపాడులో రాత్రిపూట టార్చి వెలుతురులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి రవి


అద్దంకిలో సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి


పాతమాగులూరు ఎస్సీ కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో నీటిని తొలగిస్తున్న సర్పంచ్, అధికారులు


బల్లికురవలో విద్యుత్ స్తంభాలను బిగిస్తున్న సిబ్బంది


బల్లికురవ-మార్టూరు రోడ్డులో వరదకు నిలిచిన రాకపోకలు


తిమ్మాయిపాలెం వద్ద ఉధృతంగా గుండ్లకమ్మ


పంగులూరులో కుప్పకూలిన పెంకుటిల్లు

ఆలయాలు, నివాసాలలో చేరిన వరద నీరు

పంగులూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇంకొల్లు-పంగులూరు ప్రధాన రహదారిలో అరికట్లవారిపాలెం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది. పంగులూరు, తూర్పుతక్కెళ్లపాడు, జనకవరం, పంగులూరు, కోటపాడు, చందలూరు గ్రామాలలో వాగులు ఉప్పొంగాయి. వరద ఉధృతికి చందలూరు, ఎ.వి.పాలెం, తక్కెళ్లపాడు, కోటపాడు పరిసర గ్రామాలలో వరద ఉధృతి పంట చేలను ముంచేసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి బుధవారం తెల్లజాము వరకు సుమారు 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంట పొలాలు నీటమునిగాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముప్పవరంలోని శివాలయం, పోలేరమ్మగుడి చెరువును తలపించింది. సుమారు 50ఎకరాలలో సాగవుతున్న బెండ, వంగ, దోస తోటలు పూర్తిగా దెబ్బతినగా వరిచేలతో పాటు కొన్నిచోట్ల మిరప, మొక్కజొన్న నీట మునిగాయి. 300 ఎకరాలలో పూత, కాయదశలో ఉన్న పత్తి, వందల ఎకరాల్లో ఉన్న మిరప పంటలకు నష్టం వాటిల్లుతుందని అధికారులు అంచనావేస్తున్నారు.


పంగులూరు-తూర్పుతక్కెళ్లపాడు మధ్య పొంగిప్రవహిస్తున్న ఇసుకవాగు

● సకాలంలో స్పందించిన అధికారులు

సంతమాగులూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతమాగులూరు ఎస్సీ కాలనీని వరద ముంచెత్తింది. స్పందించిన గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు, తహసీల్దార్ కే రవిబాబు దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తహసీల్దార్ దగ్గర ఉండి కాలనీలోని ఏసుక్రీస్తు మందిరం నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న చెరువు కాలువ వరకు గాడి తీయించి నిల్వ ఉన్న వరద నీటిని పంట కాలువలో కలిపారు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు అన్ని వసతులు కల్పించామని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాధిక, గ్రామ కార్యదర్శి షేక్ జానీబాషా పాల్గొన్నారు.

● చినగంజాంలో...

చినగంజాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా వరి పొలాలు, ఆక్వా చెరువులు, ఉప్పుకొఠారులు నీట మునిగాయి. మండలంలోని గొనసపూడి గ్రామానికి సమీపంలోని డ్రైనేజీ వాగు, కొమ్మమూరు కాలువ, అప్పేరు వాగు పొంగడంతో గ్రామానికి చుట్టుపక్కల వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. నాగన్న వాగు రావడంతో నీలాయపాలేనికి, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట సమీపంలోని వాగు, ఎన్టీఆర్ వారధి సమీపంలోని మద్రాసు కాలువకు వరద రావడంతో పెదగంజాం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సంతరావూరు-కారంచేడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులోని చేపలన్నీ వరదనీటికి కొట్టుపోవడంతో నష్టం వాటిల్లినట్లు ఉప్పుతల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గొనసపూడి, కడవకుదురు ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలను, వరద నీటిని, ఇంకొల్లు, కడవకుదురు ఆర్‌అండ్‌బీ రహదారిపై నిలిచిన వరదనీటిని జిల్లా ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రెడ్డి, చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. 12 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫారం పడిపోయినట్లు ఏఈ ఎల్.బ్రహ్మం తెలిపారు. చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రంలో ఉన్న గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ, డీఐవో డాక్టర్ రత్నమన్మోహన్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, వైద్యాధికారులు పి.సాయిశ్రీచరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రేణంగివరంలో నేలవాలిన మొక్కజొన్న

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న కారణంగా ప్రతీకారం తీర్చుకునేందుకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించ బోతున్నట్లు వెల్లడించారు. తమకు 42 మంది సభ్యుల మద్దతు ఉందని ప్రకటించారు. పదవీకాలం కేవలం 11 నెలలు మాత్రమే ఉందని, అంత తక్కువ సమయంలో పదవి మారినా..తాము ఏమీ చేయలేమన్న సంగతి కూడా తెలుసు నని వారు పేర్కొనడం గమనార్హం.

అంతా బాగుంటే కలెక్టర్‌ను కలవాలని

మొంథా తుపాను కారణంగా వైసీపీ జడ్పీటీసీల వ్యూహం దెబ్బ తిన్నట్లు తెలుస్తోంది. వాతావరణం బాగుంటే.. సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత వైసీపీ జడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన లేఖను అందజేయాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని కొద్దిరోజుల క్రితమే కొందరు లీక్ చేశారు. తుపాను ఆటంకంతో వైసీపీ జడ్పీటీసీల ప్రణాళిక పారలేదు. జడ్పీలో 54 మంది జడ్పీటీసీలున్నారు. ఎన్నికలకు ముందు 12 మంది సభ్యులు టీడీపీ లో చేరారు. ఒక వేళ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం ప్రతిపాదించాలంటే రెండింట మూడొంతుల మంది సంతకాలు చేయాలి. వైసీపీ జడ్పీటీసీలు చెబుతున్నట్లుగా గతంలో 42 మంది మద్దతు ఉండేది కానీ, ఈ మధ్య పూర్తి స్థాయిలో చీలికలు ఏర్పడినట్లు తెలుస్తోంది. మరో 15 మంది సభ్యులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ చెబుతున్నట్లు అవిశ్వాసం సంగతి మొదలు పెట్టకుండానే నవ్వులు పాలు కావచ్చన్న ప్రచారం బలంగా జరుగుతోంది.

మొంథా బీభత్సం

(5వ పేజీ తరువాయి)

వాగులకు దగ్గరా ఉన్న చేలల్లో అయితే నేలవాలిన వరిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో పొలాల్లోని నీటిని బయటకు తియ్యడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తంగా యంత్రాంగం

ఓ పక్క తుఫాన్ ధాటికి పెనుగాలులు విరుచుకుపడుతుంటే, మరోపక్క చిమ్మచీకటి. వర్షం.. అయినా రోడ్లకు అడ్డుగా విరిగిపడిన చెట్లు, విద్యుత్తు లు స్తంభాలను తొలగించేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. చెట్లను పడినట్టే క్షణాల్లో కత్తిరించి పక్కకు తొలగించేశారు. విద్యుత్తు స్తంభాలను పక్కకు నెట్టేసి, అవకాశం ఉన్న వరకు తెగిన తీగలను సరిచేస్తూ రాత్రంతా శ్రమించారు. మరోపక్క పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాతో పాటు భోజనం, అల్పాహారం అందించారు. ఆరోగ్య సిబ్బంది ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. విద్యుత్ శాఖ ముందే చెట్లను నరికేయడంతో చాలావరకు నష్టం తప్పింది. ప్రధాన లైన్లు దెబ్బతినడంతో లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు 24 గంటల సమయం పట్టింది. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. బుధవారం ఉదయం నుంచి తుఫాన్ తీవ్రత తగ్గడం, గాలులు శాంతించాయి. దీంతో హార్బర్‌లో హెచ్చరిక తీవ్రతను తగ్గించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా కొన్నిచోట్ల చిరుగాలులు, వర్షం కొనసాగుతుండటం, వాతారణంలో పూర్తిగా మార్పులు రాకపోవడంతో తిరిగి 3వ ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.


యనమదల-అనంతవరం గ్రామాల మధ్య చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు


పర్చూరులో పొంగి పొరలుతున్న వాగులు

అతలాకుతలం!


ఉప్పుటూరు బ్రిడ్జిపై భారీగా ప్రవహిస్తున్న వరద నీరు

జలదిగ్బంధంలో పర్చూరు

పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు

స్తంభించిన రాకపోకలు

శివారు కాలనీలు, గ్రామాలను ముంచెత్తిన వరద నీరు

వేల ఎకరాల్లో మండెలుగా నిల్వచేసిన నల్లబర్లీ మునక

నీటిలో పంట పొలాలు

విద్యుత్ సరఫరా లేక అంధకారంలో గ్రామాలు

ఆందోళనలో అన్నదాతలు, ప్రజలు

పర్చూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నడూలేని విధంగా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు పర్చూరు జలదిగ్బంధంలో చిక్కుకుంది. కుండపోతతో కురిసిన వర్షంతోపాటు, ఈదురుగాలులు, నివాసాల చుట్టూ వరద నీరు కమ్మేయటంతో ప్రజలు భయపడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిపివేయటంతో చిమ్మచీకట్లో ప్రజలు మగ్గిపోయారు.

● వరద నీటిలోనే ప్రభుత్వ కార్యాలయాలు

వాగులు, కాలువలు పొంగి పొర్లడంతో తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఉప్పుటూరులోని ఎస్సీ బాలికల వసతి గృహం సైతం జలదిగ్బంధంలో నిలచిపోయింది.

● నీట మునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్లు

పర్చూరు - ఇంకొల్లు రోడ్డులోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో భారీగా నీరు చేరి నీట మునిగింది. అదేవిధంగా వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రోడ్డులోని పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలోని 220 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను సైతం వరద ముంపుకు గురైంది.

● నలు దిక్కులా జలదిగ్బంధం...

పర్చూరుకు నలుదిక్కుల నుంచి రాకపోకలు స్తంభించాయి. పర్చూరు - గుంటూరు - చిలకలూరిపేట వైపు వెళ్లే రహదారిలో నేల చప్టాపై పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. అదేవిధంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఉప్పుటూరు వాగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై నుండి వరద నీరు పొంగి పొర్లడంతో ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించే అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నాగులపాలెం గ్రామాన్ని పూర్తిగా వరద నీరు కమ్మేసింది.

యద్దనపూడి గ్రామానికి రాకపోకలు బంద్

యద్దనపూడి,(మార్టూరు) అక్టోబరు29(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ యద్దనపూడి మండలాన్ని అతలాకుతలం చేసింది. బుధవారం ఉదయానికి కూడా మండల కేంద్రమైన యద్దనపూడి చేరడానికి నాలుగుదిక్కుల నుంచి అవకాశం లేకుండా పోయింది. యద్దనపూడి నుంచి పర్చూరు వెళ్లాలంటే నేలచప్టాలపై ప్రవహిస్తున్న వర్షపునీరు, మార్టూరు రావాలంటే డేగరమూడి వాగు,చిలకలూరిపేట వెళ్లాలంటే అనంతవరం రోడ్డులో నేల చప్టా, గన్నవరం వెళ్లాలంటే రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం, కూలిన చెట్లతో రాకపోకలు ఆగిపోయాయి. పోలూరు వాగు వద్ద పోలీస్ రెవెన్యూ అధికారులు ప్రజలను రానివ్వకుండా విధులు నిర్వహిస్తున్నారు. విజంనంపాడు రోడ్డులో ఉన్న నేల చప్టా వద్ద రాకపోకలు స్తంభించాయి. చిమటావారిపాలెం నుంచి యద్దనపూడి రావడానికి కూడా మధ్యలో నేల చప్టాపై విపరీతంగా నీరు ప్రవహించడంతో రవాణా సౌకర్యం నిలిపోయింది. తహసిల్దారు రవికుమార్, ఎస్ఐ రత్నకుమారి, ఇతర శాఖలకు చెందిన అధికారులు నష్టనివారణను తగ్గించేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు.

మార్టూరులోనూ ముంపు

మార్టూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నుంచి ప్రజలకు అండగా నిలబడటంలో మండలంలోని అధికార యంత్రాంగం తీవ్రంగా కృషి చేసింది. మార్టూరు నుంచి రాజుగారిపాలెం, డేగరమూడి గ్రామాలకు వెళ్లడానికి రాకపోకలు స్తంభించాయి. రాజుగారిపాలెం వాగు తూముల చప్టాపై నుంచి 5 అడుగులు మేర వరద నీరు ప్రవహించడం, వాగుకు ఎగువన వరదనీరు గ్రామంలోని ప్రవేశించి దాదాపు 10 ఎస్‌టీ కుటుంబాలకు చెందిన ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. మార్టూరు-డేగరమూడి వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోనంకి గ్రామంలో ఫ్లైవోవరుకు పడమర వైపు ఉన్న బీసీ కాలనీలోకి భారీగా వరదనీరు చేరడం, అంతేగాకుండా సర్వీసు రోడ్డులో భారీగా వర్షపునీళ్లు నిలబడటంతో దాదాపుగా 70 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వారందరికీ కోనంకి గ్రామ టీడీపీ మహిళా నాయకురాలు కోటపాటి కోమలి భోజన ఏర్పాట్లు చేశారు. రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద లారీడ్రైవర్లు, క్లీనర్లకు ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషాలు రెవెన్యూ వారి సహకారంతో భోజనం అందించారు. జొన్నతాళి గ్రామంలో జగనన్న కాలనీలో భారీగా వర్షపునీళ్లు చేరాయి. మార్టూరులో గ్రామ పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు హైవే వారి సహకారంతో సర్వీసురోడ్లలో సైడు కాలువలు పూడికతీత తీయడంతో పెద్ద అండరుపాస్ వద్ద నీళ్లు నిలబడకుండా పోయాయి.

● నష్టపోయిన పంటలు

తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాలలో కూరగాయలు దాదాపుగా 475 ఎకరాలలో పంట దెబ్బతిన్నట్లు ఉద్యానాధికారులు నివేదికను తయారుచేసి పంపించారు. ఇంకా మినుము, పత్తి, తెల్లబర్లీ పంట సాగు చేసిన రైతులు నష్టపోయారు. రాజుగారిపాలెంలో కోతకు వచ్చిన వంద ఎకరాలు మొక్కజొన్న పంట నష్టానికి గురైనట్లు రైతులు తెలిపారు.

శభాష్ ఇంకొల్లు ఎస్సై

ఇంకొల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలం కొణికిపల్లికు చెందిన టి.కీర్తి పురిటి నొప్పులతో బాధపడుతుండగా వరద నేపథ్యంలో 108 అక్కడకు వెళ్లే పరిస్థితి లేదు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ హుటాహుటిన అక్కడకు చేరుకొని తమ వాహనంలో ఇంకొల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఎస్సై సురేష్, వైద్యురాలు అంజలిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు.


ముంపు ప్రాంతాల్లో మంత్రి పార్థసారథి, కలెక్టర్ వినోద్ కుమార్


పర్చూరు ప్రాంతంలో నీట మునిగిన పత్తి పైరు

అధికారులు సమన్వయ చర్యలతో నష్టనివారణ

బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలసి వరద ప్రాంతాల పరిశీలన

పర్చూరు/కారంచేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పనిచేసి మొంథా తుఫాన్ ప్రభావం నుంచి ప్రజల ప్రాణహానితో పాటు, ఆస్తినష్టం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. బుధవారం చీరాల నుంచి పర్చూరు మార్గంలోని కారంచేడు రొంపేరు కుడి మేజర్ కాలువను, పర్చూరు వాగు ప్రవాహాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలసి సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్చూరు వాగు ఊహించని రీతిలో ప్రవహిస్తూ, పర్చూరు, నాగులపాలెంను ముంచెత్తిందన్నారు. ఈ వాగు సామర్థ్యం 5500 క్యూసెక్కులు మాత్రమేనని, పల్నాడు, చిలకలూరిపేట, అద్దంకిలో కురిసిన వర్షం కారణంగా వాగులో 9 నుంచి 11 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని చెప్పారు. సకాలంలో అధికారులు స్పందించకపోతే పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెంకు అపారనష్టం జరిగేదన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ ఉమామహేశ్వరరావు, డ్రైనేజ్ శాఖ అధికారులు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

విపత్కర సమయాల్లో సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విపత్కర సమయాల్లో ఇతరులకు సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. తుఫాన్ కారణంగా మండల పరిధిలోని దేవాంగపురిలో నీట మునిగిన ఇళ్లను ఎమ్మెల్యే కొండయ్య పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ఆదుకుంటామని చెప్పారు. అలాగే బట్ట మోహన్‌రావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరాశ్రయులైన 150 మందికి అన్నదానం నిర్వహించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పవనపుత్ర హ్యాండ్‌లూమ్స్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు వెంగల భరత్ దేశాయిపేటలోని శారదానగర్ కాలనీ, విజ్ఞేశ్వర కాలనీ, యానాది కాలనీ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీళ్లు చేరి ఇబ్బందులు పడుతున్న వారికి భోజనం పంపిణీ చేశారు. చల్లారెడ్డిపాలెం పరిధిలోని జగన్నాధపురంలో దోగుపర్తి బాలకృష్ణ సుమారు 80 మందికి భోజనం పంపిణీ చేశారు.


అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైల్వేఉద్యోగులను కాపాడిన చినగంజాం పోలీసులు


రైల్వే ట్రాక్‌మెన్‌ను రక్షించిన పోలీసులు

చినగంజాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరద నీటిలో కొట్టుకుపోతున్న ఇద్దరు రైల్వే ట్రాక్‌మన్లను చినగంజాం పోలీసులు ప్రాణాలకు తెగించి కాపాడారు. తుఫాన్ ప్రబావంతో పెదగంజాం, నీలయాపాలెం మధ్య నాగన్న వాగు పొంగింది. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మన్లుగా పనిచేస్తున్న గణేష్, బాలాజీరెడ్డిలు విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇళ్లకు బయలుదేరారు. నాగన్నవాగు బైక్‌పై ముందుకు వెళ్తుండగా నీటి ప్రవాహానికి ఇద్దరు కొట్టుకుపోతుండగా సమీపంలో విధులు నిర్వహిస్తున్న చినగంజాం పోలీసులు అన్సర్‌బాషా, హోంగార్డు శివశంకర్‌రెడ్డిలు తమ ప్రాణాలకు తెగించి తాళ్ల సాయంతో ఇద్దరిని రక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్ తీరం దాటిన తరువాత పోలీసు యంత్రాంగం సహాయ చర్యలు ముమ్మరంగా చేస్తున్నారని, ఏదైనా ఆపద వస్తే తక్షణమే స్పందిస్తున్నారని తెలిపారు. కానిస్టేబుళ్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు, చీరాల డీఎస్పీ మొయిన్, ఇంకొల్లు సీఐ వైవీ.రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్‌లు అభినందించారు.


ముంపుబాధితులకు అన్నం వడ్డిస్తున్న ప్రతినిధులు

సహాయక చర్యల్లో తెలుగుదేశం పార్టీ నేతలు

స్వర్ణ(పర్చూరు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. ఆయా కాలనీవాసులను పునరావాస కేంద్రాలకు స్థానిక అధికారులతో కలసి ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్, మండల పార్టీ అధక్షుడు తిరుమలశెట్టి శ్రీహరి నేతృత్వంలో సహాయక చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు.. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అదేవిధంగా పర్చూరు ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు మామిడిపాక హరిప్రసాద్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు.


పర్చూరు రోడ్డులో వాగువద్ద భద్రతా ఏర్పాట్లలో సీఐ వైవి రమణయ్య


వంకాయలపాడు వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు చేరుస్తున్న ఎస్సై

చెరువులను తలపించిన పంటపొలాలు

ఇంకొల్లు, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు మండలంలో పంటపొలాలు చెరువులను తలపించాయి. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడంతో ప్రాణ, ఆస్తినష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సీఐ రమణయ్య పర్యవేక్షణలో ఎస్సై సురేష్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు తమ సిబ్బందితో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించారు. మొత్తం 14 సచివాలయాల పరిధిలో 14 పురావాసకేంద్రాలు ఏర్పాటు చేయగా వంకాయలపాడులో 150 మందిని ,గంగవరం తదితర గ్రామాలో 150 మందిని పునరావాస కేంద్రాలలో ఉంచగా వారికి అధికారులు భోజనవసతులను ఏర్పాటుచేశారు.

మొక్కజొన్న, పత్తికి ఇబ్బంది

మండల పరిధిలోని పాత మద్రాసురోడ్డులో దుద్దుకూరు వద్ద వాగు రెండు రోజులుగా పొంగి ప్రవహిస్తోంది.రాకపోకలు నిలిచిపోయాయి. పూసపాడు-వంకాయలపాడు వద్ద వాగు పొంగి ప్రవహించింది. ఎస్సై సురేష్. నీటిలో చిక్కుకున్న 50 మందిని ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. ఇంకొల్లు-దగ్గుబాడు మధ్య ఆలేరు వాగు వంతన మీద రెండు అడుగుల ఎత్తున, గంగవరం రోడ్డులోని అప్పేరు వాగు, నాగండ్లకు ఇరువైపులా ఉన్న రెండు వాగులు పొంగి ప్రవహించాయి. దుద్దుకూరు చెరువుకట్ట కోతకు గురైంది. వాగుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బందోబస్త్ ఏర్పాటు చేశారు. పత్తి పంట నీటి మునిగింది. కండెదశలో ఉన్న మొక్కజొన్న పంట నేల పాలైంది.

ద్రోణాదులలో 500 ఎకరాల్లో దెబ్బతిన్న మినుము

మార్టూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో దాదాపు 500 ఎకరాల్లో మినుము పంట దెబ్బతింది. అదేవిధంగా గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ద్రోణాదుల గ్రామం నుంచి బొబ్బేపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న చప్టాపై ఉధృతంగా వర్షపు నీరు ప్రవహించడంతో సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

హైవేను పగులకొట్టించిన కలెక్టర్

పర్చూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పర్చూరు ప్రాంతాన్ని వరద నీరు చుట్టుముట్టాయి. వరద ఉధృతి పెరిగి గ్రామాలను ముంచెత్తుతున్నాయన్న విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. హుటాహుటినా పర్చూరు ప్రాంతంలో చేపట్టిన జాతీయ రహదారి 167(ఏ)లో భాగంగా ఉప్పుటూరు సమీపంలో హైవేను పగులకొట్టి వరదను దిగువకు మళ్లించారు. కలెక్టర్ సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దిగువకు చేరిన నీరు ఆయా పంట పొలాల నుంచి కొమర్నేనివారిపాలేనికి పెద్దఎత్తున చేరటంతో గ్రామస్థులు కలవరానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● కొరవడిన హైవే అధికారుల ముందు చూపు

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో అధికారుల్లో ముందుచూపు కొరవడడం ప్రజలకు శాపంగా మారింది. ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతుండడంతో సమస్య తీవ్రంగా మారింది. హైవే నిర్మాణంలో ఖానాలను ఏర్పాటు చేయకపోవటంతో పాటు, డ్రెయిన్లను నిర్మించకపోవటంతో వరద నీరు గ్రామాలను ముంచెత్తింది. నలు దిక్కుల నుంచి దిగువకుపోయే మార్గం లేక గ్రామాలను ముంపుకు గురిచేశాయని ప్రజలు వాపోతున్నారు. కేవలం కొద్దిపాటి తూములను మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవటం వల్లే తమకు ఇలాంటి దుస్థితి నెలకొందని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

● రాజుగారిపాలెం వాగులో టెన్షన్

మార్టూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌తో మండలంలోని రాజుగారిపాలెం వాగు చప్టాపై నుంచి బుధవారం భారీగా వరదనీరు ప్రవహించడమేగాకుండా, చెత్తా చెదారం, వ్యర్థాలతో చప్టా తూములు మూసుకుపోయాయి. ముంపును గ్రహించిన గ్రామ టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ఆగమేఘాల మీద ఎక్స్‌వేటర్‌ను తెప్పించి, వాగు వద్ద చెత్తను తొలగించారు. కొంచెం సేపు పని చేసిన తర్వాత ఎక్స్‌వేటరు ఇంజన్ సక్రమంగా పనిచేయక, వాగు నీటిలో చిక్కుకుపోయింది. అత్యవసరంగా ఎస్కార్ట్ వాహనాన్ని తెప్పించి నీటిలో ఉన్న ఎక్స్‌వేటరును చీకటి పడుతున్న సమయానికి బయటకు తీయించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


వాగులో ఇరుక్కుపోయిన ఎక్స్‌వేటర్‌ను తీస్తున్న ఎస్కార్ట్ వాహనం

ప్రజలు తాగునీటి జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలియచేశారు. వర్షపు నీరు కలిసిన బావి నీరు తాగవద్దని, భోజనం ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు, కాయిల్స్ వాడాలని, గుంతలు, టైర్లు తదితర వాటిలో నీటినిల్వలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. జ్వరం, విరేచనాలు, వాంతులు, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలన్నారు.



మొంథా.. నష్టమెంత!?

తుఫాన్ దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతాంగం
పీఆర్‌లో 290 కి.మీ., ఆర్అండ్‌బీలో 462 కి.మీ రోడ్ల డ్యామేజీ
ఇరిగేషన్ శాఖకు రూ.300 కోట్ల నష్టం
ప్రాథమిక అంచనాలు తయారు చేసిన యంత్రాంగం
బాధితులకు చేయూత కార్యక్రమాలు ప్రారంభం

మొంథా తుఫాన్ దెబ్బకు జిల్లా అతలాకుతలమైంది. రికార్డు స్థాయిలో వర్షం కురవడంతో పంటలు, రోడ్లు, ఇళ్లు దెబ్బతిన్నాయి. బుధవారం వర్షం తెరపివ్వడంతో అధికార యంత్రాంగం నష్ట అంచనాలు వేసే పనిని మొదలుపెట్టింది. ప్రాథమికంగా నష్ట అంచనా వివరాలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టం ఎంతన్నది తెలుస్తుందని ఉన్నతాధికారులు తెలిపారు. అదే సమయంలో తుఫాన్ ప్రభావిత బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వం ఆదేశించించంది. దీంతో పునరావాస కేంద్రాల్లోని బాధితులకు నిత్యావసర సరుకులతోపాటు నగదు అందించే పనిని యంత్రాంగం బుధవారం ప్రారంభించింది.

● రైతాంగానికి తీరని నష్టం

మొంథా.. జిల్లా రైతాంగానికి కోలుకోలేని నష్టాన్ని మిగిల్చింది. వ్యవసాయ శాఖ పరిధిలో 1320.73 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతినట్లు అధికారులు గుర్తించారు. అందులో 1282.63 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా, 21.7 హెక్టార్లలో మొక్కజొన్న, 11.4 హెక్టార్లలో వేరుశనగ పంట దెబ్బతిన్నది. 15 మండలాల్లోని 50 గ్రామాలకు చెందిన 1164 మంది రైతులు నష్టపోయారు. ఇక తుఫాన్ ప్రభావంతో 41.10 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కూరగాయల సాగు 19.56 హెక్టార్లు, పూల సాగు 3.40 హెక్టార్లు, బొప్పాయి సాగు 12.44 హెక్టార్లు, మిర్చి సాగు 3.70 హెక్టార్లు, తమలపాకు సాగు 2 హెక్టర్లలో దెబ్బతిన్నట్లు హార్టికల్చర్ అధికారులు గుర్తించారు. మొత్తం 13 మండలాల పరిధిలో 77 మంది రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు నివేదికలు రూపొందించారు. కాగా జిల్లాలో 31 పశువులు, 600 బాతులు చనిపోగా అందుకుగానూ రూ.9.345 లక్షలు నష్టం వాటిల్లింది. అలానే నాలుగు పశు వైద్యశాలలు కూడా దెబ్బతిన్నాయి. వీటికిగానూ రూ.2.30 కోట్ల నష్టం జరిగినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు నివేదికలు తయారు చేశారు.


అల్లూరులో చెరువును తలపిస్తున్న పొలాలు

దెబ్బతిన్న రహదారులు

మొంథా తుఫాన్ దెబ్బకు జిల్లాలో చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు వందల కిలోమీటర్ల పొడవున డ్యామేజీ అయినట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి ప్రాథమిక నష్ట అంచనాల నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 290 కిలోమీటర్ల మేర రోడ్ల సర్ఫేస్ డ్యామేజ్ జరిగింది. తాత్కాలికంగా ఈ రోడ్లను బాగు చేసేందుకు రూ.1.77 కోట్లు అవసరమని, వీటిని శాశ్వతంగా బాగు చేయాలంటే రూ.146.60 కోట్లు అవసరమని పీఆర్ ఇంజనీర్లు ఉన్నతాధికారులకు నివేదించారు. అలానే కావలి, కొండాపురం మండలాల్లో రెండు చోట్ల పంచాయతీరాజ్ రోడ్లు తెగిపోయాయి. ఇక ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 462 కి.మీ మేర రోడ్ సర్ఫేస్ డ్యామేజ్ జరిగింది. గండవరం, కరేడు రెండు చోట్ల రోడ్లు బ్రీచ్ అయ్యాయి. ఈ డ్యామేజీకి తాత్కాలిక మరమ్మతులకు రూ. 22.87 కోట్లు, అదే శాశ్వత నిర్మాణాలకైతే రూ.164 కోట్లు అవసరమవుతాయని ఆర్అండ్‌బీ అధికారులు నివేదించా రు. జిల్లాలో 31 ఆర్అండ్‌బీ రోడ్లపై వరద నీరు పారుతుండగా, అందులో 16 ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా భారీ వర్షాల ప్రభావంతో ఇరిగేషన్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. చాలా చోట్ల చెరువు కట్టలు బలహీనపడ్డాయి. కాలువలు పూడికతో నిండిపోగా, ఉధృతంగా ప్రవహిస్తున్న వరదలకు డ్రెయిన్లు దెబ్బతిన్నాయి. ఒక్క మంగళవారం నాడే 815 చోట్ల దెబ్బతిన్నాయి. ఈ డ్యామేజస్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు రూ.65 కోట్లు అవసరమని, శాశ్వత నిర్మాణాలు చేసేందుకు సుమారు రూ.300 కోట్లు అవసరమవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు.


సంగం బస్టాండు వద్ద దెబ్బతిన్న రోడ్డు



కలువాయిలో గింజలు మొలకెత్తి పచ్చగా ఉన్న పైరు

కలువాయిని చుట్టేసిన నీరు

కలువాయి : మండలంలోని కుల్లూరు, వెంకటరెడ్డిపల్లిలో సుమారు 480 ఎకరాలు కోతకు వచ్చిన వరి పైరు నీట మునిగిపోయింది. నీటిలో ఉన్న గింజలు మొలకెత్తి పచ్చగా పైరు తయారైంది. పంటంతా నీటిపాలు కావడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి పెట్టామని, అదంతా నష్టపోయినట్లు వాపోతున్నారు. అలాగే మండలంలోని పలు చెరువులు నిండి కలుజు పారుతుండగా, ఆ నీటిని తీసుకుపోయే వాగులు పొంగి చుట్టు పక్కల పొలాలను ముంచెత్తాయి. కుల్లూరు చెరువు కలుజు నీరు పొలాలను ముంచి వెంకటరెడ్డిపల్లి సమీపంలో సోమశిల-పొదలకూరు మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తోంది. కలువాయి చెరువు తూర్పు, పరమటి అలుగులు ద్వారా వస్తున్న నీటితో పొలాలన్నీ చెరువుల్లా మారిపోయాయి. రాజుపాళెం- సోమశిల మార్గంలో మంగళవారం రాత్రి చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● బాధితులకు చేయూత

తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాల్లోని 2790 కుటుంబాలకు చెందిన సుమారు 7 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ బాధితులకు కుటుంబానికి 25 కేజీల బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, టమోటాలు కేజీ చొప్పున అందించాలని, అలానే ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలానే ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు మరో 13,512 మందిని గుర్తించారు. వీరిలో ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరుకులు ఇవ్వాలని ఆదేశాలు అందాయి. ఈ పంపిణీ ప్రక్రియ జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం బాధితులంతా పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో తొలి రోజు కొద్ది మందికి మాత్రమే ప్రభుత్వం సూచించిన సరుకులు అందించగలిగారు. గురువారం సాయంత్రానికి బాధితులందరికీ సరుకులు, నగదు అందజేయనున్నట్లు జిల్లా అధికారులు తెలియజేశారు. ఇక జిల్లాలో భారీ వర్షాలకు 16 ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటికి పరిహారం నిర్ణయించాల్సి ఉంది.


కందుకూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న మన్నేరు


ఏఎస్‌పేటలో నక్కలవాగు ఉధృతి


కందుకూరులో అలుగు వాగు


లింగసముద్రం : పెదపవని వద్ద ఉప్పుటేరు..

● యంత్రాంగం సేవలు భేష్

మొంథా ప్రభావం జిల్లాపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటి నుంచి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అలానే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు చేసి వారంతా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండేలా ఆదేశాలిచ్చారు. రెవెన్యూ, పోలీసులు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాయి. అలానే పెన్నా పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వచ్చాయి. భారీ వర్షాలు కురిసినా విద్యుత్ శాఖ పనితీరుతో ఎక్కడా విద్యుత్ సమస్య తలెత్తలేదు. ప్రధానంగా నెల్లూరులో రోడ్లపై వర్షపు నీరు పారకుండా మున్సిపల్ అధికారులు వేగంగా చర్యలు తీసుకున్నారు. అలానే గ్రామాల్లో కూడా నీరు నిలబడకుండా ఎంపీడీవోలు చర్యలు తీసుకున్నారు. ఇక కీలకమైన ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు కూడా ఎక్కడా ఒక్క చెరువు కట్ట తెగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ కాలువల్లో పూడిక, గుర్రపు డెక్కలను తొలగిస్తూ వరద ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేయడంతో ప్రమాదాలు తప్పాయి. మిగిలిన శాఖలు కూడా వారి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో తీవ్ర తుఫాన్‌ను జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కోగలిగింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)


కలువాయి : వెంకటరెడ్డిపల్లి వద్ద రోడ్డుపై కుల్లూరు చెరువు కలుజు నీరు


కొట్టుకుపోయిన రాపూరు-పంగిలిరోడ్డు


సంగంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


కావలిలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి


కందుకూరులో ట్రాక్టరుపై వెళ్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

బీరాపేరులో కొట్టుకొచ్చిన డ్రెడ్జింగ్ పడవలు

● సంగం బ్యారేజీకి తప్పిన పెనుముప్పు


పాత కనిగిరి కాలువ రెగ్యులేటర్లకు సమీపంలో ఆగిన మరో రెండు పడవలు

సంగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఇసుక తీసేందుకు కాంట్రాక్టర్లు తీసుకొచ్చిన భారీ డ్రెడ్జింగ్ పడవలు బుధవారం తెల్లవారుజామున బీరాపేరు వరద ప్రవాహానికి కొట్టుకు వచ్చాయి. పాత ఆనకట్ట క్రస్ట్‌కు ఢీకొని ఓ పడవ ఆగిపోగా, మరో రెండు పడవలు పాత కనిగిరి కాలువ హెడ్‌రెగ్యులేటర్లకు సమీపంలో నిలిచిపోయాయి. పాత ఆనకట్ట వద్ద పడవ ఆగకపోయి ఉంటే సుమారు 86 వేల క్యూసెక్కుల నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న బీరాపేరు ప్రవాహానికి పడవ నేరుగా కొత్త బ్యారేజీని ఢీకొని ఉండేది. దీనివల్ల అపార నష్టంవాటిల్లి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల మధ్యాహ్నం హుటాహుటిన బ్యారేజీ వద్దకు చేరుకుని కొట్టుకు వచ్చిన పడవలను పరిశీలించారు.

● తొలగింపునకు విశ్వప్రయత్నాలు

క్రస్ట్ వద్ద ఆగిన పడవ ప్రమాదకరంగా ఉండడంతో బయటకు తీసుకు వచ్చేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, మత్స్య శాఖ, అగ్నిమాపక అధికారులతోపాటు సిబ్బందిని పిలిపించారు. నీటి ప్రవాహం తగ్గేవరకు బయటకు తీసేందుకు వీలుపడలేదు. బ్యారేజ్‌ను పడవ ఢీకొట్టకుండా అక్కడే స్థిరంగా ఉండేలా ఎన్డీఆర్ఎఫ్ బృందంతో ప్రయత్నిస్తున్నారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో సాయంత్రం వరకు కనీసం పడవ ఉన్న ప్రాంతానికి వెళ్లడానికి కూడా వీలుపడలేదు. ఆత్మకూరు ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, మత్స్యశాఖ జేడీ శాంతి, అగ్నిమాపక, తెలుగు గంగా ఇన్‌చార్జి ఎస్ఈ రాధాకృష్ణ, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ అనీల్ కుమార్, సంగం, ఆత్మకూరు సీఐలు ఘటనాస్థలిలో ఉన్నారు.


అల్లూరులో కూలిన విద్యుత్ స్తంభాలు


జలదంకి : పెద్దచెరువు అలుగు పారుతుండటంతో ఆగిన రాకపోకలు


ఉదయగిరి ఇంటిపై కూలిన స్తంభం


అనంతసాగరం మండలం సోమశిలలో వాలిన రామాలయం ముందున్న ధ్వజస్తంభం

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. మంగళవారం 41 వేల క్యూసెక్కులు వస్తుండగా బుధవారం సాయంత్రానికి 48,330 క్యూసెక్కులకు పెరిగింది. గేట్ల ద్వారా 23,460 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాంలో 68.453 టీఎంసీల నీరు నిల్వ ఉంచారు.

● **లింగసముద్రం :** రాళ్లపాడు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో అధికారులు గేట్లను దించేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు నాలుగు గేట్లను దించి మన్నేరుకు నీటి విడుదలను ఆపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి కేవలం 800 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రాజెక్టులో 19 అడుగుల నీటిమట్టం ఉంది.


వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఇటుక అందిస్తున్న చిన్న జీయర్ స్వామి, చిత్రంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, నుడా చైర్మన్ కోటంరెడ్డి

ఆలయాలు జాతి వైభవానికి చిహ్నాలు

- తెలుగు జాతిది 2వేల సంవత్సరాల చరిత్ర
- త్రిదండి రామానుజ చిన్న జీయర్
- నెల్లూరులో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన
- గడువుకన్నా ముందే ఆలయ నిర్మాణం : దేవదాయ శాఖ ముఖ్యకార్యదర్శి
- హాజరైన దేవదాయ శాఖ మంత్రి ఆనం

8

నేడే జడ్పీ సమావేశం

● వాయిదాకు అవకాశం

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం (నేడు) నిర్వహించనున్నారు. అయితే సమావేశం వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జడ్పీ సమావేశం చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించనున్నారు. ఇందుకుగానూ అజెండాను ఈనెల 16న రూపొందించి, నేడు సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఐదు అంశాలతో అజెండాను రూపొందించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, రోడ్లు భవనాల శాఖలపై సమావేశంలో చర్చించాలని అజెండాలో పొందుపరిచారు. ఈ అజెండాపై సమావేశంలో సభ్యులు చర్చించాల్సి ఉంది. అయితే సమావేశం వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాను మొంథా తుఫాన్ అతలాకుతలం చేయడంతో అధికార యంత్రాంగం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులంతా సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. తుఫాన్ తాకిడి తగ్గినా జిల్లాలో అనేక ప్రాంతాలు ముంపులో ఉండడం, పంట, ఇతర నష్టాలు అధికంగా ఉండడంతో అధికార యంత్రాంగం పూర్తిగా సహాయక చర్యలో ఉంటున్నారు. దీంతో అధికారులు సమావేశానికి వచ్చే అవకాశాలు లేవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జడ్పీ సమావేశాన్ని వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయి.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకుంటే ఎలా!?

కావలి(టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోతే ఎలాగని కాయకల్ప అంచనా కమిటీ వైద్యాధికారులు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఏరియా వైద్యశాలను కాయకల్ప అంచనా కమిటీ వైద్యాధికారులు సూరిబాబు, వేణుగోపాల్, క్రాంతిలు సందర్శించి ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో డస్ట్ బిన్‌ల నిర్వహణ, ఇంజక్షన్‌లు వేసే గది దగ్గరుండే డస్ట్‌బిన్‌లో కవర్ లేకపోవడం, కిటికీల అవతలి వైపు అపరిశుభ్రత పట్ల అసహనం వ్యక్తం చేశారు. కళ్ల ముందు కనిపించే పరిసరాలతో పాటు ప్రాంగణంలో కనిపించన పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష, ఆర్ఎంవో ప్రమీల, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు లేనివారికి మంజూరు చేస్తాం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా బుధవారం మండలంలోని గరిమెనపెంట పంచాయతీ చల్లగిరికల, గజ్జులవారిపల్లె, కొత్తపల్లి, చల్లావారిపల్లె, కోవివారిపల్లె గ్రామాలలోని 500 కుటుంబాలతో పాటు సాయిపేట పంచాయతీలోని కొమ్ముపాలెంలో పేదలకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. చల్లగిరికలలో దాదాపు 40 కుటంబాలు తమకు ఇళ్లు లేవని చెప్పడంతో వెంటే హౌసింగ్ అధికారులతో మాట్లాడి లబ్ధిదారులు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ సీనియర్ నాయకు లు జీ.లక్ష్మీనరసింహం, దామా మహేశ్వరావు, యారవ క్రిష్ణయ్య, బొట్లగుంట హరిబాబు, పోలినేని చంద్రబాబునాయుడు, దామా శివబాబు, కుంకు మోహనరావు, ఓరుగంటి సుమన్, అల్లిక మధు, మామిళ్లపల్లి వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం ఆగినా.. తగ్గని వాగుల ఉధృతి!



చెన్నకేశవ ఆలయంలో వర్షపు నీరు

జలదంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో రెండు రోజులు కురిసిన భారీవర్షాలు బుధవారం ఆగాయి. అయినా వాగుల వరద ఉధృతి తగ్గకపోవడంతో మండలంలోని పలు గ్రామాలకు రెండో రోజూ రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని చామదల వద్ద నేరెళ్లవాగు, చినక్రాక వద్ద చీకటివాగు, జలదంకి-తెల్లపాడు రోడ్డుపై టంకంవారి పాలెం వద్ద జలదంకి పెద్దచెరువు అలుగు వాగు, గోపన్నపాలెం వద్ద ఊళ్లవాగు, కమ్మవారిపాలెం వాగు, కృష్టాపాడు ఉబ్బలవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలు నిలిచిన గ్రామాల ప్రజలు నిత్యావసరాలకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ అత్యవసర పరిస్థితులు ఏర్పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. జలదంకి చెన్నకేశవుడి ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో కార్తీకమాస పూజలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం వర్షం నిలిచి ఎండ రావడంతో రైతులు చకచకా వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తూ వరినారుమళ్లు పోస్తున్నారు. పలు వాగుల వెంబడి ఉన్న పంట పొలాల్లో నీటి ప్రవాహం చేరి వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. చప్టాల వద్ద తహసీల్దారు ప్రమీల, ఎస్ఐ లతీఫున్నీసాలు తమ సిబ్బందిని కాపలా ఉంచి ఎవరినీ వాగుల్లోకి దిగకుండా చర్యలు చేపట్టారు. సాగులో ఉన్న మెట్ట పంటల నష్టంపై అధికారులు సర్వే చేస్తున్నారు.

జలదిగ్బంధంలో టిడ్కో గృహ సముదాయం

కావలిరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ మద్దూరుపాడులోని టిడ్కో గృహాల సముదాయం మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. గత 3 రోజులుగా గృహ సముదాయాల చుట్టూ 5 అడుగుల మేర వర్షపు నీరు చేరింది. దీంతో వారు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు కంపోస్టు మట్టిలో కలిసిన వర్షపు నీరు మొత్తం టిడ్కో గృహ సముదాయాల ఆవరణలో ఉన్న తాగు నీటిని సరఫరా చేసే బావిలోకి చేరడంతో బావిలో నీరు కలుషితం అయ్యింది. టిడ్కో గృహాలకు తూర్పు వైపున ఆనెమడుగు చెరువు ఉండటంతో పాటు గృహాల సముదాయం లోతట్టులో ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. అలాగే మండలంలోని అనేక గ్రామాలకు బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. గుండాలమ్మవాగు ఉధృతంగా ప్రవహించడంతో రుద్రకోట పంచాయతీ గుమ్మడిబందల గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టి చప్టాపై 6 అడుగుల మేర వర్షపునీరు పారింది. రూరల్ ఎస్ఐ సుభాషిణి, సిబ్బందితో గస్తీ నిర్వహించారు. ఆకుతోట గిరిజన కాలనీకి ఒక వైపు చెరువు కలుజు, మరోవైపు చప్టా వరద నీరు ఎక్కువై రాకపోకలు నిలిచిపోయాయి. చౌదరి పాలెం నుంచి జలదంకి మండలం గన్నారపుగుంట గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు పొంగి పొలాల గుండా వరదనీరు ప్రవహించటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. రుద్రకోట జాతీయ రహదారిపై ఒంగోలు వైపు మార్గంలో రెండు లైన్లలోకి వరద నీరు చేరడంతో రూరల్ సీఐ జీ. రాజేశ్వరావు వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

టిడ్కో గృహాలకు విముక్తి కల్పించండి : సీపీఎం

కావలి(టౌన్): జలదిగ్బంధం నుంచి టిడ్కో గృహాలకు విముక్తి కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం నేతలు టిడ్కో గృహ సముదాయంలో పర్యటించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిశీలించారు. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, కృష్ణయ్య, చెన్నయ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే దగుమాటి సుడిగాలి పర్యటన

కావలి : కావలి పట్టణం, రూరల్ మండలాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి స్థానిక నాయకులు అధికారులతో కలిసి బుధవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. మద్దూరుపాడులో టిడ్కో గృహసముదాయంను చుట్టు ముట్టి ఉన్న వరదను పరిశీలించి ఆ నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోమని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాంలకు చెప్పారు. రూరల్ మండలంలో రుద్రకోట పంచాయతీ గుమ్మడి బొందలకు వెళ్లే గుండాల వాగు ఉధృతంగా పారుతుండటంతో నాయకులు తుళ్లూరు మల్లికార్జున, ఉప్పాల వెంకట్రావు, సీఐ రాజేశ్వరరావు ట్రాక్టర్‌పై ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం చెన్నాయపాలెం రోడ్డులోఉన్న ఆకుతోట గిరిజనకాలనీ, మన్నంగిదిన్నె గిరిజనకాలనీ, సర్వాయపాలెం పంచాయతీలోని సర్వాయపాలెం, మాతినవారి పాలెం గ్రామాల్లో పర్యటిం చారు. మన్నంగిదిన్నె రోడ్డుపై వర్షపు నీరు పొంగి పారుతూ రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో ఆ నీటిని కట్టడి



బిట్రగుంట : గుర్రపు డెక్కను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



కావలిరూరల్ : చెరువును తలపిస్తున్న పొలాలు

చేయమని ఆదేశించారు. ముసునూరు గిరిజన కాలనీలో నీట మునిగిన గృహాల బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు.

● రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

బిట్రగుంట : బోగోలు బజారు సెంటర్లో బుధవారం తెల్లవారు జామున చెట్టు ఆర్అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. స్థానిక ఎస్ఐ ఎన్.ప్రభాకర్ చొరవ తీసుకుని వాహన రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, తెలుగుతమ్ముళ్ళు ఇందుపూరు రామోహన్‌రెడ్డి, నాటకరాణి భాస్కర్‌లు ఉన్నారు. ఉమామహేశ్వరపురం ఉడ్‌హౌస్ పేట మధ్య ఉన్న కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వర్షపు నీటిప్ర వాహానికి ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ స్పందించి సొంత నిధులతో ఎక్స్‌కవేటరు తెప్పించి 30 అడుగుల వరకు కాలువ గోడలకు అడ్డంగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించారు. దీంతో వర్షపు నీరు సజావుగా ప్రవహించింది.

● కూలిన విద్యుత్ స్తంభాలు

అల్లూరు : తుఫాన్ ధాటికి ఎక్కడా ప్రమాదాలు, నష్టాలు చోటు చేసుకోకపోయినప్పటికీ కొన్నిచోట్ల స్వల్ప నష్టాలు జరిగాయి. అల్లూరు పట్టణ పరిధిలోని బలిజపాలెంలో గోడ కూలిపోయింది. నార్తుమోపూరు గిరిజన కాలనీలో గుడిసెపై చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో గృహం స్వల్పంగా దెబ్బతింది. చింతగుంట సమీపంలో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో పాటు అనేక స్తంభాలు పక్కకు ఒరిగాయి. పొలాల్లో భారీస్థాయిలో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొంతమందిని అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.

వరద నీటిలో చేపల వేట



వరద నీటిలో చేపలు పడుతున్న ప్రజలు

కావలి(టౌన్): పట్టణంలోని బృందావనం కాలనీ ఎదురుగా కాలువలో ప్రవహిస్తున్న వరద నీటిలో చేపల వేటకు పట్టణ ప్రజలు ఎగబడ్డారు. భారీ వర్షాలకు ముసునూరు మందాటి చెరువు పొంగి బృందావనం కాలనీ ఎదురుగా ట్రంకురోడ్డు పక్కనున్న కాలువలో ప్రవహిస్తున్న నీటిలో దండిగా చేపలు కనిపించడంతో విషయం తెలుసుకున్న ప్రజలు అక్కడికి చేరుకున్నారు. చీరలు, దోమతెరలు, గ్రీన్ కర్టెన్లు.. ఇలా ఏది దొరికితే అది తెచ్చుకుని చేపలు పట్టుకుని బస్తాలలో నింపుకుని తీసుకెళ్లారు. ట్రంకురోడ్డు వైపు ప్రయాణించే వాహన చోదకులు ప్రజలు చేపలు పట్టుకోవడాన్ని ఆసక్తిగా తిలకించారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.

మాలకొండలో రేపు హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొండపైన కల్యాణ మండపంలో ఈనెల 31వ తేదీన ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాలేపాటి కుటుంబానికి పలువురి పరామర్శ



మాలేపాటి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

దగదర్తి (బిట్రగుంట), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దగ దర్తికి చెందిన టీడీపీ నేత, దివంగత ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డవలె ప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబాన్ని బుధవారం పలువురు నేతలు పరామర్శించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఆర్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి భానుచందర్‌నాయుడు చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాలేపాటి రవీంద్రనాయుడు, మాలేపాటి నరేష్, లోకేష్‌లను పరామర్శించారు. అలాగే ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, బొల్లినేని రామారావులు మాలేపాటి రవీంద్రనాయుడు, కుటుంబ సభ్యులను పరామ ర్శించారు.

● నేడు దగదర్తికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాక

కావలి(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం దగదర్తికి వస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి స్థానిక నేతలకు సమాచారం అందింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడి తనయుడు బానుచందర్ నాయుడులు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కర్మక్రతువులు గురువారం వారి స్వగ్రామమైన దగదర్తిలో జరుగుతుండటంతో ఆ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అక్కడ జరిగే సంతాపసభలో పాల్గొననున్నారు.

నిండిన చెరువులు - లోతట్టు ప్రాంతాల్లో తగ్గని నీరు



కందుకూరు : జగనన్న లే అవుట్‌లో నిలిచిన వరద నీరు

కందుకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో కందుకూరు ప్రాంతంలోని చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండాయి. లోతట్టు ప్రాంతాలు నీటిలో మగ్గుతోన్నాయి. కందుకూరు ప్రాంతంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధి చెందిన మో పాడు, మాచవరం చెరువులు నిండటంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలచేశారు. దీంతో కందుకూరు - కొండముడుసుపాలెం గ్రామాల మధ్య అలుగువాగు ఉప్పొంగి బుధవారం ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మాచవరం కొండ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కందుకూరు-గుడ్లూరు మార్గంలో, చుట్టుగుంట మార్గంలో ఉన్న వాగులన్నీ ఉప్పొం గటంతో కందుకూరు-ఉలవపాడు మార్గంలోను రాకపోకలు స్తంభించాయి. కోత దశలో ఉన్న వరిపైరు పూర్తిగా దెబ్బతినింది. పొగాకు, మిరపనారుమడులు దెబ్బతిన్నాయి. ఉలవపాడు మండలంలోని తీరప్రాంతంలో వందలాదిఎకరాలలో సాగుచేసి ఉన్న చామగడ్డ పైరుకు తీవ్రనష్టం వాటిల్లింది. పట్టణంలోని మహదేవపురం రోడ్డులో ఉన్న జగనన్న లే అవుట్‌ను వరదనీరు చుట్టుముట్టింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ట్రాక్టరులో వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఉప్పుచెరువు కాలనీ, టిడ్కో సముదాయాలకు వెళ్లే రోడ్డు, కేసరిగుంటకాలనీ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాలలో వరదనీరు నిలిచి ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించారు. తుఫాన్‌లో సహాయక చర్యలు చేపట్టిన టీడీపీ నేతలను ఎమ్మెల్యే అభినందించారు. కాగా భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా ఎక్కడ చూసినా చేపల వేటలో యువకులు తలమునకలయ్యారు. మోపాడు చెరువులోకి ప్రవహించే పందివాగు, ఎర్రవాగుల్లోకి పెద్దఎత్తున చేపలు రావటంతో పట్టుకుంటూ కనిపించారు. బడేవారి పాలెం సమీపంలోని ఎర్రవాగులో వలలు వేసి చేపల వేట సాగిరచారు.

● వాగులు, వంకలు ఉగ్రరూపం

లింగసముద్రం: భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పెదపవని సమీపంలోని ఉప్పుటేరులో వరదప్రవాహం ఎక్కువైంది. వంతెనపై రెండు మూడు అడుగుల మేరకు నీరు ప్రహించింది. దీంతో లింగసముద్రం ఎస్ఐ ఎం నారాయణ ఉప్పుటేరుకు ఇరువైపులా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ అడ్డుగా పెట్టి, పోలీసు సిబ్బందిని కాపలాగా ఉంచి రాకపోలు నిలిపివేయించారు. మన్నేరు సైతం ఉప్పొంగింది. వెంగళాపురంకు తూర్పున ఉన్న పొలాల్లోకి రైతులు వెళ్లేందుకు వీలు లేకుండా గండివాగుపై ఉన్న వంతెన వద్ద మట్టి కోతకు గురైంది. మొగిలిచెర్ల వద్ద నేరెళ్లవాగు, వీఆర్ కోట తూనుగుంట గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే బుధవాంరం ఉదయం నుంచి వరుణుడు శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



లింగసముద్రం: గండివాగుపై ఉన్న వంతెన వద్ద కోసుకొని పోయిన మట్టి

● కూలిన ఇంటిని పరిశీలించిన..

మండలంలోని వీఆర్ కోట పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో వర్షాలకు కూలిన సోమేపల్లి విజయమ్మ ఇంటిని తహసీల్దారు కే.కోటేశ్వరరావు ఆర్ఐ ఎం.రమణయ్యతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అమానుల్లాఖాన్, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్, అంగన్వాడీ కార్యకర్త కే.మమత, ఎంఎల్‌హెచ్‌వో ఎం.షర్మిల పాల్గొన్నారు.

● అప్రమత్తంగా ఉండండి

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావంతో పూర్తి స్థాయిలో నిండిన రాళ్లపాడు ప్రాజెక్టును బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆయన సందర్శించారు. రైతులకు దిగువ ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈలు వెంకటేశ్వర్లు, పీ.శేషయ్య, ఏఈ మనోహర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● తూముకు మరమ్మతులు

వలేటివారిపాలెం: మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని అంకభూపాలపురం కొత్త చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరింది. దీంతో తూము వద్ద లీకేజీ ఏర్పడి నీరు దిగువనున్న తూమలేరుకు వృథాగా ఎవడాన్ని గుర్తించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందిచారు. స్పందించిన అధికారులు స్థానికుల సహకారంలో ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి లీకేజీ నివారణకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామయ్య, పంచాయతీ కార్యదర్శి గణేష్, ప్రగడ మోహన్‌కుమార్, మంగి లాజర్, తాతిరెడ్డి వెంకటకొండారెడ్డి పాల్గొన్నారు.



వలేటివారిపాలెం : కూలిన పొగాకు బ్యారెన్

● కూలిన పొగాకు బ్యారెన్‌లు

వారం రోజులుగా కురిసిన వర్షాలకు వలేటి వారిపాళెం, ఉదయగిరి మండలాల్లో పొగాకు బ్యారెన్లు దెబ్బతిన్నాయి. వలేటివారిపాళెం మండ లం పోలినేనిచెరువులో రెండు పొగాకు బ్యారెన్లు దెబ్బతినగా, రూ.8 లక్షలు నష్టం వాటిల్లింది. శనివారపు కృష్టారెడ్డి, మాల్యాద్రిరెడ్డి జాయింట్ బ్యారెన్, నరాల మాధవ, నేలపాటి కరుణాకర్‌లకు చెందిన జాయింట్ బ్యారెన్లు కూలిపోయాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు పంచాయతీలోనూ పొగాకు బ్యారెన్ దెబ్బతిన్నది

● పునరావాస కేంద్రాల సందర్శన

ఉలవపాడు: మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధిత ప్రజలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. మన్నేటికోటలో తిరుపతి కుంట ఎస్టీలకు కల్పించిన పునరావాస కేంద్రం, కరేడు పంచాయతీ పరిధిలోని బాలకోటయ్య సంఘం తుఫాన్ షల్టర్‌లో ఆశ్రమం పొందుతున్న మర్రిచెట్టు సంఘం ఎస్టీలు, చాకిచర్ల పునరావాస కేంద్రంలోని బాధితలను పరామర్శించారు. శిబిరాల్లో కల్పించిన వసతులను పరిశీలించి వైద్య, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు.

● పోలీసులను అభినందించిన ఎస్పీ

మండలంలోని వీరేపల్లి చెరువు నిండిపోయి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గం ఏకైక రోడ్డు కోతకు గురై కాలనీవాసులు ఇబ్బందులకు ఎదుర్కుంటున్నారని తెలిసిన కందుకూరు డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, సీఐ అన్వర్‌బాషా, ఎస్సై అంకమ్మ తమ సిబ్బందితో మంగళవారం రాత్రి యుద్ధప్రాతిపదిక మీద చర్యలు చేపట్టారు. రోడ్డు మార్గానికి ఆటంకంగా ప్రవహిస్తున్న చెరువు నీళ్లను ఎక్స్‌కవేటర్‌తో పక్కదారికి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. ఆ రాత్రంతా గస్తీ ఏర్పాటు చేసి కాలనీవాసులకు భద్రత కల్పించారు. ఈ చర్యలను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు.



ఉలవపాడు: వీరేపల్లి చెరువు వద్ద పర్యవేక్షిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు



హర హరా.. శంకరా!

● భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

రాపూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాపూరులోని పురాతన శివాలయంలో కోటి సోమవారం పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామనాథేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం రామనాథేశ్వస్వామికి, పర్వతవర్ధిని అమ్మవారికి విశేష పూలంగి సేవ, ప్రాకారోత్సవం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. శివనామస్మరణతో ఆలయం మారుమోగింది.

నేడు కోటి సోమవారం

● భక్తిశ్రద్ధలతో శివకేశవులకు ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యో తి) : కార్తీక మాసం పండుగల మాసం. ఈ మాసం లో సోమవారాలు, సోమవార వ్రతాలు విశేషమైనవి. ఈ మాసంలో భక్తులు సోమవారం వ్రతాలు ఆచరిస్తారు. గురువారం కోటి సోమవారం ఇంకా విశిష్టమైనది. శ్రవణానక్షత్రం కార్తీక మాసంలో ఎప్పుడు వస్తుందో.. ఆ రోజే కోటి సోమవారం వ్రతాలు, పూజ లు చేస్తారు. సూర్యోదయంతో శ్రవణా నక్షత్రం కూడి నరోజు గురువారం రావడంతో జిల్లాలో శివకేశవుల ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు.

కోటి సోమవారం రోజు చేసే వ్రతం, ఉపవాసం, దానం కోటి రెట్లు పుణ్యఫలాన్ని ఇస్తాయని పురాణాల్లో పేర్కొన్నారు. కోటి సోమవారం ఉద యం నుంచి ఉపవా సం ఉండి ప్రదోషకాలంలో చేసే శివారాధన అత్యం త ఫలప్రదమైంది. ప్రదోషకాలం అంటే సూర్యాస్తమయం తర్వాత 2.24 గంటల



సమయాన్ని ప్రదోషకాలం అంటారు. ఆ సమయంలో కైలాసంలో పరమశివుడు అర్ధనారీశ్వర రూపంలో శివతాండవం చేస్తారు. ఆ సమయంలో దేవతలంతా పూజలు చేస్తారు. శివుడు ప్రసన్నుడై వారి కోర్కెలు తీర్చుతాడు. ఆ సమయంలో చేసే పూజ కూడా విశేష ఫలితాలను ఇస్తుందని శాస్త్ర వచనం. ప్రదోషకాలంలో శివలింగాలను ఆవుపాలతో అభిషేకాలు, అనంతరం మారేడు దళం, జిల్లేడు పూలు, తుమ్మి పూలతో పూజ చేయాలి. నైవేద్యం గా అరటిపండ్లు, కొబ్బరికాయలు సమర్పించాలి. కోటి సోమవారం శివాలయంలో దీపారాధన చేస్తే కోటి కార్తీక సోమవారాల దీపారాధన చేసి న ఫలితం లభిస్తుంది. అలాగే శివాలయంలో దీపదానం, వస్త్రదానం, సాలగ్రామ దానం, గోదానం చేయడం వల్ల కోటి సోమవారాలు శివారాధన ఫలితం లభిస్తుంది.ఈ రోజున పేదలకు అన్నదానం చేస్తే స్వర్గప్రాప్తి లభిస్తుంది. నదీ స్నానం చేస్తే 16వేల ఏళ్ల గంగాస్నానంతో సమానం. కోటి సోమవారం రోజున కన్యాదానం చేయడం వల్ల అశ్వమేధ యాగానికి సమానమైన ఫలితాన్ని ఇస్తుందని స్కంధ పురాణం చెబుతోంది. కోటి సోమవారం రోజు ఏ వ్రతాన్ని ఆచరించినా ఆ వ్రత ఫలితం అనంతం. శివాలయాల్లో ప్రదోషకాల వ్రతాలు, వైష్ణవ ఆలయాల్లో వెంకటేశ్వరస్వామి వ్రతం, సత్యనారాయణ వ్రతాలు చేస్తే అధిక పుణ్యఫలం సిద్ధిస్తుంది.

ఉచిత న్యాయ సేవలను

ఖైదీలు వినియోగించుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉచిత న్యాయసేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె విచ్చేసి ఖైదీల యోగా క్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి అన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా పేదలు న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చన్నారు. ఖైదీలు ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా మెలగాలని ఆమె సూచించారు. అనంతరం గ్రీవెన్స్ బాక్సును ఓపెన్ చేసి చూశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ బాల మహేష్, డిప్యూటీ చీఫ్ హర్ష, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు.. నిండా సమస్యలే!



12 ఏళ్లుగా ఆపరేట్ చేయని పాత స్పిల్‌వేలోని గేట్లు

● ప్రాజెక్టులో మొత్తం గేట్లు 17.. పని చేసేవి నాలుగే!
● 12 ఏళ్లుగా ఆపరేట్ చేయని పాత స్పిల్‌వేలోని క్రస్ట్ గేట్లు
● ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

లింగసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో దీర్ఘకాలంగా సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడిన ప్రతిసారీ ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. ప్రాజెక్టులోని పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్ గేట్లు, 2 షూడు గేట్లు, కొత్త స్పిల్‌వేలోని 5వ రేడియల్ గేటు ఆపరేట్ చేయక పోవడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే పాత స్పిల్‌వేలోని 12 గేట్లు 2013లో ఏర్పాటు చేశారు. కానీ అప్పటి నుంచి వాటిని ఆపరేట్ చేయడం లేదు. వీటిని ఆపరేట్ చేస్తే కౌంటర్‌వెయిట్లు తెగి పడతాయని భయం. అలాగే కొత్త స్పిల్‌వేలోని 5 గేట్లలో నాలుగు మాత్రమే పని చేస్తున్నాయి. 5వ గేటు రోప్ రెండేళ్ల క్రితం వంకర తిరిగింది. దీంతో దీనిని ఆపరేట్ చేయడం లేదు. అయితే ఈ పాత స్పిల్‌వే నుంచి 1 లక్ష క్యూసెక్కులు, కొత్త స్పిల్‌వే నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేసే సామర్థ్యం ఉంది. అయితే, కేవలం 4 గేట్లు మాత్రమే పని చేస్తుండగా, వీటి నుంచి 1.20 లక్షల క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేయొచ్చు. అంతకుమించి వరద పోటెత్తితే పరిస్థితి ఏమిటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు ద్వారా 60 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని డీఈ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

● అలాగే ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని రేడియల్ గేట్లకు ముందు స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు 2000వ సంవత్సరంలో ఈ స్పిల్‌వే నిర్మాణ సమయంలో కట్టడాలు నిర్మించారు. కానీ వాటిని ఏర్పాటు చేయలేదు. దీంతో 5వ గేటు మరమ్మతులకు గురైనా దానిని బాగు చేయాలంటే ఇప్పట్లో వీలుపడదు. ఇక ప్రాజెక్టు బ్రిడ్జి రోడ్డు కూడా 2012లో అభివృద్ధి చేసినా 12 సంవత్సరాలకే గుంతలు ఏర్పడి దారుణంగా తయారైంది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డుపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు

ప్రమాదపుటంచుల్లో కనిగిరి!

● 'ముంబయి' కలుజులకు గండి
● దెబ్బతిన్న మలిదేవి గేట్లు
● సదరన్ చానల్ ఎగువ ప్రాంతంలో కరకట్ట బలహీనం
● ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన పర్యవేక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలలో లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు, మూగజీవాలకు తాగునీరందించే కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉంది. వరద ఎక్కువై ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో ముంబాయి కలుజులకు అమర్చిన 5 (మలిదేవి రేడియల్ గేట్లు) గేట్లు పరిస్థితిని బట్టి ఒక్కొక్కటిగా లేపాల్సి ఉంటుంది. ఒక్క గేట్ నుంచి రోజుకు టీఎంసీ నీరు విడుదలౌతుంది. వీటికన్నా ముందు మలిదేవి కాలువకు 27 గేట్లతో ఉన్న మిట్ట కలుజుల నుంచి వరదను విడుదల చేస్తారు. ఇవికాకుండా పైడేరు ఎస్కేప్ ఛానల్‌లో ఉన్న 14 గేట్లు పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే గేట్లపైన ఉన్న వంతెన కూలే పరిస్థితిలో ఉంది. సదరన్ ఛానల్‌కు ఎగువ భాగంలోని రిజర్వాయర్ కరకట్ట పొడవునా పలుచోట్ల దెబ్బతిని ప్రమాదాలను తలపిస్తోంది. రిర్వాయర్‌లోని 'ఐ లాండ్' పరిసర ప్రాంతంలోని కరకట్టలో సుమారు 50 ఎకరాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలతో ఊట జలాలు బయటకు వస్తుండటంతో రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బత్తల హరికృష్ణ ఆధ్వర్యంలో ముంబాయి కలుజుల వద్ద ముళ్ల పొదలు తొలగింపు చర్యలు చేపట్టారు.



పూర్తిగా దెబ్బతిన్న పైడేరు ఎస్కేప్ చానల్ బ్రిడ్జి, షట్టర్లు

● దెబ్బతిన్న షట్టర్లు

ముంబాయి కలుజులో మలిదేవి లోలెవల్ మొదటి గేటుకు ఓ గండి, గేటు కింద మరో గండిపడి రిజర్వాయర్‌లోని జలాలు ఉధృతంగా మలిదేవి డ్రైన్‌లోకి ప్రవహిస్తున్నాయి. సుమారు 18 ఏళ్ల క్రితం వరద ముంపుతో ఎత్తిన గేట్లను ఆ తరువాత పట్టించుకున్న పాపానలేదు. దీంతో ఆ గేట్లన్నీ తుప్పుపట్టి పలుచోట్ల దెబ్బ తినడంతో లేస్తాయో లేదోననే అనుమానాలు ఆ శాఖ అధికారుల్లోనే వ్యక్తమవుతున్నాయి. అంతేగాక మిట్ట కలుజులోని 27 షట్టర్లలో మొత్తం చెక్కలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో సుమారు 1.5 టీఎంసీల మేర పూడిక ఉండడంతో వాస్తవ నీటి సామర్థ్యం కూడా కోల్పోయింది. ఎగువ నుంచి వరద ఎక్కువైతే కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుత నీటిమట్టం 2.3 టీఎంసీలు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నిర్వహణ పేరుతో నిధులు ఖర్చులు రాయడంతప్ప కనీసం రిజర్వాయర్ చుట్టూ ఒక్క ముళ్ళ పొదనూ తొలగించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై డీఈఈ పెంచలయ్యను వివరణ కోరగా రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగకుండా పైడేరు చానల్ ద్వారా 2వేలు క్యూసెక్కులకుపైగా విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వరద ప్రవాహం ఎక్కువైతే మలిదేవి కాలువకు విడుదల చేసే ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.



తుప్పుపట్టిన మలిదేవి లోలెవల్ రేడియల్ గేట్లను పైకిలేపే చైన్ వీల్స్

పెరుగుతున్న నీటిమట్టం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ నీటి మట్టం బుధవారం 19.3 అడుగులు (2.5 టీఎంసీ)కు చేరుకుంది. పైడేరు ఎస్కేప్ ఛానల్ ద్వారా 2,150 క్యూసెక్కులు, మిట్టకల్జుల ద్వారా 150 క్యూసెక్కుల మేర మలిదేవి కాలువలకు నీటిని విడుదల చేసినట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఉద్యాన పంటలపై తుఫాన్ ప్రభావం

కాపాడుకోండిలా..!

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి సూచనలు

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను జిల్లాలోని ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. వర్షం దాదాపుగా తగ్గుముఖం పట్టడంతో ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు రైతులు వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి సూచిస్తున్నారు. ముఖ్యంగా మిరప, అరటి, పసుపు, చేమగడ్డ, బొప్పాయి, కూరగాయల రైతులు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు.

● మిరప

మిరప తోటల్లో అధిక వర్షపు నీరు నిలువకుండా జగ్రత్తలు తీసుకోవాలి. వాలిపోయిన మిరప చెట్లను నిలబెట్టి చుట్టూ బోదెలను తయారు చేసుకోవాలి. మొక్కలు ఊటానికి వచ్చినప్పుడు ఒక లీటరు నీటిలో 10గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పైపాటుగా ఎకరాకి 50 కేజీల యూరియా, 20 కేజీల ఎంవోపీ, 200 కేజీల వేపపిండి వేయాలి. తెగుళ్లు రాకుండా నివారించేందుకు 10 లీటర్ల నీటిలో 30గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్(సీవోసీ), ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

● అరటితోటలు

అరటి తోటల్లో సాధ్యమైనంత త్వరగా నీటిని తొలగించాలి. వాలిపోయిన చెట్లకు కర్రలతో ఊతాన్నివ్వాలి. నేల ఆరిన తరువాత సేద్యం చేసి ఒక్కో మొక్కకి 100గ్రాముల యూరియా, 80గ్రాముల ఎంవోపీ వేయాలి. అరటి తోటలకు ఆకుమచ్చ తెగులు రాకుండా ఉండేందుకు లీటరు



నీటిలో ఒక మిల్లీ లీటరు ప్రోపికొనజోల్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. దుంప కుళ్లు నివారించేందుకు బోర్డో మిశ్రమం ఒక శాతం దుంప తడిసేలా పాదుల్లో వేయాలి.

● పసుపు, చేమగడ్డ

పొలాల్లో నిలిచిన వాన నీటిని తొలగించాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక లీటరు నీటిలో 2గ్రాముల రిడోమిల్ పిచికారీ చేయాలి. కుళ్లు తెగులు రాకుండా లీటరు నీటిలో 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్(సీవోసీ) కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

● బొప్పాయి

తోటల్లో నిలిచి నీటిని తొలగించి చెట్టు కాండానికి కుళ్లు తెగులు రాకుండా లీటరు నీటిలో 2 గ్రాముల రిడోమిల్ కలిపిన ద్రావణాన్ని మొదళ్లలో పోయాలి.

● కూరగాయలు

తోటల్లో నిలిచిన నీటిని తొలగించాలి. లీటరు నీటిలో 10గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. తోటలకు ఆకుమచ్చ తెగుళ్లు రాకుండా లీటరు నీటిలో ఒక గ్రాము బానిస్టన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మణం

● మృతులు యూపీ వాసులు

అనంతసాగరం అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం లో ఇద్దరు దుర్మణం చెందిన సంఘటన అనంతసాగరం మండలం ఉప్పలపాడు వద్ద 565 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు కడప జిల్లా ప్రొద్దుటూరులో స్వీట్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా, పెళ్లివేడుకలకు రాపూరు మండలంలోని పెంచలకోన పుణ్యక్షేత్రంకు బుధవారం రాత్రి మూడు కార్లలో బంధువులు, మిత్రులు బయలుదేరారు. అం దులోని ఓ కారు ఉప్పలపాడు కూడలి సమీపంలో రోడ్డు కుడివైపు నిలిపి ఉన్న వరికోత యంత్రం లారీని ఢీకొంది. దీంతో కారులోని ఏడుగురిలో సయ్యద్ ఆసీఫ్ (20), బాషా (50) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు నయిమ్, అషరఫ్, కరన్‌పాల్, ఆది ల్‌పాల్, జబీవుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసు కున్న సోమశిల, అనంతసాగరం పోలీసులు సంఘటనా స్థలికి చేంకొని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన ఐదుగురిని అనంతసాగరం, మర్రిపాడు 108 వాహనాల ద్వారా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సర్దార్ పటేల్ జయంతికి ఏర్పాట్లు : వీఎస్‌యూ వీసీ

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయిపటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీఎస్‌యూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం యువభారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వల్లభాయి పటేల్ ఐక్యతా సూత్రాలను పాటించడం ద్వారా యువత దేశాభివృద్ధికి తోడ్పడేలా వారిని చైతన్య పరుస్తామన్నారు. వీఎస్‌యూ తరపున అన్నీ కళాశాలల్లో పటేల్ జయంతి ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 31వతేదీన నగరంలో వీఆర్‌సీ నుంచి పటేల్ విగ్రహం వరకు, నవంబరు 7న కావలిలో పాదయాత్రంలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి, కమ్యూనికేషన్ అధికారి హరికృష్ణ, ఎన్‌వైకే అధికారి ఆకుల మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసులు

వికసిత్ భారత్‌లో ఫార్మాది కీలక పాత్ర

● కావలి వీఎస్‌యూ కళాశాలలో ఫార్మా కాలేజ : వీసీ అల్లం శ్రీనివాసరావు

కావలి(టౌన్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశయమైన వికసిత్ భారత్ సాకారంలో ఫార్మా రంగం కీలక పాత్ర పోషించనుందని విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్‌యూ పీజీ కళాశాలలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో రిజిస్ట్రార్ కే.సునీత, డీన్ రమణా రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి వీసీ మాట్లాడారు. కొవిడ్ సమయంలో భారతదేశంలోని ఫార్మా రంగం వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచం మొత్తం సప్లై చేసిందన్నారు. మారుతున్న కాలానుగుణంగా యువత ఫార్మా రంగం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల ద్వారా కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి ఆయా రంగాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. కావలి పీజీ కళాశాలలో కాలేజ్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాల ప్రారంభం అయ్యిందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై ఏపీ ఎంసెట్‌లో అర్హత సాధించిన వారు కళాశాలలో ప్రవేశం పొందేందుకు అర్హులన్నారు. 60 సీట్లతో పాటు ఈడబ్ల్యుఎస్‌కు మరో 6 సీట్లతో కలిసి 66 సీట్లు ఉన్నాయని, 62 సీట్లు ఫస్ట్ కౌన్సెలింగ్‌లో భర్తీ అయ్యాయని తెలిపారు. డిమాండ్‌ను బట్టి భవిష్యత్‌లో మరిన్ని సీట్లు పెంచుతామని మాస్టర్ ఆఫ్ ఫార్మసీ కూడా ప్రవేశపెడతామన్నారు. కావలి పీజీ కళాశాలకు పూర్వవైభం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వీఎస్‌యూ నెల్లూరు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 110 మంది గైర్హాజరు

వెంకటాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహప రి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో 110 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల కు మొత్తం 805 మంది విద్యార్థులకుగాను 695 మంది హాజర య్యారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడ ల్లో పాల్గొని పతకాలు సాధించిన అత్యుత్తమ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీవో ఆర్‌కె.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపా రు. శాప్ క్రీడాయాప్ వెబ్‌సైట్ అయిన స్పోర్ట్స్ డాట్ ఏపీ డాట్ జీటీవీ డాట్ ఇన్ లోకి వెళ్లి రిజిస్ట్రేషన్స్, ప్లేయర్ రిజిస్ట్రేషన్‌లో నవంబరు 4లోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కు నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సం ప్రదించాలని ఆయన తెలిపారు.

86 వైద్య శిబిరాలు

నెల్లూరు (వైద్యం) : తుఫాన్ బాధితుల కోసం వైద్య ఆరోగ్య శాఖ 86 వైద్యశిబిరాలను ఏర్పాటు చేసింది. 77 పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి తక్షణ వైద్యం కోసం శిబిరంలో వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. శిబిరాల ద్వారా 4200 మంది రోగులకు వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను డీఎంహెచ్‌వో సుజాత, పలువురు అధికారులు పర్యవేక్షించారు.

5 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక

● జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి

ఆత్మకూరు, అక్టోబరు 29 : వర్షాలకు జిల్లాలో 1,295 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సర్వేలో తేలిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి సత్యవాణి తెలిపారు. బుధవారం ఆత్మకూరులోని ఏడీఏ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఐదు రోజుల్లో పంట నష్టాలను పూర్తిస్థాయిలో అంచనా వేసి రైతుల పేర్లు, వారి బ్యాంకు ఖాతా నెంబర్లతో ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు రైతులు సహకరించి వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు యూరియా కొరత లేకుండా ముందస్తుగా 94,600 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇప్పటికే 11 వేల టన్నుల యూరియా దిగుమతి అయిందన్నారు. ముందుగా వరినారు పోసుకునే రైతులకు యూరియాను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏడీఏ వి శేషగిరిరావు, నెల్లూరు ఏడీఏ సి నర్సోజీరావు, అగ్రిల్యాబ్ టెక్నికల్ ఏవో పి చంద్రభాను, ఆత్మకూరు ఎంఏవో కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఆలయాలు జాతి వైభవానికి చిహ్నాలు

● త్రిదండి రామానుజ చిన్న జీయర్ ● వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతి వైభవానికి చిహ్నాలు దేవాలయాలని త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వెల్లడించారు. బుధవారం నెల్లూరు మూలాపేటలో ఉన్న పురాతన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ సంభాషణ చేశారు. దేశంలో తెలుగు జాతికి ఉన్న చరిత్ర మరే జాతికీ లేదని పేర్కొన్నారు. తెలుగు జాతికి రెండు వేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందని తెలిపారు. రామేశ్వరం, మధురై ప్రాంతాల్లోని పురాతన ఆలయాల్లో తెలుగు లిపితో శాసనాలు కనిపిస్తాయన్నారు. వేణుగోపాలుని ఆలయ చరిత్ర 10 తరాలకు తెలిసేలా సర్వాంగ సుందరంగా నూతన నిర్మాణం చేయాలని ఇందులో ధర్మకర్తలు, దేవదాయ శాఖతోపాటు భక్తులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సుందరీకరణ పేరుతో పాత ఆలయాల స్థానంలో నూతన ఆలయాలు నిర్మిస్తే ఆయా ఆలయాల చరిత్రకు భంగం వాటిల్లుతుందని, ఈ విషయంలో దేవదాయ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఆలయ శంకుస్థాపన వేళకు మొంథా తుపాను నెమ్మదించి వర్షం ఆగడంపై చిన్న జీయర్ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఆలయానికి పూర్వవైభవం వస్తుందని మంగళశాసనాలు చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వేణుగోపాలస్వామి ఆలయాన్ని తమ పెద్దలు ఐదు తరాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. ఆలయం ఇటుక రాతి కట్టడం కావడంతో శిథిలావస్థలకు చేరిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జీయర్ స్వామి ఆశీస్సులతో పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ స్వామీజీ సూచనల మేరకు వేణుగోపాల స్వామి ఆలయాన్ని అనుకున్న సమయంకంటే ముందుగానే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ముజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సభ్యులు తుమ్మల సుమన్, తేజరెడ్డి, ఆనం చంద్రశేఖర్ రెడ్డి, మన్నెల లక్ష్మీనాథ్‌రెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చిన్న జీయర్, మంత్రి రామనారాయణ



ఆలయ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీయర్ స్వామి, మంత్రి తదితరులు